నీట్-పీజీ ఫలితాలు వెల్లడి 2




# మనం

జనం కోసం అక్షర యజ్ఞం..

హైదరాబాద్ - శుక్రవారం 25 సెప్టెంబర్ 2026 | సంపుటి: 10 | సంచిక: 260 | పేజీలు:12 | వెల రూ.5

సాహిల్ తల్లిదండ్రుల నిరాహార దీక్ష 2




HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM | GUNTUR | TIRUPATI | KURNOOL | ELURU | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA


## సీఎం రేవంత్‌కు బెస్ట్ పబ్లిక్ సర్వెంట్ అవార్డు

### నేడు కేరళంలో అందుకోనున్న ముఖ్యమంత్రి!

### రైతు, బీసీ, ప్రజా సంక్షేమ పాలనకు గుర్తింపు



హైదరాబాద్, సెప్టెంబర్ 24 (మనం బ్యూరో): రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ప్రతిష్టాత్మక ఆర్యదాన్ ముహమ్మద్-2026 బెస్ట్ పబ్లిక్ సర్వెంట్ అవార్డుకు ఎంపికయ్యారు. కేరళకు చెందిన దిగ్గజ కాంగ్రెస్ నేత, దివంగత ఆర్యదాన్ ముహమ్మద్ స్మారకార్థం ఈ అవార్డును అందజేస్తున్నారు. తెలంగాణలో రైతులు, వెనుకబడిన వర్గాలు, సామాన్య ప్రజల సంక్షేమానికి సీఎం చేపట్టిన వినూత్న కార్యక్రమాలు దూరదృష్టి గత నాయకత్వానికి గాను ఈ అవార్డుకు ఎంపిక చేసినట్లు ఫౌండేషన్ చైర్మన్, విలంబూర్ ఎమ్మెల్యే ఆర్యదాన్ షౌకత్ తెలిపారు. అవార్డు ఎంపికకు బెన్నీ బెహనన్, కేరళ రెవెన్యూ శాఖ మంత్రి అనిల్‌కుమార్, ప్రముఖ మేధావి కల్పేట్టా ...మిగతా 2లో

## రోడ్డు ప్రమాదాల నివారణకు టీజీ-టీమార్స్ ఏర్పాటు

### సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వం

### నిర్వహణ కోసం ప్రత్యేక మేనేజ్‌మెంట్ ఫండ్

### నిత్యం వేధిస్తున్న సమస్యలకు శాశ్వత పరిష్కారం

హైదరాబాద్, సెప్టెంబర్ 24, (మనం బ్యూరో): రాష్ట్రంలో నిత్యం వేధిస్తున్న ట్రాఫిక్ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడంతో పాటు రోడ్డు ప్రమాదాలను అరికట్టేందుకు సీఎం రేవంత్ రెడ్డి కీలక నిర్ణయం తీసుకున్నారు. ట్రాఫిక్ నియంత్రణను శాస్త్రీయ పద్ధతిలో నిర్వహించడం, అత్యవసర వైద్య సాయం అందించడం లక్ష్యంగా తెలంగాణ ట్రాఫిక్ మేనేజ్మెంట్, రోడ్, రైల్ సేఫ్టీ బ్యూరోను ఏర్పాటు చేశారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు గురువారం జీవో 135 విడుదల చేశారు. సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన నడిచే రాష్ట్ర రోడ్డు భద్రతా మండలి పరిధిలోనే ఈ కొత్త వ్యవస్థ పనిచేస్తుంది. ఈ ప్రత్యేక విభాగం అదనపు డీజీపీ లేదా ఐజీపీ స్థాయి అధికారి ...మిగతా 2లో



# 22ఏ నిషేధిత భూములపై సర్కార్ కీలక నిర్ణయం




## జీహెచ్‌ఎంసి, డీటీసీపీ, హెచ్‌ఎండిఏ పరిధిలో రిజిస్ట్రేషన్లు

### తక్షణమే అమలయ్యేలా ఉత్తర్వులు జారీ

### జిల్లా స్థాయిలో సమస్యల పరిష్కారానికి కమిటీ

### 22ఏ సమస్యలకు ఒక్కొక్కటిగా పరిష్కారం: మంత్రి పొంగులేటి

హైదరాబాద్, సెప్టెంబర్ 24, (మనం బ్యూరో): 22ఏ నిషేధిత భూముల విషయంలో తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. జీహెచ్‌ఎంసి, డీటీసీపీ, హెచ్‌ఎండిఏ అనుమతి ఉంటే 22ఏ పరిధిలో ఉన్నప్పటికీ రిజిస్ట్రేషన్లు చేసుకోవచ్చని స్పష్టం చేసింది. తక్షణమే ఈ ఆదేశాలు అమలులోకి వస్తాయని ప్రభుత్వం తెలిపింది. అంతకు ముందు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో 22ఏ అంశంపై సీనియర్ మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి భేటీ అయ్యారు. ఈ అంశంపై సుదీర్ఘ చర్చ జరిగిన అనంతరం ప్రభుత్వం కీలక ఆదేశాలు జారీ చేసింది. 22ఏలో ఉన్నప్పటికీ సంబంధిత ప్రభుత్వ సంస్థల నుంచి చట్టబద్దమైన అనుమతులు పొంది అభివృద్ధి చేసిన ఓపెన్ ప్లాట్లు, ఇళ్లకు నిర్దేశిత నిబంధనల మేరకు రిజిస్ట్రేషన్లు చేసుకునే అవకాశం కల్పిస్తూ రెవెన్యూ శాఖ జారీ చేసిన ఉత్తర్వులలో పేర్కొంది. అలాగే, జీహెచ్‌ఎంసి, హెచ్‌ఎండిఏ, పురపాలక సంస్థలు, డీటీసీపీ, ఇతర పట్టణ, గ్రామీణ స్థానిక సంస్థల నుంచి చెల్లుబాటు అయ్యే లే అవుట్, భవన నిర్మాణం లేదా అపార్ట్‌మెంట్ అనుమతులు పొందిన ఆస్తులకు ఈ నిర్ణయం వర్తిస్తుంది. అనుమతి పొందిన అనంతరం జరిగిన రిజిస్ట్రేషన్లకు సంబంధించి ఏదో ఒక లింక్ డాక్యుమెంట్ తప్పనిసరిగా సమర్పించాల్సి ఉంటుంది. మరోవైపు, రాష్ట్ర ప్రభుత్వం 22ఏ భూములపై కొత్త ...మిగతా 2లో

## ఆసుపత్రుల్లో అగ్నిప్రమాదాల నివారణపై ఉక్కుపాదం



- అన్ని వైద్యారోగ్య కేంద్రాల్లో ఆడిట్ నిర్వహించాలి
- లోపాలున్నచోట తక్షణమే దిద్దుబాటు చర్యలకు ఆదేశం
- ఫైర్ సేఫ్టీ ప్రమాణాలపై మంత్రి దామోదర సమీక్ష

హైదరాబాద్,సెప్టెంబర్ 24(మనం న్యూస్): రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రుల్లో అగ్నిప్రమాదాల నివారణా చర్యలపై వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ దృష్టి సారించారు. రోగుల ప్రాణ రక్షణే సర్వోపరిగా భావించి, వైద్య ఆరోగ్య కేంద్రాలన్నింటిలోనూ ఫైర్ సేఫ్టీ ప్రమాణాల అమలు, లోపాల గుర్తింపు, వాటిని సరిదిద్దే మార్గాలపై గురువారం సచివాలయంలో అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు.ప్రభుత్వ ఆసుపత్రులలో అగ్నిమాపక భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని, ఎప్పటికప్పుడు క్రమం తప్పకుండా ఫైర్ ఆడిటింగ్ చేయిస్తున్నామని ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు మంత్రికి వివరించారు. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన ఫైర్ ఆడిట్‌లలో వెలుగుచూసిన అంశాలు, ఇప్పటివరకు తీసుకున్న చర్యల పురోగతిని మంత్రి ఆరా తీశారు.

**లోపాలు సహించేది లేదు..**

ఆసుపత్రుల తనిఖీల సమయంలో ఎక్కడైనా ఫైర్ సేఫ్టీ నిబంధనల్లో లోపాలు లేదా ...మిగతా 2లో

## గణేశ్ నిమజ్జన బందోబస్తు విధుల్లో ఉన్న ఎస్ఐ వెంకన్న దుర్మరణం

- అత్యంత బాధాకరమన్న రేవంత్
- పోలీసు కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపిన సీఎం



హైదరాబాద్, మనం ప్రతినిధి: భాగ్యనగర గణేశ్ నిమజ్జన బందోబస్తు విధుల్లో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. హైదరాబాద్ ట్యాంక్‌బండ్‌పై గుర్తుతెలియని వాహనం ఢీకొని తీవ్రంగా గాయపడిన ఓ సబ్-ఇన్‌స్పెక్టర్, చికిత్స పొందుతూ మృతిచెందారు. వరంగల్ జిల్లాకు చెందిన కున్సోత్ వెంకన్న (57),భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టూటౌన్ ఠాణాలో ఎస్సైగా పనిచేస్తున్న ఆయన నిమజ్జన బందోబస్తు కోసం ప్రత్యేకంగా హైదరాబాద్‌కు వచ్చారు. విధుల్లో ఉండగానే ప్రమాదానికి గురై ప్రాణాలు కోల్పోయారు. వివరాలిలా ఉన్నాయి... ఎన్టీఆర్ గార్డెన్ ఫుట్‌ఓవర్ బ్రిడ్జి వద్ద ఎస్సై వెంకన్నకు విధులు కేటాయించారు. మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత సుమారు 2 గంటల సమయంలో, సచివాలయం వైపు నుంచి ...మిగతా 2లో

## ఎకరా కూడా ఎండనివ్వబోం

### జూరాల ఆయకట్టుకు వారాబందీ పద్ధతిలో సాగునీరు

### ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు నీటి విడుదలపై సమీక్ష

### బీఆర్ఎస్ పాలనపై మంత్రులు శ్రీహరి, జూపల్లి తీవ్ర విమర్శలు



హైదరాబాద్,సెప్టెంబర్ 24(మనం న్యూస్): జూరాల ప్రాజెక్టు ఆయకట్టు రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా వారాబందీ విధానంలో సాగునీటిని అందిస్తామని రాష్ట్ర క్రీడా, పశుసంవర్ధక శాఖల మంత్రి వాకిటి శ్రీహరి స్పష్టం చేశారు. అన్నదాతలను కంటికి రెప్పలా కాపాడుకునే బాధ్యత ప్రజా ప్రభుత్వానిదేనని, జిల్లాలో ఒక్క ఎకరా పొలం కూడా ఎండనివ్వబోమని తేల్చిచెప్పారు.వనపర్తి జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో గురువారం ఉమ్మడి పాలమూరు జిల్లా ఇరిగేషన్ శాఖ అధికారులతో మంత్రులు వాకిటి శ్రీహరి, జూపల్లి కృష్ణారావు,ఎంపీ మల్లు రవి, ...మిగతా 2లో



## దానం పిటిషన్ డిస్మిస్

నాగేందర్‌పై అనర్హత వేటు వేస్తూ హైకోర్టు ఇచ్చిన తీర్పును సమర్థించిన సుప్రీం

సుప్రీం తీర్పును గౌరవిస్త 'దానం' దారెటు? 3

## విశ్వరూపం దాలుస్తున్న భాగ్యనగరికి కొత్త చట్టంతో సరికొత్త దిశ

### అమలులోకి వచ్చిన క్యూర్ చట్టం-2026

అవినీతి రహిత పాలన.. పర్యావరణ పరిరక్షణ.. ఉపాధికి బాటలు.. పారదర్శక పౌర సేవలు.. సేవల్లో లోపాలకు ఫిర్యాదులు చేయవచ్చు.. హైడ్రాకు చట్టబద్ధత




## స్లీపర్ బస్సులో మంటలు 9 మంది సజీవదహనం

ప్రధాని దిగ్భ్రాంతి.. రూ.2 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటన



9

## ఇతర దేశాల శాటిలైట్లను బ్లాక్ చేస్తున్న బ్రిటన్

### వెల్లడించిన ఆ దేశ వాయుసేన చీఫ్

లండన్, సెప్టెంబర్ 24: అంతరిక్షంలో ఆధిపత్యం కోసం ఏ దేశానికి ఆదేశం వ్యూహాత్మక కార్యక్రమాలు చేపడుతున్నాయి. ఆయా కార్యకలాపాలు ముఖ్యంగా అంతరిక్షంలోనే నిర్వహిస్తున్నాయి. అంతరిక్షంలో ఆయుధాలను మోహరించినట్లు ఇటీవల అమెరికా తొలిసారి అంగీకరించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే తాను ఏం తక్కువ కాదన్నట్టు బ్రిటన్ కూడా మరో నిజం వెల్లడించింది. ఇతర దేశాలకు చెందిన ఉపగ్రహాలను జామింగ్ లేదా బ్లాక్ చేస్తున్నట్లు తెలియజేసింది. అయితే, ...మిగతా 2లో



## సర్‌పై ఎన్నికల సంఘంలో విభేదాల వ్యవహారం

### జ్ఞానేశ్ కుమార్ తక్షణమే రాజీనామా చేయాలి

### రాహుల్ గాంధీ డిమాండ్

ఢిల్లీ, సెప్టెంబర్ 24: ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)విషయంపై ఎన్నికల సంఘంలో విభేదాలున్నట్లు వార్తలు వచ్చిన నేపథ్యంలో లోక్సభలో ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. 'ఓటు చోరీ' ద్వారా ఎంపీలుగా గెలిచిన వారు చేసిన చట్టాలు చెల్లబోవని చెప్పారు. ఢిల్లీలో నిర్వహించిన మీడియా సమావేశంలో రాహుల్గాంధీ మాట్లాడారు. మహారాష్ట్ర, హరియాణాలో ఓటు చోరీ జరిగిందని కాంగ్రెస్ ...మిగతా 2లో

### 48 గంటల్లో రిజైన్ చేయాల్సిందే

- లేని పక్షంలో జంతర్ మంతర్ 2.0 చేపడతాం
- సీజేపీ ప్రతినిధులు దీప్కే, సౌరవ్ దాస్



ఢిల్లీ, సెప్టెంబర్ 24: ఎన్నికల సంఘం ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) అంశంపై కాక్రోచ్ జనతా పార్టీ తీవ్ర స్థాయిలో స్పందించింది. ప్రధాన ఎన్నికల కమిషనరు (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ 48 గంటల్లో రాజీనామా చేయాలని ...మిగతా 2లో

ఆ వినాశకర సాఫ్ట్ వేర్‌ను రద్దు చేయండి కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్

2 జ్ఞానేశ్‌పై అభిశంసన! సిద్ధమవుతున్న విపక్షాలు

# ఆసుపత్రుల్లో అగ్నిప్రమాదాల నివారణపై ఉక్కుపాదం



(మొదటి పేజీ తరువాయి)

వ్యత్యాసాలు కనిపిస్తే, ఉపేక్షించే ప్రసక్తే లేదని మంత్రి స్పష్టం చేశారు. అప్రమత్తత లోపించిన చోట తక్షణమే రక్షణ చర్యలు చేపట్టాలని, నిబంధనలు కచ్చితంగా అమలయ్యేలా చూడాలని అధికారులను ఆదేశించారు. రోగుల ప్రాణాలతో చెలగాటమాడే యాజమాన్యాలపై కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు.ఈ సమావేశంలో విద్యా, వైద్య శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నవీన్ మిట్టల్, ప్రిన్సిపల్ సెక్రటరీ క్రిస్టినా జడ్ చొంగ్తు, ఫైర్ సేఫ్టీ డిపార్ట్మెంట్ డీజీ విక్రమ్ సింగ్ మాన్, హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ డాక్టర్ సంగీత సత్యనారాయణతో పాటు హెల్త్, ఎనర్జీ, ఆర్ అండ్ బీ తదితర సంబంధిత శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# 22ఏ నిషేధిత భూములపై సర్కార్ కీలక నిర్ణయం

(మొదటి పేజీ తరువాయి)

కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీకి టెక్నికల్ ఎడ్యుకేషన్ కమిషనర్ శ్రీదేవసేన చైర్‌పర్సన్‌గా ఉంటారు. ఇందులో సభ్యులుగా రాజీవ్‌గాంధీ హనుమంతు, సందీప్‌కుమార్ ఝా, ఆయా జిల్లాల కలెక్టర్లు ఉంటారు. అక్రమాలు, నిబంధనల ఉల్లంఘనలపై విచారణ చేసేందుకే దీనిని ఏర్పాటు చేశామనీ ఈ కమిటీ 22ఏ భూముల అంశానికే పరిమితం కాదని ప్రభుత్వం తెలిపింది.

**22ఏ సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి : మంత్రి పొంగులేటి**

22ఏ సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి చేస్తున్నామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఈ సమస్యల పరిష్కారంలో ఇప్పటికే ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు అమలులోకి వచ్చిన నిర్ణయాలే నిదర్శనమని చెప్పారు. రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాల్లోని దాదాపు 54 కాలనీల ఇళ్ల క్రమబద్ధీకరణకు అనుగుణంగా జీవో 118 జారీ, దశాబ్దకాలంగా పెండింగ్‌లో ఉన్న సింగరేణి కార్మికుల ఇళ్ల క్రమబద్ధీకరణ సమస్యను కూడా ప్రభుత్వం జీవో 76 ద్వారా పరిష్కరించే దిశగా ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుందని పేర్కొన్నారు. భూమి, ఇల్లు వంటి అంశాల్లో ప్రజలు సంవత్సరాల తరబడి ప్రభుత్వ కార్యాలయాలు, కోర్టుల చుట్టూ తిరిగే పరిస్థితికి శాశ్వతంగా ముగింపు పలకడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఈ ప్రక్రియలో ఏవైనా సమస్యలు తలెత్తితే వాటిని పరిశీలించి పరిష్కరించేందుకు జిల్లా స్థాయి కమిటీలు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. .ఈ కమిటీలో జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్, జిల్లా రిజిస్ట్రార్, హెచ్‌ఎండిఏ నగర పాలక సంస్థ, గ్రామీణ స్థానిక సంస్థల ప్రతినిధులు ఉంటారని పేర్కొన్నారు. 22ఏలోని అన్ని భూములను ఒకే గాటన కట్టకుండా భూమి స్వభావం, అందుబాటులో ఉన్న రికార్డులు, చట్టబద్ధమైన అనుమతులు, న్యాయపరమైన అంశాలను పరిశీలించి అర్హమైన సమస్యలకు సత్వర పరిష్కారం చూపుతామని ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు.



# నీట్-పీజీ ఫలితాలు వెల్లడి

ఢిల్లీ, సెప్టెంబర్ 24: దేశ వ్యాప్తంగా వైద్య విద్యలో పోస్ట్ గ్రాడ్యుయేట్ (పీజీ) కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన నీట్ పీజీ పరీక్ష ఫలితాలు విడుదలయ్యాయి. ఈ ఫలితాలను గురువారం మధ్యాహ్నం నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఇన్ మెడికల్ సైన్సెస్ విడుదల చేసింది. ఆగస్టు 30న నిర్వహించిన నీట్- పీజీ పరీక్షకు 2,63,544 మంది హాజరు కాగా.. సెప్టెంబర్ 5న జైపూర్‌లో నిర్వహించిన ఈ పరీక్షకు 2416మంది అభ్యర్థులు హాజరైనట్లు బోర్డు తెలిపింది. అభ్యర్థుల అప్లికేషన్ సీక్వెన్స్ నంబర్, రోల్ నంబర్, సాధించిన స్కోరు, నీట్ పీజీ 2026 ర్యాంకులతో కూడిన ప్రత్యేక జాబితాతో పాటు కటాఫ్ స్కోరును కూడా విడుదల చేసింది. అక్టోబర్ 1నుంచి అభ్యర్థులు తమ స్కోరు కార్డులను అధికారిక వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని అధికారులు సూచించారు.

# గణేశ్ నిమజ్జన బందోబస్తు విధుల్లో ఉన్న ఎస్ఐ వెంకన్న దుర్మరణం

(మొదటి పేజీ తరువాయి)



అంబేద్కర్ విగ్రహం వైపు వేగంగా, నిర్లక్ష్యంగా వస్తున్న ఓ ద్విచక్ర వాహనదారుడు వెంకన్నను బలంగా ఢీకొట్టాడు. ఈ ఘటనలో ఎస్సై రోడ్డుపై పడిపోగా తల, కుడి మోకాలు, కుడి చేతికి తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాదానికి కారణమైన వ్యక్తి పరారయ్యాడు. వెంకన్నను లక్డీకాపూల్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స అందించారు. కాస్త కోలుకున్న తర్వాత ఆయన సైఫాబాద్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఘటనపై ఫిర్యాదు చేసి, అనంతరం తన స్వగ్రామమైన కిష్టాపురానికి బయలుదేరారు. అయితే, గ్రామానికి చేరుకున్నాక మధ్యాహ్నం తర్వాత ఆయన ఆరోగ్యం ఒక్కసారిగా క్షీణించింది. దీంతో కుటుంబ సభ్యులు వెంటనే స్థానిక ఆసుపత్రికి తరలించగా, తలలో తీవ్ర రక్తస్రావం జరిగినట్లు వైద్యులు నిర్ధారించారు. అక్కడ చికిత్స పొందుతూ వెంకన్న కన్నుమూశారు. ఈ ఘటనపై సైఫాబాద్ పోలీసులు కేసు నమోదు చేసి, పరారీలో ఉన్న నిందితుడి కోసం ముమ్మరంగా గాలిస్తున్నారు.

**అత్యంత బాధాకరమన్న రేవంత్**

విధుల్లో ఉన్న ఎస్ఐ కె. వెంకన్న మృతి చెందడం అత్యంత బాధాకరమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. శాంతిభద్రతల పరిరక్షణలో అంకితభావంతో విధులు నిర్వర్తిస్తూ ప్రాణాలు కోల్పోవడం విషాదకరమని వ్యాఖ్యానించారు. వెంకన్న మరణం ఆయన కుటుంబానికే కాకుండా మొత్తం పోలీసు శాఖకు తీరని లోటని అన్నారు. ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు. ఈ విషాదకరమైన సమయంలో వెంకన్న గారి కుటుంబ సభ్యులకు ముఖ్యమంత్రి గారు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. వారి కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. బాధ్యతారాహిత్యంగా వాహనం నడిపి ఈ ప్రమాదానికి కారణమైన నిందితుడిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశించారు.

# ఎకరా కూడా ఎండనివ్వబోం

(మొదటి పేజీ తరువాయి)

స్థానిక ఎమ్మెల్యేలు అత్యున్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. జూరాల ప్రాజెక్టులో ప్రస్తుత నీటి లభ్యత, ఆయకట్టు అవసరాలు, పంటల సాగుకు నీటి సరఫరా తదితర అంశాలపై అధికారులతో సమగ్రంగా చర్చించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంత్రులు మాట్లాడారు.

**రైతు సంక్షేమమే మా ధ్యేయం...**

కృష్ణా నదిలో లభ్యతగా ఉన్న నీటిని, జూరాల ఆయకట్టు అవసరాలను బేరీజు వేసుకుంటూ పద్ధతి ప్రకారం వారాబందీ పద్ధతిని అమలు చేస్తామన్నారు. వచ్చే వేసవి కాలంలో తాగునీటి సమస్య ఉత్పన్నం కాకుండా ఇప్పటి నుంచే పకడ్బందీ ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు మంత్రి శ్రీహరి వెల్లడించారు. ప్రాజెక్టు నిర్మాణ నాణ్యత గొప్పదని,ఎంతటి భారీ వరదలు వచ్చినా జూరాల స్థిరంగా నిలబడిందని కొనియాడారు. అందుబాటులో ఉన్న ప్రతి చుక్క నీటిని సమర్థవంతంగా వినియోగించి ఆయకట్టుకు జీవం పోస్తామని భరోసా ఇచ్చారు.

**గత పాలకుల నిర్లక్ష్యం వల్లే కష్టాలు..**

గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుపై కనీస శ్రద్ధ చూపలేదని మంత్రి వాకిటి శ్రీహరి మండిపడ్డారు. ఎన్నికల లబ్ధి కోసం నార్లాపూర్ వద్ద హడావుడిగా ఒక్క పంపును ఆన్ చేసి, ప్రాజెక్టు పూర్తయినట్లు పెద్దఎత్తున తప్పుడు ప్రచారం చేశారని ఆరోపించారు. పాలమూరు రైతుల ప్రయోజనాల కోసం వరద నీటి వినియోగంపై, కృష్ణా-భీమా నదులపై సరికొత్త బ్యారేజీల నిర్మాణంపై గత పాలకులు ఎందుకు దృష్టి పెట్టలేదని నిలదీశారు.

# ఇతర దేశాల శాటిలైట్లను బ్లాక్ చేస్తున్న బ్రిటన్

(మొదటి పేజీ తరువాయి)

ఇది కేవలం ఆత్మరక్షణ కోసమేనని పేర్కొంది. ఈ మేరకు బ్రిటన్ పబ్లిక్ సర్వీస్ బ్రాడ్ క్యాస్టర్ బీబీసీ వెల్లడించింది. భూ ఉపరితలం నుంచే ప్రత్యేక సాంకేతికతను ఉపయోగించి శత్రుదేశానికి చెందిన ఉపగ్రహాలు సమాచారాన్ని సేకరించకుండా ఆ దేశ వాయుసేన.. ది రాయల్ ఎయిర్ ఫోర్స్ ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు తెలిపింది. ముఖ్యంగా అణు నిల్వలు, అణు జలాంతర్గాముల కదలికలు, దేశ రక్షణతో సంబంధమున్న సున్నితమైన ప్రదేశాలకు సంబంధించిన సమాచారం శత్రు శాటిలైట్లకు చిక్కకుండా యూకే చర్యలు తీసుకుంటున్నట్టు ప్రకటించింది. తమ ఉపగ్రహాలను రక్షించుకోవడానికి ది రాయల్ ఎయిర్‌ఫోర్స్ (రాఫ్) తాజాగా మిలిటరీ స్పేస్ స్క్వాడ్రన్ను ఏర్పాటు చేసింది. ఈ సందర్భంగా రాఫ్ అధిపతి మాట్లాడుతూ.. అంతరిక్షంలోనూ శత్రువుల నుంచి తీవ్ర ముప్పు ఉందని వ్యాఖ్యానించారు. బ్రిటన్ అమలు చేస్తున్న ఉపగ్రహాల జామింగ్ అంశాన్ని ప్రస్తావించారు. మరోవైపు అంతరిక్షం నుంచి దేశానికి సంబంధించి సమాచారం శత్రువులకు చిక్కకుండా స్పేస్ స్క్వాడ్రన్ రక్షిస్తుందని యూకే రక్షణశాఖ వెల్లడించింది. శత్రుదేశాల క్షిపణిదాడుల గురించి ముందస్తుగా హెచ్చరించేందుకు, బ్రిటన్ ప్రయోగించిన ఉపగ్రహాలకూ ఈ స్క్వాడ్రన్ రక్షణ కల్పిస్తుందని, నౌకలకు దిశానిర్దేశం చేస్తుందని తెలిపింది. ప్రపంచంలో చాలా దేశాలు ఇలా భూ ఉపరితలం నుంచి ఉపగ్రహాలను జామింగ్ చేసే సాంకేతికతను వినియోగిస్తున్నట్లు సమాచారం.

ఇదే అంశంపై గతేడాది యూకే స్పేస్ కమాండ్ కీలక వ్యాఖ్యలు చేసింది. బ్రిటన్ శాటిలైట్లను రష్యా ప్రతివారం అడ్డుకునేందుకు ప్రయత్నిస్తోందని తెలిపింది. అంతేకాకుండా.. ఈ ఏడాది మే నెలలో రెండు వాణిజ్య ఉపగ్రహాలకు సమీపంగా ఐదు రష్యన్ ఉపగ్రహాలు కదులుతున్నట్లు రాఫ్ పసిగట్టింది. జూన్ నెలలోనూ రష్యన్ ఉపగ్రహాలు.. ఐరోపా, కెనడాలో జీపీఎస్ సంకేతాలకు అంతరాయం కలిగించినట్లు తెలిపింది.

# 48 గంటల్లో రిజైన్ చేయాల్సిందే

(మొదటి పేజీ తరువాయి)

డిమాండ్ చేసింది. లేదంటే జంతర్ మంతర్ వద్ద మరోసారి నిరసన కార్యక్రమాన్ని చేపడతామని(జంతర్ మంతర్ 2.0) హెచ్చరించింది. సర్‌పై జాతీయ మీడియాలో వచ్చిన కథనాలతో దుమారం చెలరేగిన నేపథ్యంలో ఢిల్లీలో మీడియా సమావేశం ఏర్పాటు చేసిన సీజేపీ ప్రతినిధులు.. త్వరలో జరగబోయే అన్ని రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలనూ నిలిపివేయాలని డిమాండ్ చేశారు. 'రెండు రోజుల్లోగా సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయకుంటే దేశ వ్యాప్తంగా నిరసనలు చేపడతాం. అనంతరం ఢిల్లీలో జంతర్ మంతర్ 2.0 తప్పకుండా చేపట్టి తీరుతాం. ఎన్నికల్లో అవకతవకలు జరిగాయని భావిస్తే విపక్షాలు ఎన్నికల ప్రక్రియలో పాల్గొనవద్దు. ప్రజాస్వామ్యానికి సీఈసీ ఓ ముప్పులా తయారయ్యారు. ఓటు హక్కు రద్దు చేసేందుకు ఆయన ఎవరు?' అని సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే ప్రశ్నించారు.

**జ్ఞానేశ్‌పై క్రిమినల్ చర్యలు కూడా తీసుకోవాలె..**

సీజేపీ కో-కన్వీనర్ సౌరవ్ దాస్ మాట్లాడుతూ.. మూడు డిమాండ్లను ఈసీ ముందు ఉంచుతున్నామని చెప్పారు. సీఈసీ రాజీనామా చేయడంతోపాటు ఆయనపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలన్నారు. సర్ను నిలిపివేసి 2025 ఓటర్ల జాబితానే పరిగణనలోకి తీసుకోవాలని, సర్‌కు సంబంధించిన ఫైళ్లన్నింటినీ సుప్రీం కోర్టు నియమించిన కమిటీ ఆధీనంలో ఉంచాలని కోరారు.

# సీఎం రేవంత్‌కు బెస్ట్ పబ్లిక్ సర్వెంట్ అవార్డు

(మొదటి పేజీ తరువాయి)

నారాయణన్ జ్యూరీగా వ్యవహరించారు. ప్రజాస్వామిక విలువలపై సీఎం రేవంత్ రెడ్డికి ఉన్న నిబద్ధతను ఈ సందర్భంగా జ్యూరీ ప్రత్యేకంగా కొనియాడింది. ఆర్యదాన్ ముహ్మద్ నాలుగో వర్ధంతిని పురస్కరించుకుని కేరళంలోని నిలంబూర్‌లో శుక్రవారం మధ్యాహ్నం 4 గంటలకు ఈ అవార్డును ప్రదానం చేస్తారు. పురస్కారం కింద రూ.లక్ష నగదు బహుమతి, ప్రశంసా పత్రం, జ్ఞాపికను అందజేస్తారు. వేడుకలో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్, ఆర్యదాన్ ముహమ్మద్ స్మారకోపన్యాసం చేస్తారు.

## రోడ్డు ప్రమాదాల నివారణకు టీజీ-టీమార్స్ ఏర్పాటు

(మొదటి పేజీ తరువాయి)

నేతృత్వంలో హైదరాబాద్ కేంద్రంగా పని చేస్తుంది. రాష్ట్రంలోని 32 వేల కి.మీ.ల కంటే ఎక్కువ ఉన్న రహదారులు, 1.8 కోట్లకు పైగా ఉన్న వాహనాల రాకపోకలను ఈ బ్యూరో పర్యవేక్షిస్తుంది. రోడ్డు రవాణాతో పాటు మెట్రో, రైల్వే భద్రతను కూడా ఈ విభాగానికే అప్పగించారు. బాధితుల ప్రాణాలను కాపాడేందుకు ప్రతి పోలీస్ స్టేషన్‌లో 24 గంటల పాటు రోడ్ యాక్సిడెంట్ రెస్పాన్స్ ఆఫీసర్‌ను నియమిస్తారు. ప్రమాదం జరిగిన వెంటనే క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించడం వీరి బాధ్యత. ఈ వ్యవస్థ నిర్వహణ కోసం ప్రత్యేకంగా ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ ఫండ్‌ను ఏర్పాటు చేశారు. పోలీసులకు ట్రాఫిక్ చలానాల ద్వారా వచ్చే మొత్తంలో 40 శాతాన్ని నేరుగా ఈ నిధికే మళ్లిస్తారు. ఈ నిధులను సిబ్బంది శిక్షణ, అధునాతన సాంకేతికత, పెట్రోలింగ్ వాహనాలు, అత్యవసర రోడ్డు మరమ్మత్తుల కోసమే వినియోగిస్తారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంతో రాష్ట్రంలో ప్రయాణాలు మరింత సురక్షితంగా మారనున్నారు.

# ఆ వినాశకర సాఫ్ట్‌వేర్‌ను రద్దు చేయండి

**కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్**

ఢిల్లీ, సెప్టెంబర్ 24: కొత్త ఓటర్లను చేర్చడం, పేర్లను తొలగించడం వంటి విషయాలు ఎన్నికల సంఘంలోని ఇద్దరు కమిషనర్లకు తెలియకుండా జరిగాయన్న ఆరోపణలు దేశవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తున్నాయి. ఈ తరుణంలోనే ఎన్నికల సంఘం సాఫ్ట్ వేర్ పైనా వివాదం చెలరేగుతోంది. ఆ వినాశకర సాఫ్ట్ వేర్ ను రద్దు చేయాలని కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ డిమాండ్ చేయడం చర్చనీయాంశమైంది.

గోవాలో సర్ సందర్భంగా చోటుచేసుకున్న పరిణామాలే థరూర్ స్పందనకు కారణం. ఆ రాష్ట్రంలో కొందరు ఓటర్ల విషయంలో వైరుధ్యాలను డేటాబేస్ గుర్తించింది. క్షేత్రస్థాయిలో పరిశీలన అనంతరం.. అందులోని 97 మంది తుది ఓటరు జాబితాలో చేర్పునకు అర్హులేనని ఓటరు నమోదు అధికారులు గుర్తించారు. అయితే వారి పేర్లను ఓటరు జాబితాలో పునరుద్ధరించేందుకు వారికి ఆప్షన్ అందుబాటులో లేదు. దీంతో రోల్ బ్యాక్ ఆప్షన్ కోసం గోవా ప్రధాన ఎన్నికల అధికారి ఈసీకి విన్నవించాల్సి వచ్చింది. కానీ, వారి నుంచి అనుమతులు లభించకపోవడంతో ఓటర్ల పేర్లు ఎంటర్ చేయలేకపోయారని, ఆ యాప్ ను ఢిల్లీ నుంచి నియంత్రిస్తున్నారని జాతీయ మీడియా కథనం గోవాలో ఓటరు జాబితాలో పేరు లేకపోతే.. కేవలం ఓటు మిస్ అవడమే గాకుండా, అనేక ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు కోల్పోతారు. ఇదే రాజకీయంగా తీవ్ర వివాదమవుతోంది. ప్రభుత్వ ఆసుపత్రులలో అందుబాటులో లేని సూపర్-స్పెషాలిటీ చికిత్సల (డయాలసిస్, యాంజియోప్లాస్టీ, ఓపెన్-హార్ట్ సర్జరీ, అవయవ మార్పిడి, కీమోథెరపీ వంటివి)కు నిధులు సమకూర్చే గోవా మెడిక్లెయిమ్ పథకం కేవలం ఆ రాష్ట్ర ఓటర్లకు మాత్రమే అందుబాటులో ఉందని ఆ కథనం పేర్కొంది. దీనిపైనే థరూర్ స్పందించారు. 'ఇది తీవ్రమైన విషయం. దీని ద్వారా భారత పౌరుల రాజ్యాంగ హక్కులు కోల్పోవడమే గాకుండా డయాలసిస్ వంటి పలు చికిత్సలకూ దూరం అవుతున్నారు. రాజకీయ కుతంత్రాలే చెడ్డవనుకుంటే.. ఇక అమానవీయ ప్రవర్తన ఏమాత్రం సహించలేనిది. దీనిపై ఎన్నికల సంఘం క్షమాపణ చెప్పాలి. రాజీనామా కోరడం చాలా చిన్న డిమాండ్. ఈ వినాశకరమైన సాఫ్ట్ వేర్ వెంటనే రద్దు చేయాలి. అది కలిగించిన నష్టాన్ని సరిదిద్దడం అత్యావశ్యకం' అని థరూర్ పోస్టు పెట్టారు.

# జ్ఞానేశ్‌పై అభిశంసన!

ఢిల్లీ, సెప్టెంబర్ 24: ఎన్నికల సంఘంలో విభేదాలున్నట్లు మీడియాలో కథనాలు వచ్చిన నేపథ్యంలో ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ను తొలగించాలని కోరుతూ పార్లమెంటు ఉభయ సభల్లో తీర్మానాన్ని ప్రవేశపెట్టేందుకు విపక్షాలు సిద్ధమవుతున్నట్టు సమాచారం. తీర్మానం ముసాయిదాను రూపొందించే పనిలో నిమగ్నమయ్యాయని, న్యాయ నిపుణుల పరిశీలన అనంతరం వారం రోజుల్లో ఈ నోటీసులు ఇవ్వనున్నట్లు సంబంధిత వర్గాల సమాచారం. సీఈసీపై నోటీసులకు సంబంధించి జాతీయ స్థాయిలో విపక్షాలు కలిసి పనిచేస్తున్నాయని తెలుస్తోంది. అయితే, సీఈసీ జ్ఞానేశ్ కుమార్ను తొలగించేందుకు ప్రయత్నాలు చేస్తున్న విపక్షాలు.. పార్లమెంటులో తీర్మానం పెడితే ఇది మూడోసారి అవుతుంది. గతంలో ఓసారి ఉభయ సభల్లో నోటీసులు ఇచ్చినప్పటికీ అవి తిరస్కరణకు గురయ్యాయి. ఆ తర్వాత సీఈసీని తొలగించాలని కోరుతూ ఏప్రిల్ 24న 73 మంది విపక్ష ఎంపీలు తీర్మానాన్ని ప్రవేశపెట్టగా.. ప్రస్తుతం అది రాజ్యసభలో పెండింగులో ఉంది.

## జ్ఞానేశ్ కుమార్ తక్షణమే రాజీనామా చేయాలి

(మొదటి పేజీ తరువాయి)

లేవనెత్తిన తర్వాతే.. ఇద్దరు ఎన్నికల కమిషనర్లు.. సీఈసీకు ఎస్ఐఆర్‌పై అభ్యంతరం వ్యక్తం చేశారని అన్నారు. జ్ఞానేశ్ కుమార్ అపూర్వర్గా మారాలని.. అది దేశ ప్రయోజనాలకు మంచిదని వ్యాఖ్యానించారు. ప్రస్తుత సీఈసీని ప్రధాని మోడీ, హోం మంత్రి అమిత్షా ఎంపిక చేశారని రాహుల్ గాంధీ అన్నారు. ప్రస్తుత గందరగోళానికి ఆయనే కారణమని ఇద్దరు కమిషనర్లు చెబుతున్న నేపథ్యంలో.. ఎంపిక చేసిన వాళ్లే బాధ్యత తీసుకోవాలని రాహుల్ డిమాండ్ చేశారు.

# అవినీతి జలగలు వర్సెస్ ఖరీదైన జైలు

## కోటీశ్వరులతో కిక్కిరిసిపోతున్న చంచల్‌గూడ జైలు

## లంచం, అక్రమాస్తుల కేసుల్లో పెరుగుతున్న అరెస్టులు




హైదరాబాద్, మనం ప్రతినిధి: హైదరాబాద్‌లోని చంచల్‌గూడ జైలు ఇప్పుడు 'కోటీశ్వరుల జైలు'గా మారిపోయింది. వందల కోట్ల రూపాయల అక్రమాస్తులు కూడబెట్టి, అవినీతికి పాల్పడి ఏసీబీకి పట్టుబడుతున్న బడా అధికారులు ఇప్పుడు ఈ జైలుకే చేరుతున్నారు. దీంతో ఒకప్పుడు సాధారణ ఖైదీలతో ఉండే ఈ జైలు, ఇప్పుడు కోట్ల రూపాయల ఆస్తులున్న వారితో నిండిపోతోందన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి.

తాజాగా, నిమ్స్ అదనపు సూపరింటెండెంట్ లక్ష్మీభాస్కర్ ఆదాయానికి మించి రూ.100 కోట్ల ఆస్తులు కూడబెట్టారనే ఆరోపణలపై అరెస్ట్ అయి చంచల్గూడ జైలుకు చేరారు. కొన్ని రోజుల క్రితమే డీఎస్పీ భీంరెడ్డి కూడా వంద కోట్లకు పైగా అక్రమాస్తుల కేసులో ఏసీబీకి చిక్కి ఇక్కడికే వచ్చారు. వీరే కాకుండా, ల్యాండ్ అండ్ సర్వే విభాగం డిప్యూటీ డైరెక్టర్ నరహరిరావు సైతం రూ.100 కోట్లకు పైగా ఆస్తుల కేసులో అరెస్టయి రిమాండ్‌లో ఉన్నారు. ఇలా పోలీసు, రెవెన్యూ, వైద్య, ఇంజనీరింగ్ వంటి పలు శాఖలకు చెందిన ఉన్నతాధికారులు ఏసీబీ వలలో చిక్కి చంచల్‌గూడ జైలుకు చేరుతుండటం విశేషం. అయితే, దున్నపోతు మీద వాన పడ్డ చందంగా అవినీతి కేసుల్లో ప్రధానంగా రెండు రకాలుగా అధికారులు పట్టుబడుతుండగా... (1), చేయాల్సిన పనికి నేరుగా లంచం డిమాండ్ చేయడం. (2), ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టడం. ఈ రెండు కేసుల్లోనూ పక్కా ఆధారాలతో ఏసీబీ అధికారులు నిందితులను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరుస్తున్నారు.

కోర్టు వారికి జ్యుడీషియల్ రిమాండ్ విధించడంతో, వారందరికీ చంచల్‌గూడ జైలు తాత్కాలిక నివాసంగా మారుతోంది.

ఇదిలాఉంటే, ఓ విచిత్రమైన ఘటనలో, కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ సబ్-జైలులో డిప్యూటీ జైలర్‌గా పనిచేసిన దేవేందర్, ఓ ఖైదీ నుంచి రూ.10 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డారు. గంటల వ్యవధిలోనే.. అధికారిగా పనిచేసిన అదే జైలులో ఆయన ఖైదీగా మారాల్సి వచ్చింది. ఒకప్పుడు అధికారం, విలాసవంతమైన జీవితం గడిపిన ఈ అధికారులు.. ఇప్పుడు జైలు గోడల మధ్య విచారణ ఖైదీలుగా కాలం గడుపుతుండగా అత్యంత శోచనీయమని రాజకీయ మేధావులు, చెబుతున్నారు.

# తాజా తీర్పు 'బీఆర్ఎస్‌కి గొప్ప విజయం'

## ఇదే తీర్పు మిగతా ఎమ్మెల్యేలు కూడా వస్తది?

## బీఆర్ఎస్ తరఫు సీనియర్ న్యాయవాది గండ్ర మోహన్ రావు

హైదరాబాద్, మనం ప్రతినిధి: దానం నాగేందర్ వేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు స్పెషల్ లీవ్ ఇవ్వకుండా అడ్మిషన్ స్టేజీలోనే కొట్టివేయడం జరిగిందని బీఆర్ఎస్ తరఫు సీనియర్ న్యాయవాది గండ్ర మోహన్ రావు స్పష్టం చేశారు. పార్టీ ఫిరాయింపు కేసులో తనను అనర్హుడిగా ప్రకటిస్తూ హైకోర్టు ఇచ్చిన తీర్పుపై స్టే విధించాలని కోరుతూ ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేయగా.. దానం నాగేందర్‌పై అనర్హత వేసిన సుప్రీంకోర్టు.. మళ్లీ ఎన్నికలకు వెళ్లాలని తేల్చి చెప్పిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో న్యాయవాది గండ్ర మోహన్ రావు ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ.. నువ్వొకసారి వేరే పార్టీ నుంచి పోటీ చేసిన తర్వాత మెంబర్ ఆఫ్ లెజిస్టేటివ్ అసెంబ్లీగా నీకు అనర్హత చట్టం వరిస్తుందని గౌరవ సుప్రీంకోర్టు చెప్పింది. కాబట్టి దాని తర్వాత జరిగిన పరిణామాలతో సంబంధం లేదని గౌరవ సుప్రీంకోర్టు కొట్టేసింది. వారి కౌన్సిల్ వాదించడానికి ప్రయత్నం చేశారు. బీఆర్ఎస్ నాపై చర్యలు తీసుకోలేదు. నేనింకా బీఆర్ఎస్ పార్టీలోనే ఉన్నా కాబట్టి నాకు ఇంకా అనర్హత వర్తించదని



అన్నారు. దానం నాగేందర్ కాంగ్రెస్‌లో చేరిన 3 రోజుల్లోనే స్పీకర్ దగ్గర బీఆర్ఎస్ పిటిషన్ దాఖలు చేసిందని చెప్పామన్నారు. కానీ, స్పీకర్ వద్ద నుంచి సరైన స్పందన రాకపోవడంతో, హైకోర్టు, సుప్రీంకోర్టు వరకు బీఆర్ఎస్ న్యాయపోరాటం చేసిందన్నారు. దీంతో త్వరలో ఖైరతాబాద్ నియోజకవర్గంలో ఉప ఎన్నికలు రాబోతున్నాయి. బీఆర్ఎస్ మొదటి రోజు నుంచి న్యాయపోరాటం చేసింది. బీఆర్ఎస్ పార్టీకి ఇదొక గొప్ప విజయం. పార్టీ మారిన మిగతా ఎమ్మెల్యేల విషయంలో కూడా డివిజన్ బెంచ్ ఒక నిర్ణయం తీసుకోబోతుంది. వారికి కూడా ఇలాగే జరగబోతుందని ఆశిస్తున్నామన్నారు.

# సాహిల్ తల్లిదండ్రుల నిరాహార దీక్ష

## ఐఐటీ బాంబే పరీక్షలు వాయిదా

ముంబై, సెప్టెంబర్ 24: విద్యార్థి సాహిల్ వాకోడే ఆత్మహత్యపై నిరసనలు వ్యక్తమవుతున్న వేళ.. మిడ్ సెమిస్టర్ పరీక్షలను ఐఐటీ బాంబే వాయిదా వేసింది. ఈ నెల 26-27 తేదీల్లో జరగాల్సిన పరీక్షలను అక్టోబరు 10-11కు వాయిదా వేసింది. మరోవైపు.. తమ కుమారుడిని వేధించిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సాహిల్ తల్లిదండ్రులు ముంబయిలోని ఆజాద్ మైదాన్లో నిరాహార దీక్ష ప్రారంభించారు. ''నా బిడ్డను వేధించిన వారిని జైలులో పెట్టాలి. విద్యాసంస్థలో తాను పదేపదే కులవివక్షను ఎదుర్కొన్నట్లు అతడు మాకు చెప్పాడు'' అని సాహిల్ తండ్రి తెలిపారు. అంతకుముందు సాహిల్ తల్లిదండ్రులు 'జాతీయ షెడ్యూల్ కులాల కమిషన్' ఛైర్మన్ను కలిసి.. తమ కుమారుడి మరణంపై దర్యాప్తు జరపాలని కోరుతూ వినతిపత్రం ఇచ్చారు. మరోవైపు.. విద్యార్థి కుటుంబానికి సంఘీభావంగా ఐఐటీ బాంబే వద్దకు వచ్చిన కాంగ్రెస్ ఎంపీ వర్షా గైక్వాడ్, ఆ పార్టీ కార్యకర్తలు, ఎన్ఎస్‌యూఐ నేతలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

ఇదిలా ఉండగా.. ప్రొఫెసర్ సూర్యనారాయణ 2024లో పంపినట్లు చెబుతున్న ఓ ఈమెయిల్ సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. తోటి విద్యార్థుల అడ్మిషన్ కేటగిరీలు, జేఈఈ ర్యాంకులు, గేట్ స్కోర్ల గురించి అడగొద్దని విద్యార్థులకు సూచించినట్లు అందులో ఉంది. అటువంటి ప్రశ్నలతో వారి సామాజిక వర్గం, రిజర్వేషన్ వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉందని హెచ్చరించారు. సాహిల్ను ఆత్మహత్యకు ప్రేరేపించినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఆయన్ను ఐఐటీ యాజమాన్యం ఇప్పటికే సెలవుపై పంపింది.





# 'దానం' దారెటు ?

## ఉప ఎన్నికలో పోటీ కాంగ్రెస్ నుండేనా ?

### నువ్వు ఫైటర్‌వి ఫైట్ చెయ్ అంటూ ప్రోత్సహించిన సీఎం రేవంత్ రెడ్డి

**హైదరాబాద్, సెప్టెంబర్ 24, (మనం బ్యూరో) :** ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌పై సుప్రీం కోర్టు తీర్పు నేపథ్యంలో ఆయన భవిష్యత్ కార్యాచరణ ఎలా ఉండబోతోంది అనే అంశం రాజకీయ వర్గాలలో చర్చనీయాంశంగా మారింది. బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా గెలిచి ఆ తరువాత కాంగ్రెస్ పార్టీ నుండి లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసిన దానం నాగేందర్‌పై తెలంగాణ హైకోర్టు అనర్హత వేటు వేస్తూ ఇటీవల తీర్పు ఇచ్చింది. హైకోర్టు ఉత్తర్వులను సవాల్ చేస్తూ ఆయన సుప్రీం కోర్టును ఆశ్రయించగా, గురువారం విచారణ చేపట్టిన అత్యున్నత ధర్మాసనం ఆయన పిటిషన్‌ను డిస్మిస్ చేస్తూ హైకోర్టు తీర్పును సమర్థించింది. దీంతో ఖైరతాబాద్ అసెంబ్లీ నియోజక వర్గం అధికారికంగా ఖాళీ కాగా, ఉప ఎన్నిక అనివార్యమైంది. ఈ నేపథ్యంలో తాను ముందస్తుగానే ఎన్నికలకు సిద్ధమవుతున్నట్లు ప్రకటించిన దానం ఏ పార్టీ నుంచి పోటీ చేస్తారనే విషయంపై స్పష్టత ఇవ్వలేదు. ఎన్నికల షెడ్యూల్ వచ్చాకే తాను ఏ పార్టీ నుండి పోటీ చేసే విషయం ప్రకటిస్తానన్న దానం తాను ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీలోనే ఉన్నట్లు స్పష్టం చేశారు. గత ఎన్నికల్లో బీఆర్ఎస్ నుండి గెలిచి కాంగ్రెస్ అభ్యర్థిగా లోక్‌సభ ఎన్నికలలో పోటీ చేసిన కారణంగానే ఆయన ఎమ్మెల్యే పదవిని పోగొట్టుకోవాల్సి వచ్చింది. దీంతో తిరిగి ఆయన కాంగ్రెస్ పార్టీ నుంచే ఖైరతాబాద్ ఉప ఎన్నికల బరిలోకి దిగుతారనే ప్రచారం జరుగుతోంది.

హైకోర్టు దానంను ఎమ్మెల్యే పదవికి అనర్హుడంటూ తీర్పు ఇచ్చిన సమయంలో ఆయన సీఎం రేవంత్ రెడ్డిని కలిశారు. నువ్వు ఫైటర్‌వి ఫైట్ చెయ్ అంటూ దానం నాగేందర్‌ను ప్రోత్సహించారు. తాజాగా, సుప్రీం కోర్టు తీర్పు నేపథ్యంలోనూ దానం సీఎంను కలిసినట్లుగా ప్రచారం జరుగుతోంది. దీంతో ఆయనను కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా ప్రకటించే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. ఇదిలా ఉండగా, దానం నాగేందర్‌ను ఏదైనా అనుకోని పరిస్థితుల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా ప్రకటించని పక్షంలో ఆయనను ఏ పార్టీ అక్కున చేర్చుకుంటుంది అన్న చర్చ కూడా కొనసాగుతోంది. బీఆర్ఎస్ నుండి గెలిచి ఆ పార్టీ రెబల్ ఎమ్మెల్యేగా మారారన్న కారణంగా ఆ పార్టీ దానంకు మరోసారి అవకాశం ఇచ్చే అవకాశాలు దాదాపు శూన్యం. ఇప్పటికే ఆ స్థానం నుండి సికింద్రాబాద్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాసయాదవ్ కుమారుడు బీఆర్ఎస్ టికెట్ కోసం ప్రయత్నాలు చేస్తున్నారనీ ఆ పార్టీ కూడా ఆయనకే అవకాశం ఇచ్చే అవకాశం ఉందన్న ప్రచారం సాగుతోంది.

ఇక బీజేపీతో దానం నాగేందర్ మొదటి నుంచీ అంటీముట్టనట్లుగానే వ్యవహరిస్తున్నారు. అంతేకాకుండా అక్కడ పోటీకి సిద్ధంగా ఉన్నట్లు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి ప్రకటించారు. దీంతో ఆయనకు బీజేపీ నుంచి పోటీ చేసే అవకాశం ఎట్టి పరిస్థితుల్లోనూ లేదనే చెప్పాలి.

## దానంపై సుప్రీం తీర్పు

# రాజ్యాంగ విజయం

### బీజేపీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి



**హైదరాబాద్, సెప్టెంబర్ 24 :** దానం నాగేందర్ పై అనర్హత వేటు వేస్తూ హైకోర్టు ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు సమర్థించడం రాజ్యాంగ విజయమని భాజపా శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. బీజేపీ చేసిన న్యాయపోరాటం వల్లే ఈ విజయం దక్కిందని ఆయన ఒక ప్రకటనలో చెప్పారు..ఫిరాయింపుల నిరోధక చట్టాన్ని అమలు చేయాల్సిన సీఎం రేవంత్ రెడ్డి.. స్వయంగా ఫిరాయింపులను ప్రోత్సహించడం కంచే చేను మేసిన వైనాన్ని తలపించిందని విమర్శించారు. ఇకనైనా పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలతో రాజీనామాలు చేయించి ఉపఎన్నికకు వెళ్లాలన్నారు.

# సుప్రీం తీర్పును గౌరవిస్తా: దానం



**హైదరాబాద్, సెప్టెంబర్ 24 :** ఎమ్మెల్యే పదవికి అనర్హత అంశంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నట్లు దానం నాగేందర్ తెలిపారు. ప్రజాక్షేత్రంలో తనకు బలముందని చెప్పారు. అనర్హత వేటుపై హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ దానం సుప్రీంకోర్టును ఆశ్రయించిన సంగతి తెలిసిందే. ఆయన పిటిషన్ను అత్యున్నత న్యాయస్థానం గురువారం డిస్మిస్ చేసింది. ఈ నేపథ్యంలో దానం నాగేందర్ మీడియాతో మాట్లాడారు.

సుప్రీంలో దానం నాగేందర్కు చుక్కెదురు

"ఎంపీగా పోటీ చేసినప్పుడే ఊహించా.. అదే జరిగింది. లీగల్గా పోరాడటంలో తప్పులేదు. పదో షెడ్యూల్ ప్రకారం రిలీఫ్ దొరుకుతుందని అనుకున్నా. మళ్లీ ఎన్నికల్లో పోటీ చేసుకోవచ్చని సుప్రీంకోర్టు చెప్పింది. నేను ప్రతి ఇంటికి వెళ్లి సేవ చేశా.. నేనేంటో ప్రజలను అడిగితే తెలుస్తుంది. ఉప ఎన్నికలో పోటీపై సీఎం స్పష్టత ఇస్తారు. గతంలో మూడుసార్లు గెలిచాను. ఒక ఉప ఎన్నికలో 1,600 ఓట్లతో ఓడిపోయాను. ఇప్పుడు పరిస్థితులు చాలా అనుకూలంగా ఉన్నాయి. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ఫలితాలే ఇక్కడా రిపీట్ అవుతాయి. ఖైరతాబాద్ దానం నాగేందర్ అడ్డా. కలిసి పనిచేస్తాం.. తప్పకుండా గెలుస్తాం" అని దానం నాగేందర్

# దానం పిటిషన్ డిస్మిస్

### నాగేందర్‌పై అనర్హత వేటు వేస్తూ హైకోర్టు ఇచ్చిన తీర్పును సమర్థించిన సుప్రీం



**ఢిల్లీ, సెప్టెంబర్ 24 :** సుప్రీంకోర్టులో దానం నాగేందర్‌కు చుక్కెదురైంది. అనర్హత వేటు విషయంలో ఆయన దాఖలు చేసిన పిటిషన్ను అత్యున్నత న్యాయస్థానం డిస్మిస్ చేసింది. దానం నాగేందర్ ను ఎమ్మెల్యే పదవికి అనర్హుడిగా ప్రకటిస్తూ హైకోర్టు ఇచ్చిన తీర్పును సమర్థించింది. ఒక పార్టీ నుంచి గెలిచి.. మరో పార్టీ తరఫున పోటీ చేయడాన్ని సుప్రీంకోర్టు తప్పుబట్టింది. ఘర్ వాపసీ చట్టసభ సభ్యులకు వర్తించదని.. హైకోర్టు తీర్పులో జోక్యం చేసుకోవడానికి ఏమీ లేదని స్పష్టం చేసింది. ఒక పార్టీ నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికైన వ్యక్తి మరో పార్టీ నుంచి లోక్ సభకు పోటీచేయకూడదని రాజ్యాంగపరమైన నిషేధమేమీ లేదని దానం నాగేందర్ సుప్రీంకోర్టులో దాఖలు చేసిన పిటిషన్లో పేర్కొన్నారు. దాన్ని ప్రాతిపదికగా తీసుకొని హైకోర్టు తనను ఎమ్మెల్యేగా అనర్హుడిగా ప్రకటించడాన్ని తప్పుబట్టారు. గతంలో ఇలా వేరే పార్టీ నుంచి పోటీచేశారన్న కారణంతో బిహార్కు చెందిన మహాచంద్రప్రసాద్ ను సుప్రీంకోర్టు అనర్హుడిగా ప్రకటించిందన్న ఏకైక కారణాన్ని ప్రాతిపదికగా తీసుకొని స్పీకర్ ఆదేశాలను హైకోర్టు కొట్టేయడం పొరపాటు అని పేర్కొన్నారు. తాజాగా దానం పిటిషన్ను సుప్రీంకోర్టు డిస్మిస్ చేసిన నేపథ్యంలో ఖైరతాబాద్ శాసనసభ స్థానానికి ఉపఎన్నిక అనివార్యం కానున్నది.

# దానం కేసులో.. సుప్రీం తీర్పు ఓ గుణపాఠం

### ఫిరాయింపులపై సీపీఐ నారాయణ

**హైదరాబాద్, మనం ప్రతినిధి :** ఓ పార్టీలో గెలిచి, మరో పార్టీలోకి ఫిరాయించిన దానం నాగేందర్ అనర్హత కేసులో సుప్రీంకోర్టు తీర్పు అన్ని పార్టీలకు కీలక సందేశం ఇచ్చిందని సీపీఐ సీనియర్ నేత కె.నారాయణ వ్యాఖ్యానించారు. దానం దాఖలు చే(వే)సిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు గురువారం కొట్టివేసిన విషయం తెలిసిందే. తెలంగాణ హైకోర్టు తీర్పులో జోక్యం చేసుకునే అవసరం లేదని సుప్రీం ఖరఖండిగా స్పష్టం చేసింది. గత 2023 ఎన్నికలలో బీఆర్ఎస్ టికెట్‌పై ఖైరతాబాద్ నుంచి గెలిచిన నాగేందర్.. గత 2024 లోక్ సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా సికింద్రాబాద్ నుంచి పోటీ చేశారు. ఈ నేపథ్యంలో ఆయనపై ఊహించని విధంగా అనర్హత వేటు పడింది. అయితే, ఈ తీర్పును ఒక్క దానం నాగేందర్ వ్యవహారానికే పరిమితం చేయకూడదని నారాయణ అన్నారు. రాజకీయ ప్రయోజనాల కోసం పార్టీలు ఫిరాయింపులను ప్రోత్సహిస్తున్న తీరుపై ఆత్మపరిశీలన జరగాలని సూచించారు. తీర్పు వెలువడిన వెంటనే బీజేపీ సంబరాలు చేసుకోవడాన్ని ఆయన తప్పుపట్టారు. దేశంలో, వివిధ రాష్ట్రాల్లో పార్టీ మార్పులను ప్రోత్సహించిన చరిత్ర బీజేపీకి కూడా ఉందని విమర్శించారు. ఇప్పుడు ఫిరాయింపులపై నీతులు చెప్పడం సరికాదని అన్నారు.

తాజాగా, దానం నాగేందర్ కేసులో వచ్చిన నేటి తీర్పు.. భవిష్యత్ ఫిరాయింపు కేసులకు మార్గదర్శకంగా నిలవాలని నారాయణ ఆకాంక్షించారు. ఒక పార్టీ గుర్తుపై గెలిచి, మరో పార్టీలో చేరే ఎమ్మెల్యేలపై వెంటనే అనర్హత వేటు పడేలా ఫిరాయింపుల నిరోధక చట్టాన్ని మరింత కఠినతరం చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

# దానం అనర్హతపై పాడి హర్షం



**హైదరాబాద్, మనం ప్రతినిధి :** పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యే దానం నాగేందర్‌పై అనర్హత వేటును సుప్రీంకోర్టు సమర్థించడాన్ని బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి స్వాగతించారు. పార్టీ అధినేత కేసీఆర్ మార్గదర్శకత్వంలో న్యాయపోరాటం చేసి కావాల్సిన ఫలితం సాధించామని ఆయన అన్నారు. పార్టీ మారిన ప్రజాప్రతినిధులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్న తమ వాదనకు ఈ తీర్పు బలం చేకూర్చిందని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో కాంగ్రెస్, బీజేపీల తీరుపై కౌశిక్ రెడ్డి తీవ్ర విమర్శలు గుప్పించారు. రెండు పార్టీలు అంతర్గతంగా కలిసి పనిచేస్తున్నాయని, పెద్ద ఎత్తున కుమ్మక్కు రాజకీయం సాగుతోందని ఆరోపించారు. ఒకరి స్వార్థం కోసం మరొకరు సహకరిస్తూ నాటకాలు ఆడుతున్నారని, ఇది సిగ్గుమాలిన చర్య అని అభివర్ణించారు. ప్రజల దృష్టిని మళ్లించేందుకే ఇలాంటి రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. కోర్టులు వేగంగా తీర్పులు ఇస్తున్నాయని కొందరు ఎద్దేవా చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. న్యాయస్థానాల వేగాన్ని, విచారణ తీరును తక్కువ చేసి మాట్లాడటం అజ్ఞానానికి నిదర్శనమని విమర్శించారు. చట్టం తన పని తాను చేస్తుందని, న్యాయవ్యవస్థ ఇచ్చిన తీర్పులను గౌరవించాలని సూచించారు. ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లు ఉన్నా కేసీఆర్ నాయకత్వంలో బీఆర్ఎస్ ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం న్యాయపరమైన పోరాటం కొనసాగిస్తుందని చెప్పారు.

# క్షుద్ర పూజలపై పరువునష్టం దావా

- మహేశ్‌గౌడ్, అద్దంకిపై హరీశ్‌రావు పిటిషన్ స్వీకరించిన కోర్టు



**హైదరాబాద్, మనం ప్రతినిధి :** క్షుద్ర పూజల పేరుతో తనపై తప్పుడు ప్రచారం చే(స్తున్న)సిన ఆరోపణలపై పిటిషన్‌ను కోర్టు విచారణకు స్వీకరించింది. ఈ మేరకు టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్‌లపై ఆధారాలతో మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్ రావు.. క్రిమినల్ పరువు నష్టం పిటిషన్ దాఖలు చేశారు. ఈ విషయంలో సెప్టెంబర్ 30న తన స్టేట్‌మెంట్ రికార్డు చేసేందుకు కోర్టు అనుమతించిందని ఆయన వెల్లడించారు. ఈ సందర్భంగా నాంపల్లి కోర్టు వద్ద హరీశ్‌రావు మీడియాతో మాట్లాడుతూ... తనపై తప్పుడు ప్రచారం చేసిన వారిని ఎట్టి పరిస్థితుల్లో వదిలి పెట్టబోనని శపథం చేశారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలు, ప్రజా సమస్యల నుంచి ప్రజల దృష్టిని మళ్లించడానికే తమపై ఈ తరహా నీచమైన నిందలు వేస్తున్నారని ఆరోపించారు. అధికారంలోకి వచ్చి ఇన్నాళ్లైనా అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ నియామకం చేపట్టకపోవడం అత్యంత దారుణమని పేర్కొన్నారు. సభా హక్కుల ఉల్లంఘన నోటీసులను కూడా స్పీకర్ పట్టించుకోవడం లేదని ఆయన తీవ్రంగా మండిపడ్డారు.ఫిరాయింపు ఎమ్మెల్యే దానం నాగేందర్ అనర్హత వ్యవహారంలో సుప్రీంకోర్టు వెలువరించిన ఆదేశాలు.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి చెంపపెట్టు లాంటివని హరీశ్ అభివర్ణించారు. లోక్ సభలో రాజ్యాంగ సంరక్షకుడిగా మాట్లాడే రాహుల్ గాంధీ, తెలంగాణలో పార్టీ మారిన ఎమ్మెల్యేలతో తక్షణమే రాజీనామాలు చేయించాలని డిమాండ్ చేశారు. ఫిరాయింపులకు పాల్పడిన ఎమ్మెల్యేలను కాపాడేందుకు స్పీకర్ ప్రయత్నించారని, అయితే పార్టీ మారిన ఎమ్మెల్యేలందరికీ సుప్రీంకోర్టు తీర్పుతో అనర్హత వేటు తప్పదని స్పష్టం చేశారు. ఇప్పటికైనా ఫిరాయింపు నేతలు రాజీనామాలు చేసి ప్రజా తీర్పును కోరాలని ఈ సందర్భంగా హరీశ్ రావు డిమాండ్ చేశారు.

# ఖైరతాబాద్‌లో మేం గెలుస్తం

- ఉప ఎన్నికల్లో బీజేపీ విజయం ఖాయం
- పార్టీ ఫిరాయింపుపై సుప్రీంకోర్టు తీర్పు చెంపపెట్టు : కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

**హైదరాబాద్, మనం ప్రతినిధి :** ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ కేసులో సుప్రీంకోర్టు తీర్పును మనస్ఫూర్తిగా స్వాగతిస్తున్నానని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి తెలిపారు. పార్టీ ఫిరాయింపుల చట్టం ఉల్లంఘనపై సుప్రీంకోర్టు తీర్పు చెంపపెట్టు అని అభివర్ణించారు. ఇది అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీలకు గుణపాఠమని అన్నారు. పార్టీ ఫిరాయింపునకు పాల్పడిన ఎమ్మెల్యే దానం నాగేందర్ వ్యవహారంలో సుప్రీంకోర్టు గురువారం స్పందించింది. ఈ నేపథ్యంలో దీనిపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి కార్యాలయం ఓ ప్రకటన విడుదల చేసింది. నాడు కాంగ్రెస్ ఎమ్మెల్యేలను చేర్చుకుని బీఆర్ఎస్ ప్రభుత్వం చట్ట వ్యతిరేకంగా మంత్రులను చేసిందని.. నేడు బీఆర్ఎస్ ఎమ్మెల్యేను చేర్చుకుని కాంగ్రెస్ తమ పార్టీ తరపున ఎంపీగా పోటీ చేయించిందని గుర్తు చేశారు. త్వరలో జరగనున్న ఖైరతాబాద్ ఉప ఎన్నికలో.. రెండు ఫిరాయింపు పార్టీలకు ప్రజలు బుద్ధి చెబుతారని ధీమా వ్యక్తం చేశారు. ఈ ఉప ఎన్నికలో బీజేపీ ఘనవిజయం ఖాయమని కిషన్ రెడ్డి జోస్యం చెప్పారు. దానం నాగేందర్ పిటిషన్ సుప్రీంకోర్టు కొట్టివేయడంతో ఖైరతాబాద్ అసెంబ్లీ స్థానానికి ఉప ఎన్నిక అనివార్యం అవుతుందని తెలిపారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఖైరతాబాద్ నుంచి దానం నాగేందర్ బీఆర్ఎస్ నుంచి ఎమ్మెల్యేగా గెలిచి.. 2024లో జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో సికింద్రాబాద్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేశారని తెలిపారు. దీనిపై తెలంగాణ హైకోర్టును బీజేపీ ఆశ్రయిస్తే.. 2024 ఏప్రిల్ 23 నుంచి ఆయనను ఎమ్మెల్యేగా అనర్హుడిగా ప్రకటించిందని.. దీన్ని సుప్రీంకోర్టు తాజాగా సమర్థించిందని అన్నారు. ఇప్పుడు ఖైరతాబాద్ ప్రజలు.. అవకాశవాద, స్వార్థ, ఫిరాయింపు రాజకీయాలకు వ్యతిరేకంగా తమ ప్రతినిధిని ఎన్నుకునే అవకాశం రానుందని అన్నారు. ప్రజాస్వామ్యంలో అంతిమ నిర్ణేతలు ప్రజలేనని వివరించారు. ఈ రెండు పార్టీల కుళ్లు రాజకీయాలకు తగిన బుద్ధి చెప్పి.. ఖైరతాబాద్ అసెంబ్లీ ప్రజలు.. వచ్చే ఉప ఎన్నికలో బీజేపీకి పట్టంగట్టడం ఖాయమని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు.

# యాదాద్రి థర్మల్ ప్లాంట్‌లో బొగ్గు కొరత

- రేవంత్ సర్కారే కారణం
- జగదీశ్ రెడ్డి ఆధ్వర్యంలో ప్లాంట్‌ను సందర్శించిన బీఆర్ఎస్ నేతల బృందం

**హైదరాబాద్, మనం ప్రతినిధి :** నల్గొండ జిల్లా దామరచర్ల మండలంలోని యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ లో బొగ్గు కొరత, విద్యుత్ ఉత్పత్తి నిలిచిపోవడానికి సీఎం రేవంత్, ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్కలే నిర్లక్ష్యమే కారణమని మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి ఆరోపించారు. ఈ మేరకు ఎంఎల్‌సీ ఎంసీ కోటిరెడ్డి, ఉమ్మడి నల్గొండ జిల్లాకు చెందిన మాజీ ఎమ్మెల్యేలు, బీఆర్ఎస్ ప్రతినిధుల బృందంతో కలిసి జగదీష్‌రెడ్డి గురువారం యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంటను పరిశీలించారు. అనంతరం ప్లాంట్ అధికారులతో సమావేశమై విద్యుత్ ఉత్పత్తి నిలిచిపోవడానికి గల సాంకేతిక, పరిపాలనాపరమైన కారణాలపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా జగదీష్‌రెడ్డి మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం విద్యుత్ రంగాన్ని తీవ్రంగా నిర్లక్ష్యం చేస్తోందని మండిపడ్డారు. సింగరేణి సంస్థ నాణ్యమైన బొగ్గును ఉత్పత్తి చేస్తున్నప్పటికీ, ప్లాంట్‌లకు సక్రమంగా సరఫరా చేయకుండా దాదాపు 40 లక్షల టన్నుల బొగ్గును పక్కదారి పట్టిస్తున్నారని విమర్శించారు. తెలంగాణలోని పవర్ ప్లాంట్‌లకు బొగ్గు కొరత సృష్టించి, ప్రజలను ముఖ్యంగా రైతాంగాన్ని తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత కేసీఆర్ ప్రభుత్వం ఏ విధంగానైతే 24 గంటల ఉచిత నాణ్యమైన విద్యుత్‌ను అందించిందో, అదే రీతిలో పవర్ ప్లాంట్‌లకు పూర్తిస్థాయిలో బొగ్గు సరఫరా చేసి నిరంతర విద్యుత్ అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు.

## విశ్వరూపం దాలుస్తున్న భాగ్యనగరికి

# కొత్త చట్టంతో సరికొత్త దిశ




**అమలులోకి వచ్చిన క్యూర్ చట్టం-2026 ● అవినీతి రహిత పాలన.. పర్యావరణ పరిరక్షణ..**

**ఉపాధికి బాటలు.. పారదర్శక పౌర సేవలు.. సేవల్లో లోపాలకు ఫిర్యాదులు చేయవచ్చు.. హైడ్రాకు చట్టబద్ధత**

**హైదరాబాద్,సెప్టెంబర్ 24 (మనం న్యూస్) :** తెలంగాణ రాజధాని హైదరాబాదు పరిపాలనలో సరికొత్త ప్రస్థానం మొదలైంది. భాగ్యనగర పాలనా చరిత్రలో ఒక సువర్ణాధ్యాయం ముగిసి, సరికొత్త శకానికి అంకురార్పణ జరిగింది. 70 ఏండ్ల పాటు ఈ మహా నగర రూపురేఖలను తన నిబంధనలతో శాసించిన జీహెచ్ఎంసీ చట్టం-1955 స్థానంలో, వర్తమాన కాలపు వేగవంతమైన అవసరాలకు తగినట్టుగా రూపుదిద్దుకున్న 'క్యూర్' చట్టం-2026 అమల్లోకి వచ్చింది. శాసనసభలో కూలంకషంగా జరిగిన చర్చోపచర్చల అనంతరం ఆమోదం పొందిన ఈ సమగ్ర బిల్లుకు రాష్ట్ర గవర్నర్ శివప్రతాప్ శుక్లా ఆమోద ముద్ర వేయడంతో, గ్రేటర్ హైదరాబాద్ సరికొత్త పరిపాలనా సంస్కరణలకు దారి సుగమమైంది. కేవలం ఒకే నగరం, ఒకే పరిపాలన అనే మహోన్నత లక్ష్యంతో ప్రభుత్వం ఈ చట్టానికి రూపకల్పన చేసి, దేశానికే ఆదర్శంగా నిలిచేలా అడుగులు వేసింది.

**హైడ్రాకు తిరుగులేని చట్టబద్ధత..**

ఇప్పటివరకు కేవలం కార్యనిర్వాహక ఉత్తర్వులతో అడుగులు వేస్తూ, నగరంలో అక్రమ నిర్మాణాలపై కొరడా ఝుళిపించిన విపత్తు నిర్వహణ, ఆక్రమణల తొలగింపు సంస్థ 'హైడ్రా'కు ఈ నూతన చట్టం ద్వారా తిరుగులేని చట్టబద్ధత లభించింది. చెరువులు, కుంటలు, ప్రభుత్వ భూములు, నాలాల జోలికి ఎవరైనా వస్తే ఇకపై హైడ్రా మరింత ఉక్కుపాదంతో వ్యవహరించనుంది. కేవలం ఆక్రమణలను కూల్చివేయడమే కాకుండా, కబ్జాదారులపై నేరుగా క్రిమినల్ కేసులు నమోదు చేసి జైలుకు పంపే అత్యున్నత అధికారాలు ఈ చట్టం ద్వారా ఆ సంస్థకు సంక్రమించాయి. దీనివల్ల అన్యాక్రాంతమవుతున్న జలవనరులకు, ప్రభుత్వ ఆస్తులకు శాశ్వత రక్షణ లభించినట్లయింది.

**ఒకే గొడుగు కిందకు..**

ఈ చట్టం కేవలం హైడ్రా పరిధిని పెంచడానికే పరిమితం కాలేదు. హైదరాబాద్ మహానగర చుట్టూ అంచనాలకు మించి విస్తరించి ఉన్న వివిధ మున్సిపల్ కార్పొరేషన్‌లు, మున్సిపాలిటీలను ఒకే గొడుగు కిందకు తీసుకువచ్చి నిర్ణయాల్లో వేగం పెంచేలా ఈ చట్టం అద్భుతమైన బాటలు వేసింది. గతంలో వేర్వేరు స్థానిక సంస్థల మధ్య సమన్వయం కొరవడి అనుమతుల్లో, పనుల్లో జరుగుతున్న తీవ్రమైన జాప్యానికి దీనితో పూర్తిగా తెరపడింది. రహదారులు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీలే కాకుండా సమీకృత రవాణా వ్యవస్థ, ట్రాఫిక్ నియంత్రణ, పారిశుద్ధ్యం వంటి అత్యంత కీలకమైన అంశాలపై ఒకే కేంద్రీకృత విధానం అమలవుతుంది. దీనివల్ల నగర విస్తరణకు, మౌలిక వసతుల కల్పనకు ఒకే రకమైన సమగ్ర ప్రణాళికను అమలు చేయడానికి చక్కటి మార్గం సుగమమైంది.

**ఉపాధికి సరికొత్త బాటలు...**

నగరంలో రోజురోజుకు విపరీతంగా పెరిగిపోతున్న ట్రాఫిక్ ఇబ్బందులను, నేటి యువత జీవన శైలి అవసరాలను దృష్టిలో ఉంచుకొని ఈ చట్టంలో రవాణా, మొబిలిటీ రంగానికి అత్యంత ప్రాధాన్యతనిచ్చారు. పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్‌ను మరింత బలోపేతం చేయడం, మల్టీ మోడల్ ట్రాన్స్‌పోర్ట్ సిస్టమ్‌ను మెట్రోతో అనుసంధానించడం వంటి విప్లవాత్మక చర్యలతో పాటు,'నైట్ లైఫ్' రాత్రి పూట వ్యాపారాలకు అధికారికంగా అనుమతులు ఇవ్వడం ద్వారాగ్రేటర్ హైదరాబాద్‌ను నిజమైన గ్లోబల్ సిటీ స్థాయికి తీసుకెళ్లేలా వాణిజ్య పరమైన వెసులుబాట్లు కల్పించారు. దీనివల్ల నగరంలో లక్షలాది మందికి కొత్త ఉపాధి అవకాశాలు లభించడంతో పాటు ఆర్థిక రంగానికి సరికొత్త ఉత్తేజం రానుంది.

**పర్యావరణ పరిరక్షణ...**

పర్యావరణ పరిరక్షణ, ఆరోగ్యకరమైన పారిశుద్ధ్య నిర్వహణ విషయంలో ఈ చట్టం రాజీలేని అత్యంత కఠినమైన నిబంధనలను తీసుకువచ్చింది. నగరంలో ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా అరికట్టడానికి ఉల్లంఘించే వారిపై భారీ జరిమానాలు విధించే విచక్షణాధికారాలను స్థానిక సంస్థలకు కట్టబెట్టారు. అలాగే వర్షపు నీటి సంరక్షణ గుంతలు ప్రతి భవనంలోనూ తప్పనిసరి చేయడం, చెత్త నిర్వహణకు సంబంధించిన నిబంధనలను ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకునేలా పకడ్బందీ చట్టపరమైన రక్షణ కల్పించారు. నగరంలో పచ్చదనాన్ని విశేషంగా పెంపొందించడానికి ప్రతీ జోన్‌లో ప్రత్యేకంగా అర్బన్ ఫారెస్ట్ జోన్‌ల అభివృద్ధికి ఈ చట్టంలో సర్కారు పెద్దపీట వేసింది.

**పారదర్శక పౌరసేవలు...**

పౌరులకు పూర్తి పారదర్శకమైన, అవినీతి రహిత సేవలను అందించే దిశగా అత్యాధునిక డిజిటల్ గవర్నెన్స్‌ను ఈ చట్టం ద్వారా చట్టబద్ధం చేశారు. ట్రేడ్ లైసెన్సులు, బిల్డింగ్ పర్మిషన్‌లు, ఆస్తి పన్ను చెల్లింపులు వంటి అన్ని సేవలను సింగిల్ విండో విధానం ద్వారా పూర్తిగా ఆన్‌లైన్ చేసి, నిర్ణీత గడువులోగా పౌరులకు సేవలు అందేలా కాలపరిమితితో కూడిన సేవలను ప్రవేశపెట్టారు. ఒకవేళ అధికారులు నిర్లక్ష్యం వహిస్తే పౌరులు ఫిర్యాదు చేయడానికి ఒక అప్పిలేట్ అథారిటీని ఏర్పాటు చేస్తారు. దీన్ని ఈ చట్టం యొక్క అత్యున్నత ప్రత్యేకతగా చెప్పవచ్చు.

**భవిష్యత్ తరాల కోసం...**

ఆర్థిక పరమైన సంస్కరణల విషయానికి వస్తే, నగర భవిష్యత్ అభివృద్ధికి ఎక్కడా నిధుల కొరత రాకుండా మున్సిపల్ బాండ్లు జారీ చేయడం, పబ్లిక్-ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్ విధానాలను మరింత సులభతరం చేయడం వంటి వినూత్న ఆర్థిక వికేంద్రీకరణ చర్యలకు ఈ చట్టం రూపకల్పన చేసింది. మొత్తంమీద, హైడ్రా ద్వారా భూముల పరిరక్షణ ఒక్కటే కాకుండా, హైదరాబాద్ మహానగరాన్ని అన్ని రంగాలలో ఒక అంతర్జాతీయ ప్రమాణాలు కలిగిన సురక్షితమైన, పారదర్శకమైన, వేగంగా అభివృద్ధి చెందే నగరంగా మార్చడానికి ఈ క్యూర్ చట్టం ఒక బలమైన పునాదిగా నిలుస్తుంది. కేవలం కాగితాల మీదనే కాకుండా, ఈ చట్టాన్ని క్షేత్రస్థాయిలో ఆచరణలో పెట్టే క్రమంలో ప్రభుత్వం, ప్రభుత్వ యంత్రాంగం చూపించే చిత్తశుద్ధే భాగ్యనగర భవితను, కోట్లాది మంది ప్రజల భాగ్యాలను నిర్ణయిస్తుంది.

## బేటీ బచావో... బేటీ పఢావో

నీ చెల్లెకంటే చిన్నది కదరా
ఆ ముఖంలో, నీ అమ్మ కనిపించలేదురా
చేతులు జోడించి వేడుకొన్నది
జింకపిల్లలా వొణికి పోయింది
వెంటున్న పిల్లాడినుంచి,
క్రూరంగా లాక్కెళ్లావు కదరా

నిస్సహాయంగా పిల్ల తల్లడిల్లింది
తోడున్న పిల్లాడు, భయాన్ని జయించాడు
తెగించి నమ్మకాన్ని, లోకాన రక్షించాడు

అమ్మాయిని నలిపేశావు
సగం ప్రాణం తీసేశావు
అసభ్యంగా, మృగంలా వేటాడావు
మానవత్వాన్ని చెరిచావు కదరా

కాపలా ఏమైంది, కర్తవ్యమేమైంది
చీకట్లో దీపమేమైంది
చుట్టూవున్న మనుషులకేమైంది

ఆ చిన్న అభిమన్యుడే లేకపోతే
అమ్మాయి జీవితం గుడ్డిదయ్యేది కదరా

బేటీ బచావో ఏమైంది
బేటీ పఢావో ఏమైంది

ప్రజల స్వప్నం ఏమైంది
ఈ దేశానికి ఏమైంది
(బీహార్ - 19 సెప్టెంబర్ 2026న, జముయ్‌లో - మైనర్ అమ్మాయి మీద, అబ్బాయి మీద దాడిచేసి, హింసించిన సంఘటన)

**- ఆశారాజు**
9392302245

**ఎడిట్ పేజీ కోసం మీ సామాజిక విశ్లేషణలు, సాహిత్య వ్యాసాలు manamlekhalu@ gmail.com మెయిల్ అడ్రస్‌కు పంపగలరు**

**ఈ పేపర్ కోసం https://www.manamepaper.com/ వెబ్‌సైట్‌లో చూడండి- ఎడిటర్**

# ఫిరాయింపులపై అనర్హతే 'సుప్రీం' తీర్పు

ప్రజాస్వామ్య మహాసౌధానికి పటిష్ఠమైన పునాది ప్రజాతీర్పు. నిశ్శబ్ద విప్లవంగా సాగే ఓటు హక్కు కేవలం ఒక అభ్యర్థి రూపురేఖలకో, వ్యక్తిగత ప్రాబల్యానికో ఇచ్చే సమ్మతి పత్రం కాదు. ఆ అభ్యర్థి ప్రాతినిధ్యం వహించే రాజకీయ సిద్ధాంతానికి, పార్టీ ప్రణాళికకు, ప్రజాస్వామిక వాగ్దానానికి పౌరులు అందించే పవిత్రమైన తీర్పు. అయితే ఎన్నికల బరిలో ఒక జెండా నీడన గెలిచి, అధికార పీఠం ఎక్కిన పిదప వ్యక్తిగత స్వార్థ ప్రయోజనాల కోసమో, రాజకీయ అవకాశవాదం కోసమో పార్టీ కండువాలు మార్చేసే 'ఆయా రామ్-గయా రామ్' సంస్కృతి భారత రాజకీయాలను దశాబ్దాల పాటు భ్రష్టు పట్టించింది. ఈ నైతిక పతనానికి ముకుతాడు వేసేందుకు, రాజ్యాంగ నైతికతను పరిరక్షించేందుకు 1985లో రాజీవ్ గాంధీ ప్రధానిగా ఉన్న తరుణంలో 52వ రాజ్యాంగ సవరణ ద్వారా తీసుకొచ్చిన రక్షణ కవచమే పదో షెడ్యూల్. భారత రాజ్యాంగంలోని 102(2), 191(2) అధికరణలకు వెన్నుదన్నుగా నిలిచిన ఈ 'పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం' కేవలం కాగితపు నిబంధనల సంపుటి కాదు. అది ఓటు వేసిన ప్రజల ఆత్మగౌరవానికి చట్టం కల్పించిన వజ్రాయుధం.

ఈ రాజ్యాంగ నిబంధనావళిని నిశితంగా పరిశీలిస్తే, పదో షెడ్యూల్లోని రెండో పేరా ప్రజాప్రతినిధుల అనర్హతకు సంబంధించి తిరుగులేని గీటురాళ్లను నిర్దేశిస్తుంది. ఇందులో ప్రధానంగా చర్చనీయాంశమయ్యేది పేరా 2(1)(ఎ). ఏ రాజకీయ పార్టీ తరపునైతే ఒక సభ్యుడు శాసనసభకు లేదా పార్లమెంటుకు ఎన్నికవుతాడో, ఆ పార్టీ ప్రాథమిక సభ్యత్వాన్ని అతడు స్వచ్ఛందంగా వదులుకుంటే అతడు సభాసభ్యత్వానికి తక్షణమే అనర్హుడవుతాడని ఈ నిబంధన కుండబద్దలు కొడుతుంది. ఇక్కడ చట్టం చెప్పే 'స్వచ్ఛందంగా వదులుకోవడం' అనే మాటకు న్యాయస్థానాలు విస్తృతమైన, విప్లవాత్మకమైన భాష్యం చెప్పాయి. 1994 నాటి సుప్రసిద్ధ 'రవి నాయక్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా' కేసు మొదలుకొని ఎన్నో కీలక తీర్పుల్లో అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసిన సూత్రం ఏమిటంటే...సభ్యత్వాన్ని వదులుకోవడమంటే కేవలం రాతపూర్వకంగా పార్టీకి రాజీనామా లేఖ సమర్పించడం మాత్రమే కాదు. సదరు ప్రజాప్రతినిధి బహిరంగ ప్రవర్తన, ప్రత్యర్థి పార్టీల వేదికలను పంచుకోవడం, ప్రత్యర్థి సిద్ధాంతాలను ప్రచారం చేయడం, ఇతర పార్టీల కండువాలు కప్పుకోవడం వంటి పనులన్నీ కూడా అతడు తన మాతృపార్టీ సభ్యత్వాన్ని స్వచ్ఛందంగా పరిత్యజించినట్లేనని చట్టం పరిగణిస్తుంది. అంటే చట్టం కన్నుగప్పి రాజీనామా చేయకుండానే అవతలి గట్టున చేరి అధికార సౌఖ్యాలు అనుభవించాలనుకునే రాజకీయ చతురతకు ఈ నిబంధన గొడ్డలిపెట్టుగా నిలుస్తుంది.

దీనికి భిన్నంగా పేరా 2(1)(బి) సభా అంతర్గత క్రమశిక్షణను నిర్దేశిస్తుంది. సభలో ఏదైనా బిల్లుపై లేదా తీర్మానంపై ఓటింగ్ జరిగే సమయంలో పార్టీ జారీ చేసిన విప్ (ఆదేశం)ను ధిక్కరించి ఓటు వేసినా, లేదా అనుమతి లేకుండా ఓటింగ్‌కు గైర్హాజరైనా ఆ సభ్యుడిపై అనర్హత వేటు పడుతుంది. అయితే ఈ నిర్దిష్ట నిబంధన కింద ఒక మినహాయింపు లేదా ఉపశమనం ఉంది. సభ్యుడి ఉల్లంఘనను సంబంధిత రాజకీయ పార్టీ పదిహేను రోజుల వ్యవధిలో అధికారికంగా క్షమిస్తే ఆ అనర్హత రద్దవుతుంది. పదో షెడ్యూల్లోని ఈ రెండు నిబంధనల నడుమ ఉన్న మౌలికమైన, సూక్ష్మమైన భేదమేమిటంటే...సభలో విప్ ఉల్లంఘనను మాత్రమే పార్టీ క్షమించగలదు కానీ, పార్టీ సభ్యత్వాన్ని స్వచ్ఛందంగా వీడి ప్రత్యర్థి శిబిరంలోకి ప్రవేశించిన తీవ్రమైన ఉల్లంఘనను (పేరా 2(1)(ఎ)) తర్వాత కాలంలో పార్టీ క్షమించినంత మాత్రాన రాజ్యాంగబద్ధమైన అనర్హత తొలగిపోదని న్యాయ శాస్త్రం స్పష్టం చేస్తోంది.

ఇక పదో షెడ్యూల్లోని పేరా 4 మరియు పేరా 5 కూడా అత్యంత లోతైన విశ్లేషణను కోరుతాయి. తొలినాళ్లలో పేరా 3 కింద ఒక పార్టీ శాసనసభా పక్షంలో మూడింట ఒకవంతు మంది సభ్యులు చీలిపోతే దానికి రక్షణ ఉండేది. అయితే ఈ లొసుగును అడ్డం పెట్టుకుని ప్రజాప్రతినిధులను సామూహికంగా కొనుగోలు చేసే వ్యాపార రాజకీయం పెరిగిపోవడంతో, 2003లో వాజ్‌పేయి ప్రభుత్వం తెచ్చిన 91వ రాజ్యాంగ సవరణ ద్వారా చీలిక నిబంధనను పూర్తిగా రద్దు చేశారు. ప్రస్తుతం అమల్లో ఉన్న నాలుగో పేరా ప్రకారం...ఒక రాజకీయ పార్టీ మరొక పార్టీలో విలీనమైనప్పుడు, ఆ శాసనసభా పక్షంలోని కనీసం మూడింట రెండొంతుల మంది సభ్యులు ఆ నిర్ణయానికి ఆమోదం తెలిపితేనే అది చట్టబద్ధమైన విలీనమవుతుంది. అప్పుడే పదో షెడ్యూల్ నుంచి వారికి రక్షణ లభిస్తుంది. అదేవిధంగా ఐదో పేరా సభాపతి, ఉపసభాపతి, మండలి చైర్మన్ వంటి రాజ్యాంగబద్ధమైన ఉన్నత స్థానాల్లో కూర్చునే వ్యక్తులకు వారి నిష్పాక్షికతను కాపాడేందుకు రాజకీయ అనుబంధంపై కొన్ని మినహాయింపులను ప్రసాదిస్తుంది.




ఈ సమగ్ర రాజ్యాంగ పరిధిలోనే ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ వ్యవహారం దేశ రాజకీయ, న్యాయ యవనికపై తీవ్రమైన ప్రకంపనలు సృష్టించింది. 2023 తెలంగాణ శాసనసభ సార్వత్రిక ఎన్నికల్లో భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) గులాబీ జెండా నీడన, కారు గుర్తుపై పోటీ చేసి దానం నాగేందర్ ఖైరతాబాద్ ప్రజల మన్ననలు పొంది ఎమ్మెల్యేగా గెలుపొందారు. కానీ కాలం గడవక ముందే, శాసనసభ సభ్యుడిగా ఇంకా ప్రమాణ స్వీకారం చేసి కొన్ని నెలలు కూడా నిండకముందే రాజకీయసమీకరణాలు మారాయి. ఆయన కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకుని, 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఏకంగా సికింద్రాబాద్ పార్లమెంటు స్థానం నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా నామినేషన్ వేసి పోటీకి దిగారు. ఒక పార్టీ గుర్తుపై ఎమ్మెల్యేగా కొనసాగుతూనే, మరో పార్టీ తరపున ఎంపీగా పోటీకి దిగడం భారత ప్రజాస్వామ్య చరిత్రలోనే అత్యంత విడ్డూరమైన, నిర్లజ్జ రాజకీయాంశంగా మారింది. ఇది ముమ్మాటికీ రాజ్యాంగంలోని పదో షెడ్యూల్ పేరా 2(1)(ఎ) కింద స్వచ్ఛందంగా పార్టీ సభ్యత్వాన్ని వదులుకోవడమేనంటూ దాఖలైన పిటిషన్లపై తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ 2026 మార్చి 11న నిర్ణయం తీసుకుంటూ వాటిని తిరస్కరించడం రాజకీయ వర్గాల్లో తీవ్ర దుమారం రేపింది.

స్పీకర్ తీసుకున్న ఈ నిర్ణయాన్ని సవాలు చేస్తూ దాఖలైన న్యాయపోరాటంలో తెలంగాణ హైకోర్టు రాజ్యాంగ ఔన్నత్యాన్ని సమున్నతంగా నిలబెట్టింది. న్యాయస్థానం సెప్టెంబర్ 18న సంచలన తీర్పు వెలువరిస్తూ, స్పీకర్ నిర్ణయాన్ని పక్కనపెట్టి దానం నాగేందర్‌ను శాసనసభ సభ్యత్వానికి అనర్హుడిగా ప్రకటించింది. అంతేకాకుండా, ఆయన కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిగా నామినేషన్ వేసిన చట్టబద్ధమైన తేదీ అయిన 2024 ఏప్రిల్ 23 నుంచే ఈ అనర్హత వర్తిస్తుందని, నాటి నుంచే ఖైరతాబాద్ అసెంబ్లీ స్థానం ఖాళీ అయినట్లుగా పరిగణించాలని అత్యంత స్పష్టమైన తీర్పునిచ్చింది. హైకోర్టు ఇచ్చిన ఈ చారిత్రక తీర్పును సవాలు చేస్తూ దానం నాగేందర్ దేశ సర్వోన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. అయితే సెప్టెంబర్ 24, 2026న భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, న్యాయమూర్తులు జస్టిస్ జాయ్‌మాల్య బాగ్చీ, జస్టిస్ వి.మోహనలతో కూడిన సుప్రీంకోర్టు త్రిసభ్య ధర్మాసనం ఆయన పిటిషన్‌ను నిర్ద్వంద్వంగా కొట్టివేసింది. హైకోర్టు రాజ్యాంగ స్ఫూర్తిని, పదో షెడ్యూల్ మూల ఉద్దేశాన్ని పరిపూర్ణంగా అర్థం చేసుకుని సరైన తీర్పునిచ్చిందని, అందులో తాము జోక్యం చేసుకోవలసిన అవసరమే లేదని తేల్చిచెప్పింది.

ఈ విచారణ సందర్భంగా దానం నాగేందర్ తరపు న్యాయవాదులు పదో షెడ్యూల్లో సభ్యుడి చర్యను పార్టీ క్షమించే వెసులుబాటు ఉందని చేసిన వాదనను అత్యున్నత న్యాయస్థానం తీవ్రంగా తోసిపుచ్చింది. పేరా 2(1)(బి)లో చెప్పబడిన పదిహేను రోజుల క్షమాభిక్ష కేవలం సభలో ఓటింగ్ ధిక్కరణకు మాత్రమే పరిమితమని, పేరా 2(1)(ఎ) కింద వేరే పార్టీ కండువా కప్పుకుని, ఆ పార్టీ అభ్యర్థిగా ఎన్నికల్లో పోటీ చేసిన బహిరంగ ఫిరాయింపునకు ఎలాంటి క్షమాభిక్ష వర్తించబోదని ప్రధాన న్యాయమూర్తి ధర్మాసనం గట్టిగా స్పష్టం చేసింది. ఈ తీర్పు భారత ప్రజాస్వామిక వ్యవస్థలో ఒక మైలురాయిగా నిలిచిపోతుంది. ఒకప్పుడు పదో షెడ్యూల్‌ను రాజకీయ నాయకులు తమ అనుకూలతకు వాడుకునే మైనపు ముద్దగా మార్చి, స్పీకర్ల కాలయాపన వ్యూహాలతో పదవీకాలాన్ని లాగించేసే పద్ధతులకు ఈ తీర్పు కళ్ళెం వేసింది. రాజ్యాంగ నైతికత అనేది రాజకీయ విన్యాసాల కంటే ఉన్నతమైనదని, ప్రజల తీర్పును అపహాస్యం చేసే ఏ ప్రజాప్రతినిధి అయినా రాజ్యాంగం విసిరే అనర్హత ఖడ్గానికి బలికాక తప్పదని సుప్రీంకోర్టు తీర్పు పునరుద్ఘాటించింది. ప్రజాస్వామ్యంలో ప్రజలే ప్రభువులు, వారి ఆశయాలే శాసనాలు.. అధికారం కోసం సిద్ధాంతాలను కాలరాసి పార్టీలు మారే రాజకీయ నాయకులకు పదో షెడ్యూల్ ఒక హెచ్చరికగా నిలుస్తుందనడానికి దానం నాగేందర్ అనర్హత వ్యవహారమే నిదర్శనం.

**- రామ కిష్టయ్య సంగన భట్ల**
9440595494

# వికసిత్‌భారత్‌కు ఉపాధ్యాయుడే మార్గదర్శి



యువ నాయకత్వానికి ఆలోచన, ఆచరణ, ఆదర్శాన్ని అందించాల్సిన బాధ్యత గురువులదే. భారతదేశం 2047 నాటికి వికసిత్ భారత్‌గా అవతరించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నవేళ, దేశ భవిష్యత్తును తీర్చిదిద్దే శక్తిగా యువతపై దృష్టి కేంద్రీకృతమవుతోంది. యువతలోని ఆలోచనాశక్తి, సృజనాత్మకత, నైపుణ్యం, నాయకత్వ సామర్థ్యాలను దేశ నిర్మాణానికి అనుసంధానించడంలో వికసిత్ భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్ వంటి వేదికలు కీలకమైనవి. అయితే యువతలో నాయకత్వ లక్షణాలను పెంపొందించడంలో అత్యంత ముఖ్యమైన పాత్ర పోషించేది ఉపాధ్యాయులే.



ఉపాధ్యాయుడి బాధ్యత తరగతి గదిలో పాఠ్యాంశాలను బోధించడంతో ముగియదు. విద్యార్థి ఆలోచించే విధానాన్ని మార్చడం, ప్రశ్నించే తత్వాన్ని పెంపొందించడం, సమాజాన్ని అర్థం చేసుకునే దృష్టిని కల్పించడం, బాధ్యతాయుత పౌరుడిగా తీర్చిదిద్దడం కూడా గురువు బాధ్యతే. ఒక విద్యార్థిలో దాగి ఉన్న ప్రతిభను గుర్తించి, దానికి సరైన దిశ చూపగలిగితే అదే ప్రతిభ భవిష్యత్తులో దేశానికి నాయకత్వాన్ని అందించగలదు.

వికసిత్ భారత్ నిర్మాణంలో యువత తమ ఆలోచనలు, సూచనలు, సృజనాత్మక పరిష్కారాలను ముందుకు తీసుకురావాలి. విద్య, ఆరోగ్యం, వ్యవసాయం, ఉపాధి, సాంకేతికత, పర్యావరణ పరిరక్షణ, మహిళా సాధికారత, గ్రామీణాభివృద్ధి వంటి అంశాలపై విద్యార్థులు ఆలోచించేలా ఉపాధ్యాయులు ప్రోత్సహించాలి. చర్చలు, డిబేట్లు, ప్రాజెక్టులు, సమస్య పరిష్కార కార్యక్రమాలు, గ్రూప్ యాక్టివిటీస్ ద్వారా విద్యార్థుల్లో విమర్శనాత్మక ఆలోచన, సృజనాత్మకత, మాట్లాడే నైపుణ్యం మరియు నాయకత్వ నైపుణ్యం అభివృద్ధి చేయవచ్చు. నాయకత్వం అంటే కేవలం ఒక పదవిని పొందడం కాదు. సమస్యను గుర్తించడం, బాధ్యత తీసుకోవడం, పరిష్కారం కోసం ప్రయత్నించడం, ఇతరులను కలుపుకొని ముందుకు సాగడం నిజమైన నాయకత్వ లక్షణాలు. ఈ విలువలను విద్యార్థుల్లో చిన్న వయస్సు నుంచే పెంపొందించడంలో ఉపాధ్యాయుల పాత్ర అపారమైనది. తరగతి గదిలో విద్యార్థులకు బాధ్యతలు అప్పగించడం, బృందాలను నడిపించే అవకాశాలు ఇవ్వడం, నిర్ణయాలు తీసుకునేలా ప్రోత్సహించడం ద్వారా నాయకత్వ లక్షణాలకు పునాది వేయవచ్చు.

నేటి యువత సాంకేతిక పరిజ్ఞానంలో ముందంజలో ఉంది. కృత్రిమ మేధస్సు, డిజిటల్ టెక్నాలజీ, రోబోటిక్స్, బయోటెక్నాలజీ వంటి రంగాలు కొత్త అవకాశాలను సృష్టిస్తున్నాయి. అయితే సాంకేతిక నైపుణ్యాలతో పాటు నైతిక విలువలు, సామాజిక బాధ్యత, రాజ్యాంగ స్ఫూర్తి, పర్యావరణ పరిరక్షణ పట్ల అవగాహన కూడా అవసరం. వికసిత్ భారత్ లక్ష్యం నగరాల అభివృద్ధితో మాత్రమే సాధ్యం కాదు.

గ్రామీణ ప్రాంతాల యువతకు కూడా సమాన అవకాశాలు, నైపుణ్యాభివృద్ధి, సాంకేతిక పరి జ్ఞానం మరియు ఉపాధి అవకాశాలు అందాలి. ముఖ్యంగా ప్రభుత్వ కళాశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులు గ్రామీణ విద్యార్థుల లోని ప్రతిభను వెలికితీసి, వారిని ఉన్నత లక్ష్యాల వైపు నడిపించాల్సిన అవసరం ఉంది. ఒక మంచి ఉపాధ్యాయుడు విద్యార్థికి సరైన ప్రశ్నలు అడగడం నేర్పిస్తాడు. ఒక మంచి గురువు విద్యార్థిని పరీక్షలకు మాత్రమే కాకుండా జీవితానికి సిద్ధం చేస్తాడు. అందుకే వికసిత్ భారత్‌లో ఉపాధ్యాయుల పాత్ర మార్గదర్శకుడు, ప్రేరణదాత, శిక్షకుడు, ఆలోచనలకు దిశానిర్దేశకుడు అనే కోణాల్లో ఎంతో ప్రాధాన్యమైనది.

వికసిత్ భారత్ అనేది కేవలం ప్రభుత్వ లక్ష్యం కాదు. అది ప్రతి పౌరుడి సమిష్టి బాధ్యత. ఆ బాధ్యతను యువతలో నాటే మొదటి వేదిక విద్యా సంస్థ.

ఆ వేదికకు దిశానిర్దేశం చేసే శక్తి ఉపాధ్యాయుడు. యువత దేశ భవిష్యత్తు అయితే, ఆ భవిష్యత్తును తీర్చిదిద్దే శిల్పులు ఉపాధ్యాయులు. కాబట్టి ప్రతి ఉపాధ్యాయుడు ఒక విద్యార్థిలోని ప్రతిభను గుర్తించి, ఆలోచనకు రెక్కలు ఇచ్చి, నాయకత్వానికి దిశ చూపి, దేశ సేవకు సిద్ధం చేయాలి. అప్పుడు మాత్రమే వికసిత్ భారత్ 2047 అనే లక్ష్యం సాకారమవుతుంది. యువత కృషే వికసిత్ భారత్‌కు బలమైన పునాది.

**- ఎస్. పద్మావతి**

# యువత చేతుల్లోనే దేశ భవిష్యత్తు

యువత దేశానికి వెన్నెముక లాంటిది. వారి చేతుల్లోనే భవిష్యత్తు నిర్మాణం సాగుతుంది. అటువంటి యువతలో సేవా భావాన్ని పెంపొందించడం ఎలా? సేవ అంటే తన స్వార్థాన్ని పక్కన పెట్టి, ఇతరుల కోసం ఆలోచించడం. తన శక్తి సామర్థ్యాలను సమాజ శ్రేయస్సు కోసం వినియోగించడం. ప్రాచీన కాలం నుంచి భారతీయ సంస్కృతిలో సేవకు అత్యంత ప్రాముఖ్యత ఉంది. 'పరోపకారార్థం ఇదం శరీరం' అని లోకోక్తి. అంటే ఇతరుల మేలు కోసమే ఈ శరీరం అని అర్థం. ఈ భావన నేటి యువతలో కూడా ఉండాలి. కానీ ఆధునిక జీవనశైలి,వ్యక్తిగత లక్ష్యాలపై దృష్టి వంటి అంశాలు యువతను స్వార్థం వైపు నెడుతున్నాయి.

యువత సమాజ సేవలో పాల్గొనడం అనేది వారి వ్యక్తిగత అభివృద్ధికి సహాయపడుతుంది. సహాయం చేయడం వల్ల ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. నాయకత్వ గుణాలు అలవడతాయి. సమస్యలను పరిష్కరించే సామర్థ్యం వస్తుంది. సామాజిక కోణంలో చూస్తే, యువత సేవ వల్ల సమాజంలోని అనేక సమస్యలు పరిష్కారం

నేషనల్ సర్వీస్ స్కీమ్ (NSS) అనేది భారత ప్రభుత్వం చేపట్టిన అత్యంత విజయవంతమైన కార్యక్రమాలలో ఒకటి. 1969లో ప్రారంభమైన ఈ కార్యక్రమం లక్షలాది మంది విద్యార్థులను సేవా మార్గంలో నడిపించింది. కాలేజీలు, విశ్వవిద్యాలయాల్లోని విద్యార్థులు ఈ కార్యక్రమంలో స్వచ్ఛందంగా పాల్గొంటారు. గ్రామీణ ప్రాంతాల్లోని సమస్యలను అర్థం చేసుకుంటారు. పారిశుధ్య కార్యక్రమాలు, అక్షరాస్యతా ఉద్యమాలు, ఆరోగ్య శిబిరాలు, పర్యావరణ పరిరక్షణ వంటి అనేక కార్యకలాపాల్లో పాల్గొంటారు. ఈ కార్యక్రమం వల్ల యువతకు గ్రామీణ జీవనం గురించి అవగాహన కలుగుతుంది.



ప్రపంచంలోని ఇతర దేశాల్లో కూడా యువత సేవా కార్యక్రమాలు విస్తృతంగా ఉన్నాయి. అమెరికాలో 'పీస్ కార్ప్స్' అనే సంస్థ యువతను అభివృద్ధి చెందుతున్న దేశాల్లో పని చేయడానికి పంపుతుంది. ఆఫ్రికా, ఆసియా దేశాల్లో విద్య, ఆరోగ్యం, వ్యవసాయం వంటి రంగాల్లో యువ స్వచ్ఛంద సేవకులు పని చేస్తారు. జపాన్‌లో 'యువ స్వచ్ఛంద సేవ' అనే కార్యక్రమం ద్వారా విద్యార్థులు ముసలి వారికి, వికలాంగులకు సహాయం చేస్తారు. జర్మనీలో 'ఫెడరల్ వాలంటరీ సర్వీస్' అనే కార్యక్రమం యువతకు సామాజిక సేవలో పాల్గొనే అవకాశం ఇస్తుంది. ఈ కార్యక్రమాల్లో పాల్గొన్న యువత తర్వాతి కాలంలో మంచి పౌరులుగా, బాధ్యతాయుతమైన నాయకులుగా ఎదుగుతారు. భారతదేశం కూడా ఈ దిశలో మరింత ముందుకు సాగాలి.ఎన్ఎస్ఎస్ లాంటి కార్యక్రమాలను మరింత విస్తరించాలి.

పిల్లలకు చిన్న వయసు నుంచే సేవా భావాన్ని నేర్పాలి. ఇంటి పెద్దలు సేవ చేస్తూ ఉంటే, పిల్లలు కూడా నేర్చుకుంటారు. విద్యాసంస్థల్లో సేవను పాఠ్యప్రణాళికలో భాగం చేయాలి. పరీక్షల్లో సేవా కార్యకలాపాలకు మార్కులు ఇవ్వాలి. యువతకు ప్రోత్సాహకాలు,ఉద్యోగాల్లో ప్రాధాన్యత ఇవ్వాలి.

భారతదేశంలో అనేక మంది యువకులు సేవలో రాణించి, ఇతరులకు స్ఫూర్తినిస్తున్నారు. అరుణాచలం మురుగనాథం లాంటి సామాజిక కార్యకర్తలు యువతను ప్రోత్సహిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో చదువుకున్న యువకులు తమ ఊర్లలోనే ఉండి, అభివృద్ధి పనులు చేపడుతున్నారు. నగరాల్లో ఉన్న యువత గ్రామాలకు వెళ్లి, సేవ చేస్తున్నారు. ఐటీ ఉద్యోగులు తమ సెలవు దినాల్లో పారిశుధ్య కార్యక్రమాలు, అక్షరాస్యతా తరగతులు నిర్వహిస్తున్నారు. ఇంజనీరింగ్ విద్యార్థులు గ్రామాలలో మంచినీటి సమస్యలు, విద్యుత్ సమస్యలు పరిష్కరించడానికి కృషి చేస్తున్నారు. యువతలో సేవా భావాన్ని పెంపొందించడం అనేది ఒక రోజు పని కాదు. అది నిరంతర ప్రక్రియ. కుటుంబం, విద్యాసంస్థలు, ప్రభుత్వం, సమాజం అందరూ కలిసి కృషి చేస్తేనే సాధ్యమవుతుంది. యువత తాము చదువుకున్న జ్ఞానాన్ని, సంపాదించిన సామర్థ్యాలను సమాజ శ్రేయస్సు కోసం వినియోగించాలి. సమాజంలో గౌరవం దక్కుతుంది. దేశం అభివృద్ధి చెందుతుంది.

**- చిటికెన కిరణ్ కుమార్**
9490841284

# రోగికీ వైద్యుడికీ వారధి ఫార్మసిస్టే...



మానవ మనుగడలో ప్రాణ రక్షణ కంటే ప్రాధాన్యమైనది మరొకటి లేదు. ఈ భూమ్మీద జన్మించిన ప్రతి ఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యంతో జీవించాలని ఆశిస్తారు. ఆ దిశగానే ఆధునిక మానవుడు వైద్య విజ్ఞానం పైన, వైద్యులు అందించే మందులపైన విశేషంగా ఆధారపడుతున్నాడు. నిత్య జీవితంలో ఏ చిన్న శారీరక రుగ్మత ఎదురైనా వెంటనే ఏదో ఒక ఔషధాన్ని ఉపయోగించడం పరిపాటిగా మారింది. దీనిబట్టి మానవ జీవితంలో మందుల ప్రమేయం ఎంతటి కీలక స్థానాన్ని ఆక్రమించిందో గ్రహించవచ్చు. అయితే, రోగాన్ని గుర్తించడం ఒక ఎత్తయితే, దానికి తగిన సమర్థవంతమైన ఔషధాలను సృష్టించడం, వాటి నాణ్యతను కాపాడడం, సురక్షితమైన రీతిలో ప్రతి రోగికి అందేలా చూడడం మరొక ఎత్తు. నిజానికి ఔషధం లేని చికిత్సను ఊహించలేము. అందుకే, సమాజంలో వ్యాధుల నివారణకు నిజమైన శోధకులుగా, రోగ నివారణకు వెన్నుముకగా నిలిచే అసలు కర్మచారులు ఫార్మసిస్టులే అని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదు.

అపారమైన ప్రజా సంక్షేమ ధ్యేయంతో శ్రమిస్తున్న ఈ నిపుణుల సేవలను ప్రపంచవ్యాప్తంగా ప్రతి ఒక్కరూ గుర్తించాలనే లక్ష్యంతో అంతర్జాతీయ ఫార్మాస్యూటికల్ ఫెడరేషన్ (FIP) నిరంతరం కృషి చేస్తోంది.

ఫార్మారంగ ప్రతిష్టను, ఫార్మసిస్టుల బాధ్యతాయుతమైన పాత్రను ప్రతిబింబిస్తూ ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 25వ తేదీన ప్రపంచ ఫార్మసిస్టుల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యాన్ని పురస్కరించు కుని, 2026 నాటి ప్రపంచ ఫార్మసిస్టుల దినోత్సవం కోసం 'ఆరోగ్యకరమైన భవిష్యత్తు కోసం ఫార్మసిస్టులను సాధికారత వైపు నడిపించడం' (Empowering Pharmacists for Healthier Futures) అనే ప్రతిష్టాత్మక ఇతివృత్తాన్ని అంత ర్జాతీయ సమాజం ఎంచుకుంది. ఈ నేపథ్యం ప్రపంచ ఆరోగ్య రక్షణలో ఫార్మసిస్ట్ స్థానాన్ని మరింత ఎత్తుకు తీసుకె ళ్తోంది.

వైద్య రంగాన్ని పరిశీలిస్తే రోగాన్ని నిరోధించే క్రమం లో ప్రాథమిక బాధ్యత వైద్యుడిదైతే, ఆ రోగాన్ని అణచివేసే సరైన ఔషధాన్ని అందించే బాధ్యత ఫార్మసిస్టుది.

ఔషధం ఏ మోతాదులో తీసుకోవాలి, రోజులో ఎన్నిసార్లు వాడాలి, ఏ ఆహారంతో కలిపి తీసుకోకూడదు, దానివల్ల సంభవించే దుష్ప్రభావాలు (Side Effects) ఏముంటాయి అనే విజ్ఞానాన్ని అందించడంలో ఫార్మసిస్టు పాత్ర అపారమైనది. రోగికి, వైద్యునికి మధ్య వీరు ఒక ప్రత్యక్ష వంతెనగా పనిచేస్తారు. క్లినికల్ ట్రయల్స్ నుంచి మందుల నిల్వ వరకు, పరిశోధనా రహిత విజ్ఞానం నుంచి సమాజంలోని ప్రతి వ్యక్తికి ఆ మందు చేరే వరకు ప్రతి దశలోనూ ఫార్మసిస్ట్ చురుకైన పాత్ర పోషిస్తున్నారు. ఫార్మసిస్ట్ పర్యవేక్షణ లేకుండా అందించే ఏ వైద్యమైనా సంపూర్ణమైన ఫలితాన్ని ఇవ్వడం అసాధ్యం.

అత్యవసర పరిస్థితుల్లో, సుదూర ప్రాంతాల్లో వైద్యులు అందుబాటులో లేని తరుణంలో, ప్రాథమిక వైద్య సలహాలు అందిస్తూ రోగులను కాపాడడంలో ఫార్మసిస్టులు ముందంజలో ఉంటారు. ఈ అవసరాన్ని భారత ప్రభుత్వం స్వాతంత్ర్యం వచ్చిన కొత్తలోనే గుర్తించింది. అందుకే 1948లోనే భారత ఫార్మసీ చట్టాన్ని రూపకల్పన చేసి ఆమోదించారు. అయితే, సరైన అమలుకు నోచుకోకపోవడం వల్ల దశాబ్దాలుగా మన దేశంలో ఫార్మసిస్టుల ప్రాధాన్యతకు తగినంత అధికారిక గుర్తింపు దక్కలేదు.

అనేక దేశాల్లో వైద్యులు రాసిన ప్రిస్క్రిప్షన్లను సమీక్షించి మార్పులు సూచించే అధికారం కూడా ఫార్మసిస్టులకు ఉంటుంది. కానీ మనవద్ద ఫార్మసిస్టు - వైద్యుల మధ్య ఉండాల్సిన సమన్వయ వ్యవస్థ ఇంకా పూర్తి స్థాయిలో బలోపేతం కాలేదు. దీనిఫలితంగా అవసరానికి మించి మందుల వినియోగం పెరిగిపోవడం, తద్వారా తీవ్ర మైన దుష్ప్రభావాలు ఎదురుకావడం జరుగుతోంది.

ప్రస్తుత ప్రపంచాన్ని తీవ్రంగా భయపెడుతున్న సంక్షోభాల్లో 'యాంటీమైక్రోబియల్ రెసిస్టెన్స్' (AMR) అత్యంత ప్రమాదకరమైనది. చిన్న చిన్న అనారోగ్యాలకు కూడా డాక్టర్ సలహా లేకుండా క్రమరహితంగా యాంటిబయోటిక్స్ వాడటం వల్ల, వ్యాధి క్రిములు ఆ మందులను తట్టుకునే శక్తిని పెంచుకుంటున్నాయి. ప్రతి సంవత్సరం పెరుగుతున్న ఈ తీవ్ర ముప్పును అరికట్టడంలో ఫార్మసిస్టులు ప్రజా రక్షణ కవచంలా పనిచేస్తున్నారు. వైద్యుడి ఆమోదం లేనిదే యాంటిబయోటిక్స్ అందించకూడదనే నిబంధనలను పాటించడంతో పాటు, రోగులు మందుల కోర్సును మధ్యలోనే ఆపకుండా వాడేలా అవగాహన కల్పించడంలో ఫార్మసిస్టులు క్రియాశీలక భూమిక పోషిస్తున్నారు.

దీనికితోడు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డిజిటల్ హెల్త్ యుగంలో భవిష్యత్ ఫార్మా రంగం సరికొత్త ఆవిష్కరణలకు కేంద్రంగా మారుతోంది. జన్యుఆధారిత చికిత్సలు (Perso - nalized Medicine), ఈ-ప్రిస్క్రిప్షన్లు, రోబోటిక్ డ్రగ్ డిస్పెన్సింగ్ వంటి సాంకేతిక మార్పులను స్వీకరిస్తూ, డిజిటల్ హెల్త్ ప్లాట్‌ఫామ్‌ల ద్వారా దూరప్రాంత రోగులకు టెలి-ఫార్మసీ సేవలు అందించడంలో ఫార్మసిస్టులు కీలక భాగస్వాములుగా మారనున్నారు.

గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు సమగ్ర ఆరోగ్య సేవలు అందాలంటే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు , సామాజిక ఆరోగ్య కేంద్రాలు, ఏరియా ఆసుపత్రుల్లో ఖాళీగా ఉన్న ఫార్మసిస్ట్ పోస్టులను ప్రభుత్వం వెంటనే భర్తీ చేయాలి. అలాగే, నేడు గ్రామీణ ఉపకేంద్రాల్లో కూడా మందుల పంపిణీ పరిధి విస్తరిస్తున్నందున, పెరుగుతున్న అవసరాలకు అనుగుణంగా అక్కడ కూడా నూతనంగా ఫార్మసిస్ట్ పోస్టులను మంజూరు చేయాల్సిన అవసరం ఉంది.

డిగ్రీ, డిప్లొమా పూర్తి చేసిన నిరుద్యోగ ఫార్మా గ్రాడ్యుయేట్లకు సొంతంగా ఫార్మసీ కేంద్రాలను స్థాపించుకోవడానికి వడ్డీ రహిత రుణాలు, ప్రత్యేక ప్రోత్సాహకాలు అందించడం వల్ల గ్రామీణ ప్రాంతాలకు ఆరోగ్య సేవలు విస్తరించడమే కాకుండా, పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు కూడా పెరుగుతాయి.

కమ్యూనిటీ హెల్త్ నెట్‌వర్క్‌లలో ఫార్మసిస్టులకు తగిన స్థానం కల్పించడం ద్వారానే నూతన ఔషధ పరిశోధనల్లో, నాణ్యతా నియంత్రణలో భారతదేశం గ్లోబల్ లీడర్‌గా ఎదగగలదు. 2026 నాటి 'ఆరోగ్యకరమైన భవిష్యత్తు కోసం ఫార్మసిస్టులను సాధికారత వైపు నడిపించడం' అనే ప్రధాన నినాదం నెరవేరాలంటే ఫార్మసిస్టులకు తగిన గౌరవం, చట్టబద్ధమైన సాధికారత, వృత్తిపరమైన స్వేచ్ఛ కల్పించడం అత్యావశ్యకం.

ఏ సమాజమైనా ఆరోగ్యవంతంగా నిలబడాలంటే వైద్యులు, నర్సులు, ఫార్మసిస్టులు సమాన సమన్వయంతో పనిచేయాల్సి ఉంటుంది. ఔషధ పరిజ్ఞానం కలిగిన ఫార్మసిస్ట్ శ్రమను గుర్తించడం అంటే ప్రజా ఆరోగ్యాన్ని సురక్షితం చేయడమే. మందుల సృష్టికర్తలుగా, రోగ ఉపశమన మిత్రులుగా రాత్రింబవళ్ళు శ్రమిస్తున్న ఫార్మసిస్టుల సేవలను స్మరించుకుంటూ, ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 25న జరుపుకునే ప్రపంచ ఫార్మసిస్టుల దినోత్సవం సందర్భంగా వారి ప్రాముఖ్యతను గుర్తించడం, గౌరవించడం, వారికీ తగిన సాధికారతను అందించడం సమాజంలోని ప్రతి పౌరుడి, ప్రభుత్వాల ప్రథమ కర్తవ్యం.

**- యండి. ఉస్మాన్ ఖాన్**
9912580645

# విద్యార్థులకు అందుబాటులో వసతి గృహం

- చెన్నూరులో తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటుకు చర్యలు
- రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద



మంచిర్యాల,సెప్టెంబర్ 24 మనం ప్రతినిధి: విద్యారంగ అభివృద్ధి కోసం ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటుందని, ఇందులో భాగంగా విద్యార్థుల సౌకర్యార్థం షెడ్యూల్ కులముల సంక్షేమ వసతి గృహ ఏర్పాటుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద అన్నారు. గురువారం జిల్లాలోని జైపూర్ మండల కేంద్రంలో షెడ్యూల్ కులముల సంక్షేమ వసతి గృహ నిర్మాణానికి జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, డి.సి.పి. ఎ.భాస్కర్, షెడ్యూల్ కులముల అభివృద్ధి శాఖ ఉపసంచాలకులు చాతరాజుల దుర్గాప్రసాద్, మండల తహసిల్దార్ వనజా రెడ్డి, మండల పరిషత్ అభివృద్ధి అధికారి శ్రీపతి బాపు, డి.సి.సి. ప్రతినిధి రఘునాథ్, చెన్నూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ తివారి లతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ షెడ్యూల్ కులముల విద్యార్థుల సంక్షేమం దిశగా 1 కోటి 81 లక్షల రూపాయల సి.ఎస్.ఆర్. నిధులతో వసతి గృహ నిర్మాణం చేపట్టడం జరుగుతుందని తెలిపారు. చెన్నూర్ లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2 కోట్ల రూపాయల నిధులతో అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందని, 1 కోటి 50 లక్షల రూపాయలతో జూనియర్ కళాశాలలో అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందని తెలిపారు. మండలంలోని సోమనపల్లి గ్రామంలో 200 కోట్ల రూపాయలతో 2 వేల 500 మంది విద్యార్థులకు వసతి కల్పించేలా యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణం చేపట్టడం జరుగుతుందని తెలిపారు. చెన్నూర్ ప్రాంతంలో తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని, కోటపల్లి మండలంలో సైతం షెడ్యూల్ కులముల వసతి గృహ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. మందమర్రి ప్రాంతంలోని భూములలో సింగరేణి సంస్థ సమన్వయంతో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. చెన్నూర్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, రామకృష్ణాపూర్ సమీప ప్రాంతాల ప్రజల కోసం మందమర్రి మండల కేంద్రంలో 50 పడకలతో ఆసుపత్రి ఏర్పాటుకు ప్రతిపాదించడం జరిగిందని తెలిపారు. ఈ ప్రాంత నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించే దిశగా ఆర్.కె. ఓ.సి.లో నూతన గని ఏర్పాటుకు కృషి చేస్తున్నామని, మండల కేంద్రంలోని సింగరేణి స్కిల్ డెవలప్మెంట్ కేంద్రంలో జర్మనీ భాష నేర్పించి విదేశాలలో ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. వచ్చే సంవత్సరం గోదావరి పుష్కరాల నేపథ్యంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా 70 కోట్ల రూపాయలతో పుష్కర ఘాట్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అంతకుముందు జిల్లా కలెక్టర్, మండల తహసిల్దార్ తో కలిసి మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి విద్యార్థులకు అందిస్తున్న సదుపాయాలు, విద్యా బోధన, పరిసరాలను పరిశీలించారు. ఇంటర్మీడియట్ విద్యార్థులతో మాట్లాడి వసతుల కల్పనపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు బ్యాగులు, బూట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# జిల్లాను బాల్య వివాహ రహిత, పోక్సో కేసుల్లేని జిల్లాగా మార్చడమే లక్ష్యం

- అదనపు కలెక్టర్ రాజా గౌడ్



జగిత్యాల, సెప్టెంబర్ 24(మనం న్యూస్): జిల్లా సంక్షేమ శాఖ మరియు జిల్లా బాలల పరిరక్షణ విభాగాల ఆధ్వర్యంలో, జిల్లా సంక్షేమ అధికారి ఆడేపు భాస్కర్ ఆద్వర్యంలో అదనపు కలెక్టర్ రాజాగౌడ్ అధ్యక్షతన బాల్య వివాహాల నిరోధన మరియు పోక్సో కేసుల నివారణకై జిల్లా స్థాయి వార్షిక కార్యాచరణ ప్రణాళికపై ప్రత్యేక సమావేశం జరిగింది. గౌరవ అదనపు కలెక్టర్ రాజా గౌడ్ మాట్లాడుతూ, రాష్ట్ర మహిళా అభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ ఆదేశానుసారం, మిషన్ వాత్సల్య కింద 2026-27 సంవత్సరానికి గాను బాల్య వివాహాల నిరోధక చట్టం-2006 మరియు పోక్సో చట్టం-2012 ను పటిష్టంగా అమలు చేయడానికి ఈ ప్రత్యేక యాక్షన్ ప్లాన్ ను రూపొందించారు. ఈ కార్యాచరణ ప్రణాళికను ప్రతి మండలంలో మరియు అన్ని గ్రామాలలో నెలవారీ ప్రాతిపదికన పకడ్బందీగా అమలు చేయాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. అన్ని జిల్లా స్థాయి అధికారుల మరియు ప్రభుత్వ శాఖల సమన్వయంతో (విద్యాశాఖ, పంచాయతీ రాజ్, రెవెన్యూ, పోలీసు మరియు ఆరోగ్య శాఖలు) కలిసి పనిచేయాలని సూచించారు. ఈ సమష్టి కృషితో జిల్లాను పూర్తిగా 'బాల్య వివాహ రహిత జిల్లాగా' మరియు 'పోక్సో కేసులు లేని జిల్లాగా' అభివృద్ధి చేయాలని స్పష్టం చేశారు. 'బాల్య వివాహం - బతుకు ఆగం' పేరుతో పాఠశాలలు, కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం, బడి మానేసిన పిల్లలను గుర్తించి తిరిగి పాఠశాలలో చేర్పించడం, గ్రామ బాలల పరిరక్షణ కమిటీల ద్వారా ఎప్పటికప్పుడు సమీక్షలు జరపడం వంటివి ఈ కార్యాచరణ ప్రణాళికలో ముఖ్యమైన అంశాలు. ఈ విశేష కార్యక్రమానికి జగిత్యాల ఆర్డీవో మధుసూదన్ గౌడ్, కోరుట్ల ఆర్డీవో జివాకర్ రెడ్డి, జిల్లా ఆరోగ్య శాఖా అధికారి డా. సుజాత, సి పి డి ఓ లు వరలక్ష్మి, జయప్రద, వాణిశ్రీ మరియు పద్మ, డీసీపీఓ సురేష్, విద్యాశాఖ కో ఆర్డినటర్ మహేష్ మరియు అలాగే జిల్లా సంక్షేమ సమితి సభ్యులు, జిల్లా బాలల పరిరక్షణ విభాగం, మహిళా సాధికారత విభాగం, సఖి విభాగం, భరోసా కేంద్ర అధికారులు మరియు ఎన్జీవో ప్రతినిధులు ఈ సమావేశానికి హాజరయ్యారు.

# లక్కీ కూపన్ డ్రా విజేతలకు అవార్డులు అందజేత




జగిత్యాల, సెప్టెంబర్ 24 (మనం న్యూస్): జగిత్యాల పట్టణంలోని వాణినగర్లో సనాతన ధర్మ వెల్ఫేర్ సొసైటీ యువత ఆధ్వర్యంలో నిర్వహించిన లక్కీ కూపన్ డ్రా కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ మున్సిపల్ చైర్పర్సన్ ఆడువాల జ్యోతి లక్ష్మణ్ హాజరై లక్కీ కూపన్ విజేతలకు అవార్డులు, బహుమతులను మొదటి బహుమతి బైకు, రెండో బహుమతి గ్రామ్ గోల్డ్, మూడో బహుమతి ఫ్రిడ్జ్ మరికొన్ని బహుమతులు కూడా అందజేశారు. అలాగే కార్యక్రమంలో నిర్వహించిన లడ్డూ వేలంపాటలో లడ్డూను 71,116కు వడ్లకొండ చంద్రకళ, మణిదీప్ దక్కించుకున్నారు. ఈ సందర్భంగా లడ్డూ వేలంలో విజేతలుగా నిలిచిన చంద్రకళ, మణిదీప్ను మాజీ మున్సిపల్ చైర్పర్సన్ ఆడువాల జ్యోతి లక్ష్మణ్ అభినందించారు. ఈ సందర్భంగా జ్యోతి లక్ష్మణ్ మాట్లాడుతూ యువత సనాతన ధర్మం, ఆధ్యాత్మికతతో పాటు సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనడం అభినందనీయమన్నారు. సమాజంలో ఐక్యత, సేవా భావాన్ని పెంపొందించే కార్యక్రమాలను నిర్వహించడం మంచి పరిణామమని పేర్కొన్నారు. కార్యక్రమంలో సైబర్ క్రైమ్ ఎస్ఐ దినేష్ కుమార్, కానిస్టేబుల్ రాజేందర్, సనాతన ధర్మ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు మేడిశెట్టి నవీన్ కుమార్, కొప్పుల కృష్ణ, మంచాల శ్రవణ్, ఉప్పుగళ్ల విక్రం, ఉప్పుగళ్ల సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

# కట్టిన వారానికే కుప్ప కూలిన డ్రైనేజీ కాల్వ

- నాసిరకం పనులే కారణం

జగిత్యాల క్రైమ్ సెప్టెంబర్ 24 ( మనం న్యూస్ ): జిల్లా మల్యాల మండలం తాటిపెల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన డ్రైనేజీ రక్షణ గోడ (సిమెంట్ కాల్వ) నిర్మాణంలో జరిగిన అవినీతి, నాసిరకం పనులు ఒక్క చిన్న వర్షానికే బట్టబయలయ్యాయని బిజెపి ఎస్సీ మోర్చా మండల అధ్యక్షుడు సుంకపాక టైటస్ తీవ్రంగా మండిపడ్డారు. కట్టిన కేవలం 7 రోజులకే కాల్వ గోడలు పూర్తిగా బీటలు వారి, కుప్పకూలిపోవడంపై ఆయన ఘాటుగా స్పందించారు.వరి పొలాల పక్కనే నిర్మించిన ఈ



డ్రైనేజీ కాల్వ నాణ్యతా ప్రమాణాలకు లోబడి నిర్మించలేదని, కేవలం బిల్లులు డ్రా చేసుకోవడానికే ఇలాంటి నాసిరకం పనులు చేశారని సుంకపాక టైటస్ ఆరోపించారు. సిమెంట్, ఇసుక మిశ్రమం సక్రమంగా వాడకపోవడం వల్లే స్వల్ప వర్షానికే గోడలు విరిగి పడ్డాయని ఆయన పేర్కొన్నారు.అధికారుల పర్యవేక్షణ శూన్యం ప్రజాధనం వృధా ఈ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించాల్సిన అసిస్టెంట్ ఇంజనీర్ (అఈ) పర్యవేక్షణ పూర్తిగా లోపించిందని, అధికారుల నిర్లక్ష్యం, కాంట్రాక్టర్ల స్వార్థం వల్ల లక్షలాది రూపాయల ప్రజాధనం వృధా అయిందని టైటస్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, ఈ నాసిరకం పనులపై తక్షణమే విచారణ జరిపించాలని, బాధ్యులైన కాంట్రాక్టర్, సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో బిజెపి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని సుంకపాక టైటస్ హెచ్చరించారు.

# రీ సర్వే పనులను వేగవంతంగా పూర్తి చేయాలి

- జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్



జగిత్యాల/బీర్పూర్, సెప్టెంబర్ 24 (మనం ప్రతినిధి): గురువారం బీర్ పూర్ మండలం మోతి నగర్, డొంకేశ్వర్ గ్రామాల్లో నాన్ కెడస్ట్రాల్ రీసర్వే, ఎంజాయ్ మెంట్ రీ సర్వే పనులను జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రీ సర్వే ప్రక్రియను ప్రణాళికాబద్ధంగా, పకడ్బందీగా చేపట్టి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఇప్పటివరకు ఎంత విస్తీర్ణంలో రీ సర్వే పూర్తయింది, ఇంకా ఎంత మేర చేపట్టాల్సి ఉంది, పనులు ఎన్ని రోజుల్లో పూర్తవుతాయనే వివరాలను రెవెన్యూ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆయా గ్రామాల్లో భూమి విస్తీర్ణం ఎంత ఉందని ఆరా తీశారు. సర్వే నంబర్ల వారీగా ఎలాంటి పొరపాట్లు లేకుండా ఖచ్చితత్వంతో రీ సర్వే నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా భూముల రీ సర్వే కార్యక్రమాన్ని చేపడుతోందని కలెక్టర్ తెలిపారు. ఈ రీసర్వేలో భాగంగా గ్రామ సరిహద్దులను నిర్ధారించి, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, అత్యాధునిక సర్వే పరికరాల సహాయంతో వ్యవసాయ భూములను సర్వే చేయనున్నట్లు చెప్పారు. సర్వే పూర్తయిన అనంతరం భూ వివరాలను ప్రజలకు ప్రకటిస్తామని పేర్కొన్నారు. గ్రామస్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పారదర్శకంగా రీ సర్వే ప్రక్రియను నిర్వహించాలని, ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల మేరకు యుద్ధ ప్రాతిపదికన పనులను పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. మొదట గ్రామ బౌండరీ పై లైసెన్సుడ్ సర్వేయర్లు, మండల సర్వేలు కలిసి రీ సర్వే చేస్తారని. తర్వాత ఒక్కొక్క రైతు వారిగా రీ సర్వే నిర్వహిస్తారని తెలిపారు. జగిత్యాల జిల్లాలో మొదటి విడతగా 70 గ్రామాల్లో రీ సర్వే చేపట్టాలని ప్రభుత్వం ఆదేశించిందని తెలిపారు. ప్రస్తుతం ఎంజాయ్మెంట్ రీసర్వే కొనసాగుతుందని పేర్కొన్నారు. నడికుడగ్రామంలో నాన్ కెడస్ట్రాల్ రీ సర్వే చేపడుతున్నామని తెలిపారు. అనంతరం బీర్ పూర్ లోని కేజీబివి పాఠశాల ను అకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలోని విద్యార్థులకు వండుతున్న వంటలను, కిచెన్, స్టోర్ రూమ్ లను పరిశీలించారు. ఈ సందర్భంగా నాణ్యమైన, రుచికరమైన భోజనం విద్యార్థులకు అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. పాఠశాలలో విద్యార్థుల హాజరు శాతం, ఉపాధ్యాయుల భోదన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల మధు సూదన్, తహసీల్దార్, సర్వేయర్, రెవెన్యూ సిబ్బంది, రైతులు మరియు పాల్గొన్నారు.

# ప్రశాంతమైన వాతావరణంలో గణేశుని నిమజ్జనం



- తెలంగాణ రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు చోరవతో ప్రత్యేక ఏర్పాట్లు
- నిమజ్జన ఏర్పాట్లను పర్యవేక్షించిన మున్సిపల్ చైర్మన్ వొడ్నాల శ్రీనివాస్

మంథని, సెప్టెంబర్24(మనం న్యూస్): మంథని పట్టణంలోని గోదావరి నదిలో బుధవారం భారీగా గణనాథుల నిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా జరిగింది. వర్షంకురుస్తున్నప్పటికీ భక్తులు,ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టి నిమజ్జన కార్యక్రమాన్ని సజావుగా నిర్వహించారు. నిమజ్జన ఏర్పాట్లను మున్సిపల్ చైర్మన్ వొడ్నాల శ్రీనివాస్ ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు.ఈ సందర్భంగా చైర్మన్ శ్రీనివాస్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ప్రత్యేక చొరవతో నిమజ్జన కార్యక్రమానికి భారీగా భక్తులు,ప్రజలు తరలివచ్చిన నేపథ్యంలో వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.గణపతి విగ్రహాల నిమజ్జనం కోసం ప్రత్యేకంగా క్రేన్ను ఏర్పాటు చేసి,భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిమజ్జన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు.వర్షం కారణంగా ఎలాంటి ఇబ్బందులు ఏర్పడకుండా ముందస్తు చర్యలు చేపట్టడంతో పాటు, అవసరమైన చోట తక్షణ చర్యలు తీసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు.నిమజ్జనానికి వచ్చిన భక్తులు,ప్రజల కోసం వైద్య సహాయం, త్రాగునీరు,వీధి దీపాలు తదితర సౌకర్యాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.రెవెన్యూ, పోలీస్,మున్సిపల్, ఆరోగ్య శాఖల అధికారులు,సిబ్బంది సమన్వయంతో నిమజ్జన ప్రాంతంలో పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు చేపట్టినట్లు ఆయన వివరించారు.అన్ని శాఖల అధికారులు, మున్సిపల్ సిబ్బంది సమన్వయంతో పనిచేయడంతో వర్షంలో సైతం గణేశుని నిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా,సజావుగా ముగిసిందని తెలిపారు.అలాగే గురువారం కూడా గణపతి నిమజ్జన కార్యక్రమం ప్రశాంతమైన వాతావరణంలో జరిగేలా భక్తులు, ప్రజలు సహకరించాలని చైర్మన్ శ్రీనివాస్ కోరారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎన్.మనోహర్,మున్సిపల్ వైస్ చైర్మన్ ముస్కుల సహేందర్ రెడ్డి,పాలకవర్గ సభ్యులు పెంటరి రాజు,మంథని ఆర్డిఓ కసబోయిన సురేష్,తాసిల్దార్ మహమ్మద్ ఆరీఫొద్దీన్,సర్కిల్ ఇన్స్పెక్టర్ బి. స్వామి,సబ్ ఇన్స్పెక్టర్ ఎన్. సందీప్ కుమార్,గౌతమేశ్వర టెంపుల్ చైర్మన్ గుండారాజు,పలువురు నాయకులు, అధికారులు,మున్సిపల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ఫిరాయింపు పార్టీలను నిమజ్జనం చేయండి

- కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు నైతికతను మంటకలిపింద్రు?
- ఆ పార్టీలకు ఎన్నికల్లో పోటీ చేసే అర్హతే లేదు? : బండి సంజయ్

హైదరాబాద్, మనం ప్రతినిధి : తాజా రాజకీయ పరిణామాలు, ముఖ్యంగా ఫిరాయింపుల రాజకీయాలపై కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ చేసిన వ్యాఖ్యలు తెలంగాణ రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. ఒక పార్టీ గుర్తుపై గెలిచి, మరో పార్టీలోకి ఫిరాయించడం నైతికతకే మచ్చ అని ఆయన మండిపడ్డారు. సుప్రీంకోర్టు తీర్పు వెలువడినప్పటికీ కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల నేతలకు సిగ్గు రాలేదని, ఆయా రామ్, గయా రామ్ సంస్కృతిని ప్రోత్సహిస్తూ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారని ధ్వజమెత్తారు. దానం నాగేందర్ వ్యవహారంలో వాస్తవాలను కప్పిపుచ్చి కొన్ని మీడియా సంస్థలు తీర్పును వక్రీకరిస్తున్నాయని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫిరాయింపుల రాజకీయాలను సమర్థిస్తూ ఎవరికి వారే తమ విజయంగా చెప్పుకోవడం వారి అవకాశవాద రాజకీయాలకు నిదర్శనమని, ఈ తీర్పు ఆ రెండు పార్టీలకు చెంపపెట్టు వంటిదని స్పష్టం చేశారు. ఈ అనైతిక రాజకీయాలకు చరమగీతం పాడాల్సిన సమయం ఆసన్నమైందని బండి సంజయ్ పిలుపునిచ్చారు. ఖైరతాబాద్లో ఉప ఎన్నిక అనివార్యమని, నైతికతను మంటకలిపిన కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు ఆ ఎన్నికల్లో పోటీ చేసే అర్హతే లేదని తేల్చిచెప్పారు. హిందూ బంధువులు, ప్రజలంతా ఏకమై ఫిరాయింపులను ప్రోత్సహిస్తున్న ఈ రెండు పార్టీలను రాజకీయంగా నిమజ్జనం చేయాలని పిలుపునిచ్చారు. భవిష్యత్తులో ఏ రాజకీయ పార్టీ కూడా ఇలాంటి అనైతిక చర్యలకు పాల్పడకుండా ప్రజలే గట్టి గుణపాఠం చెప్పాలని, ఈ ఎన్నికల ద్వారా అలాంటి బలమైన సంకేతాలను పంపాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# బొగ్గు కొరత, జెన్కో నిర్లక్ష్యంపై పువ్వాడ విమర్శలు

- భద్రాద్రి పవర్ ప్లాంట్ను సందర్శించిన బిఆర్ఎస్ బృందం



పినపాక, సెప్టెంబర్ 24(మనం న్యూస్): మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్, మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు నేతృత్వంలోని బీఆర్ఎస్ ప్రతినిధుల బృందం భద్రాద్రి పవర్ ప్లాంట్ క్షేత్రస్థాయి పరిశీలన కార్యక్రమాన్ని గురువారం చేపట్టారు. పవర్ ప్లాంట్ల పనితీరు, ఉత్పత్తి వివరాలు, నిబంధనలకు సంబంధించిన వాస్తవాలను ప్రజలకు, తెలంగాణ సమాజానికి తెలియజేసేందుకు ఈ సందర్శన చేపట్టినట్లు మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ తెలిపారు. గతంలో కేసీఆర్ హయాంలో నిర్మించిన 270 మెగావాట్ల సామర్థ్యం గల 4 యూనిట్లలో ప్రస్తుతం రెండు యూనిట్లు మాత్రమే నడుస్తున్నాయని, మిగిలిన రెండు యూనిట్లలో ఉత్పత్తిని నిలిపివేసి ఉంచారని తెలిపారు. ప్లాంట్ లోపలికి వెళ్లి పరిశీలించేందుకు కూడా అనుమతించకపోవడంపై నేతలు అభ్యంతరం వ్యక్తం చేశారు. థర్మల్ పవర్ ప్లాంట్లకు నాణ్యమైన బొగ్గును అందించాల్సిన ప్రాథమిక బాధ్యత సింగరేణి సంస్థపై ఉన్నప్పటికీ, జెన్కో ప్లాంట్లకు నాణ్యమైన బొగ్గును ఎందుకు సరఫరా చేయడం లేదని సూటిగా ప్రశ్నించారు. గత ఆరు నెలలుగా రాష్ట్రంలో బొగ్గు టెండర్లలో తీవ్ర అక్రమాలు జరుగుతున్నాయని ఆరోపించారు. సింగరేణిలో దాదాపు 40 లక్షల టన్నుల బొగ్గు మిస్సింగ్ అయిందని, లేని నిల్వలను ఉన్నట్లు చూపిస్తూ మాయాజాలం చేస్తున్నారని కేటీఆర్, హరీష్ రావు అనేక సందర్భాల్లో ప్రజల దృష్టికి తీసుకెళ్లారని గుర్తుచేశారు. బొగ్గు కుంభకోణం, విద్యుత్ ఉత్పత్తిపై సింగరేణి యాజమాన్యం గానీ, రాష్ట్ర ప్రభుత్వం గానీ, విద్యుత్ శాఖ మంత్రి భట్టి విక్రమార్క గానీ ఇప్పటివరకు నిజాలను ప్రజలకు వివరించలేదని మండిపడ్డారు. వాస్తవాలను దాచిపెట్టకుండా రాష్ట్ర ప్రజలందరికీ విద్యుత్ రంగంలో జరుగుతున్న పరిణామాలపై స్పష్టత ఇవ్వాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. తెలంగాణలోని థర్మల్ పవర్ ప్లాంట్లకు నాణ్యమైన బొగ్గు సరఫరా కావాలంటే సింగరేణి సంస్థకు చెల్లించాల్సిన బాకీలను ప్రభుత్వం తక్షణమే చెల్లించాలి. చెల్లింపులు చేయకపోవడం, నిర్వహణా లోపాల వల్ల విద్యుత్ ఉత్పాదన దెబ్బతింటోంది. సింగరేణిలో ప్రతిరోజూ ఒక స్కామ్, కోల్ కుంభకోణాలు జరుగుతున్నాయన్నారు. కేసీఆర్ హయాంలో రాష్ట్ర విద్యుత్ సామర్థ్యాన్ని 19,000 మెగావాట్లకు పెంచి, యాదాద్రి, భద్రాద్రి థర్మల్ పవర్ ప్లాంట్లను అద్భుతంగా నిర్మించి 'వడ్డించిన విస్తరి'లా కాంగ్రెస్కు అప్పగిస్తే, వారు మూడేళ్లలోనే విద్యుత్ వ్యవస్థను ఛిన్నాభిన్నం చేశారు. హైడల్ పవర్ ప్లాంట్లలో నీళ్లు లేక విద్యుత్ ఉత్పత్తి నిలిచిపోయింది. థర్మల్ ప్లాంట్లకు బొగ్గు సరఫరా సరిగ్గా లేక విద్యుత్ కొరత ఏర్పడుతోందని సింగరేణి సంస్థకు రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సిన బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. గతంలో కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రంలో రైతులకు, గృహ వినియోగదారులకు, పారిశ్రామిక అవసరాలకు 24 గంటల ఉచిత మరియు నాణ్యమైన విద్యుత్ను అందిస్తే, నేడు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మళ్లీ పాతరోజుల కరెంట్ కోతలు, విద్యుత్ కష్టాలు మొదలయ్యాయని అన్నారు. రైతాంగానికి కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం 8 గంటల కరెంట్ మాత్రమే అదీ విడతల వారీగా ఇస్తోందని ఎనిమిది గంటల పాటు అందరూ ఒకేసారి సబ్స్టేషన్లు/ట్రాన్స్ఫార్మర్లపై ఆధారపడి మోటార్లు ఆన్ చేయడం వల్ల పేలిపోతున్నాయి, లో-వోల్టేజీతో మోటార్లు కాలిపోతున్నాయి. కాలిపోయిన ట్రాన్స్ఫార్మర్లను మార్చుకోవడానికి రైతులు మళ్లీ తమ సొంత డబ్బులు వేసుకోవాల్సిన దుస్థితి దాపురించిందని దుయ్యబట్టారు. ఈ కార్యక్రమంలో పలువురు బిఆర్ ఎస్ నేతలు పాల్గొన్నారు.

# తీవ్ర సంక్షోభంలో రైతాంగం

## కేటీపీఎస్ను సందర్శించి ఎంపీ వద్దిరాజు బృందం



పాల్వంచ, సెప్టెంబర్ 24(మనం న్యూస్): చేతగాని దద్దమ్మ ప్రభుత్వంలో వ్యవసాయ రంగంలో తీవ్ర సంక్షోభం ఎదుర్కొంటున్నదని, రైతాంగం నిర్వేదంతో,బాధల్లో ఉన్నారని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ లీడర్ వద్దిరాజు రవిచంద్ర ఆవేదన వ్యక్తంచేశారు. వ్యవసాయానికి సాగునీళ్లు, విత్తనాలు, కరెంట్, యూరియా సక్రమంగా సరఫరా చేయకుండా ఉద్దేశపూర్వకంగా, కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నారని కాంగ్రెస్ పాలకులపై ఆయన మండిపడ్డారు. బీఆర్ఎస్ అధ్యక్షులు కల్వకుంట్ల చంద్రశేఖర రావు, కార్యనిర్వాహక అధ్యక్షులు కే.టీ.రామారావుల పిలుపు మేరకు ఎంపీ రవిచంద్ర ఆధ్వర్యాన గులాబీ శ్రేణులు గురువారం పాల్వంచలోని కేటీపీఎస్ సందర్శనకు వెళ్లారు. థర్మల్ పవర్ స్టేషన్ లో బొగ్గు నిల్వలు, విద్యుదుత్పత్తికి సంబంధించి వాస్తవ పరిస్థితిని తెలుసుకునేందుకు ఎంపీ రవిచంద్ర, మాజీ మంత్రి వెంకటేశ్వర రావు, మాజీ ఎమ్మెల్యే నాగేశ్వరరావు, పార్టీ శ్రేణులు, రైతులు వెడుతుండగా పెద్ద సంఖ్యలో మోహరించిన పోలీసులు బ్యారికేడ్స్ అడ్డుపెట్టి నిలువరించారు. ఈ సందర్భంగా పోలీసులు, బీఆర్ఎస్ నాయకుల మధ్య తీవ్ర వాగ్వివాదం, తోపులాట చోటు చేసుకోగా పలువురు స్వల్పంగా గాయపడ్డారు.ఆ తర్వాత ఎంపీ వద్దిరాజు నేతృత్వంలో ప్రతినిధి బృందం కేటీపీఎస్ లోపలికి వెళ్లి బొగ్గు నిల్వల్ని, విద్యుదుత్పత్తిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీ రవిచంద్ర విలేకరులతో మాట్లాడుతూ, వ్యవసాయ రంగాన్ని కాంగ్రెస్ సర్కార్ నిర్వీర్యం చేస్తున్న తీరును దుయ్యబట్టారు. సాగునీళ్లు, కరెంట్ సక్రమంగా సరఫరా చేస్తే పంటలు పండుతాయని, వాటిని కొనుగోలు చేసి రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేయాల్సి వస్తుందని..వాటిని నెరవేర్చడం చేతగాకే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యవసాయ రంగాన్ని, రైతన్నల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించారన్నారు. కేసీఆర్ సుదీర్ఘ పోరాటం చేసి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించడమే కాక బంగారుమయంగా తీర్చిదిద్దారని, తీవ్ర నష్టాలలో సింగరేణి సంస్థను లాభాల బాట పట్టించారని ఎంపీ రవిచంద్ర కొనియాడారు. థర్మల్ పవర్ స్టేషన్లు సింగరేణి సంస్థకు సుమారు 55వేల కోట్ల రూపాయలు బకాయి పడ్డాయని, నాణ్యమైన 9,10 జీ బొగ్గు సరఫరా లేక, మిషనరీ కూడా పాతబడిపోవడంతో విద్యుదుత్పత్తి నిలిచిపోయిందని అధికారులు చెప్పారన్నారు. నాణ్యమైన బొగ్గును ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, మహారాష్ట్ర లకు సరఫరా చేస్తూ విద్యుత్ శాఖ చూస్తున్న ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఇక్కడి కేటీపీఎస్, బీటీపీఎస్ లను ఏ మాత్రం కూడా పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. పవర్ స్టేషన్ లో సరిపడు బొగ్గు నిల్వలు లేవని,ఉన్నవి కూడా నాణ్యత లేని 13,14 జీ రకానివి అని, 9,10 జీ రకం ల్యాబ్ లో ఉన్నట్లు అధికారులు తనతో అనడం శోచనీయమని ఎంపీ వద్దిరాజు పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రం సిద్ధిస్తే కరెంట్ ఉండదని, తీగలపై బట్టలు ఆరేసుకోవాల్సిన దుస్థితి నెలకొంటుందని కొందరు నాయకులు అవహేళన చేశారన్నారు. కేసీఆర్ ముందుచూపు, పక్కా ప్రణాళికతో విద్యుదుత్పత్తి 7వేల నుంచి 20 వేల మెగావాట్లకు పెంచి చూపి విమర్శకుల నోళ్లు మూయించారని ఎంపీ రవిచంద్ర వివరించారు. కేసీఆర్ పాలనలో సాగునీళ్లు, విద్యుత్, విత్తనాలు, యూరియా, రైతుబంధు ద్వారా పెట్టుబడి అందడంతో,పంటలు సమృద్ధిగా పండడం, ధాన్యం కొనుగోళ్లు సక్రమంగా జరగడంతో రైతన్నలు, ప్రజలు సంతోషంగా జీవించారన్నారు. ఈ కాంగ్రెస్ పాలనలో అందుకు భిన్నమైన పరిస్థితులు నెలకొన్నాయని రైతులతో పాటు అన్ని వర్గాల ప్రజలు బాధపడుతున్నారని, కేసీఆర్ తిరిగి ముఖ్యమంత్రి అయితేనే తమ కష్టాలన్నీ తీరుతాయని ఎదురు చూస్తున్నారని ఎంపీ వద్దిరాజు స్పష్టం చేశారు. అంతకుముందు ఎంపీ రవిచంద్ర తదితర ప్రముఖులు భారతరత్న డాక్టర్ బీ.ఆర్.అంబేద్కర్, దివంగత మాజీ ఉప ప్రధాని జగ్జీవన్ రాం విగ్రహాలకు పూలదండలు వేసి ఘనంగా నివాళులర్పించారు. వద్దిరాజు నేతృత్వంలో వనమా ఆధ్వర్యాన వందలాది మంది బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, రైతులు కేటీపీఎస్ వద్దకు తరలివచ్చి పంటలు ఎండిపోకుండా నాణ్యమైన కరెంట్ సరఫరా చేయాలంటూ పెద్ద పెట్టున నినాదాలిచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు దిండిగల రాజేందర్, కాపు సీతామహాలక్ష్మి, వేల్పుల దామోదర్, గోవాడ గుణచరిత్, బత్తుల మధుచంద్, సింధూతపస్వి, మల్లెల రవిచంద్ర, రాజు గౌడ్, లావుడ్య సత్యానారాయణ, చింతలపూడి జగన్, బండారు రుక్మేందర్, అనుదీప్, నవతన్, భూపతి శ్రీనివాసరావు, అన్వర్, సంగు రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులను త్వరితగతిన పరిష్కరించాలి

- బాధితులకు పరిహారం సకాలంలో అందేలా చర్యలు చేపట్టాలి
- రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకయ్య



సంగారెడ్డి, సెప్టెంబర్ 24 మనం న్యూస్ ప్రతినిధి : జిల్లాలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులను త్వరితగతిన పరిష్కరించి, బాధితులకు ప్రభుత్వం అందించే పరిహారం సకాలంలో అందేలా చర్యలు చేపట్టాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకయ్య జిల్లా యంత్రాంగానికి సూచించారు. ఎస్సీ, ఎస్టీలకు న్యాయం జరిగేలా రెవెన్యూ, పోలీసు అధికారులు సమన్వయంతో పనిచేయాలని అన్నారు.గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్తో కలిసి పోలీసు, రెవెన్యూ, ఎస్సీ, ఎస్టీ అభివృద్ధి సంక్షేమ శాఖలతో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులతో రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సీ, ఎస్టీలకు సంబంధించిన భూ సమస్యలు, అట్రాసిటీ కేసులు, రోస్టర్ పాయింట్ల అమలు, బ్యాక్లాగ్ ఖాళీలు, ఎస్సీ, ఎస్టీ సబ్ప్లాన్ నిధులు, సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల అమలు తదితర అంశాలపై శాఖల వారీగా సమీక్షించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ, ఎస్సీ, ఎస్టీలు, ఇతర అణగారిన వర్గాల ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. అట్రాసిటీ కేసుల్లో బాధితులకు త్వరితగతిన పరిహారం అందేలా చర్యలు చేపట్టాలని, అవసరమైన నిధుల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలని అన్నారు. ఎస్సీ, ఎస్టీలకు సంబంధించిన కేసుల పరిష్కారంపై కలెక్టర్, ఎస్పీలు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ట్రాసిటీ కేసుల దర్యాప్తు, విచారణలో ఎలాంటి జాప్యం లేకుండా చర్యలు చేపట్టాలని చైర్మన్ సూచించారు. సిద్దిపేటలో మొబైల్ కోర్టు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ సత్యనారాయణకు సూచించారు. ఔట్సోర్సింగ్ ఏజెన్సీలలో ఎస్సీ, ఎస్టీ వర్గాలకు వారి కోటా మేరకు ప్రాధాన్యత కల్పించాలని అన్నారు. ఎస్సీ, ఎస్టీల హక్కులు, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై వారికి విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. సివిల్ రైట్స్ డే కార్యక్రమాలకు అధికారులు, ప్రజలు హాజరయ్యేలా చర్యలు చేపట్టాలని అన్నారు. ఎస్సీ, ఎస్టీ సబ్ప్లాన్ నిధులను ఆయా వర్గాల సంక్షేమం, అభివృద్ధి కోసం మాత్రమే వినియోగించా లని, ఇతర అవసరాలకు మళ్లించరాదని చైర్మన్ స్పష్టం చేశారు. ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులకు అందాల్సిన సంక్షేమ పథకాల అమలులో అధికారులు జాప్యం లేదా నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని అన్నారు. జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ రెసిడెన్షియల్ పాఠశాలలు, వసతి గృహాల్లో విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు, యూనిఫామ్స్, పుస్తకాలు, మౌలిక వసతులు, స్కాలర్షిప్లు, వసతి గృహాల మరమ్మతులపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎస్సీ, ఎస్టీ రైతులకు అందుతున్న రైతు భరోసా, రైతు బీమా, పారిశుద్ధ్య కార్మికులకు కల్పిస్తున్న సదుపాయాలపై ఆరా తీశారు. అన్ని శాఖల్లో పనిచేస్తున్న ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులు, ఔట్సోర్సింగ్ ఉద్యోగులు, బ్యాక్లాగ్ ఖాళీల వివరాలను శాఖల వారీగా అడిగి తెలుసుకున్న చైర్మన్, బ్యాక్లాగ్ ఖాళీలను త్వరితగతిన భర్తీ చేసేలా చర్యలు చేపట్టాలని అధికారులను సూచించారు. ఎస్సీ, ఎస్టీలకు సంబంధించిన భూ సమస్యలను పరిశీలించి, బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ను కోరారు. జిల్లాలో శాశ్వత అంగన్వాడీ భవనాలు లేని కేంద్రాలకు స్థలాలను గుర్తించి, భవనాల నిర్మాణానికి అవసరమైన ప్రతిపాదనలు పంపాలని జిల్లా సంక్షేమ అధికారికి సూచించారు. జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ మాట్లాడుతూ, భూ సేకరణలో అసైన్డ్ భూములు కోల్పోయిన ఎస్సీ, ఎస్టీలకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. జిల్లా పరిధిలో పరిష్కరించగలిగిన సమస్యలను సత్వరం పరిష్కరిస్తామని, కమిషన్ చైర్మన్ సూచనలు, సలహాలను అమలు చేస్తామని తెలిపారు. జిల్లాలో అట్రాసిటీ కేసుల్లో 109 మంది బాధితులకు జనవరి 2026 నుంచి ఆగస్టు 31 వరకు రూ.1.70 కోట్ల పరిహారం అందించామని తెలిపారు. వీరిలో 88 మంది ఎస్సీలు, 21 మంది ఎస్టీలు ఉన్నారని వివరించారు. మరో 119 పెండింగ్ అట్రాసిటీ కేసులకు సంబంధించి పరిహారం చెల్లించేందుకు అవసరమైన రూ.1.82 కోట్ల నిధుల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ మాట్లాడుతూ, జిల్లాలో ఈ ఏడాది ఇప్పటివరకు నమోదైన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల వివరాలను కమిషన్ చైర్మన్కు వివరించారు. కేసుల దర్యాప్తును వేగవంతం చేసి, నిర్ణీత సమయంలోపు చార్జిషీట్లు దాఖలు చేస్తున్నట్లు తెలిపారు.ఆ అనంతరం ఎస్సీ, ఎస్టీల నుంచి వివిధ సమస్యలపై రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకయ్య వినతులను స్వీకరించారు. ఈ సమీక్ష సమావేశంలో అదనపు కలెక్టర్లు సంగీత, పాండు, ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులు జిల్లా శంకర్,రాంబాబు నాయక్, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి అఖిలేష్ రెడ్డి, గిరిజన సంక్షేమ శాఖ అధికారి రామేశ్వరి దేవి, జిల్లా అధికారులు, ఆర్డీఓలు, మున్సిపల్ కమిషనర్లు, దళిత సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఉచిత కంటి పరీక్షలు విజయవంతం



హైదరాబాద్, సెప్టెంబర్ 24(మనంన్యూస్): బొప్పన శరత్ గోపాల్ ఫౌండేషన్, విజ్ఞాన జ్యోతి ఆధ్వర్యంలో ఆరోగ్య సంరక్షణ భాగస్వాముల సహకారంతో వీఎన్ఆర్ వీజేఐఈటీ ప్రాంగణంలో ఉచిత కంటి పరీక్షలు, రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ నాలుగు రోజుల కార్యక్రమంలో వీఎన్ఆర్ వీజేఐఈటీ కు చెందిన విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది సహా 4,000 మందికి పైగా పాల్గొని, నివారణాత్మక ఆరోగ్య సంరక్షణ, స్వచ్ఛంద రక్తదానం, సామాజిక బాధ్యతపై అవగాహన పెంచుకున్నారు. స్వచ్ఛంద రక్తదానాన్ని ప్రోత్సహించడం, కంటి ఆరోగ్యంపై అవగాహన కల్పించడం, క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకునేలా యువతను ప్రోత్సహించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశం. సామాజిక బాధ్యతతో కూడిన కార్యక్రమాల్లో యువత మరింత చురుగ్గా పాల్గొనేలా ప్రోత్సహించడంపైనా నిర్వాహకులు దృష్టి సారించారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ తెలుగు నటుడు అల్లరి నరేష్ హాజరై విద్యార్థులను రక్తదానానికి ప్రోత్సహించారు. సెప్టెంబర్ 24న నిర్వహించిన రక్తదాన శిబిరంలో 700 మందికి పైగా విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొని 742 యూనిట్ల రక్తాన్ని దానం చేశారు. యువతలో రక్తదానంపై అవగాహన పెంచడంతో పాటు, అవసరమైన వారికి రక్తం అందుబాటులో ఉండేలా చేయడంలో స్వచ్ఛంద రక్తదానం ప్రాధాన్యతను ఈ కార్యక్రమం చాటిచెప్పింది. మరోవైపు, సెప్టెంబర్ 21 నుంచి 24 వరకు నిర్వహించిన ఉచిత కంటి పరీక్షల శిబిరంలో 3,500 మంది విద్యార్థులు, 500 మంది అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు. డిజిటల్ పరికరాల వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో యువతలో కంటి ఆరోగ్యంపై అవగాహన పెంచడం, కంటి సమస్యలను తొలిదశలోనే గుర్తించి తగిన వైద్య సలహా తీసుకునేలా ప్రోత్సహించడం ఈ శిబిరం లక్ష్యంగా సాగింది. ఈ సందర్భంగా బొప్పన శరత్ గోపాల్ ఫౌండేషన్ డైరెక్టర్ శ్రీ బొప్పన తారాచంద్ మాట్లాడుతూ, రక్తదానం ద్వారా ఒకరి జీవితాన్ని కాపాడేందుకు మన వంతు సహకారం అందించవచ్చు. వీఎన్ఆర్ వీజేఐఈటీ విద్యార్థులు పెద్ద సంఖ్యలో ముందుకు వచ్చి రక్తదానం చేయడం ఎంతో సంతోషకరం. ఒకే రోజులో 742 యూనిట్ల రక్తాన్ని సేకరించడం వారి సామాజిక బాధ్యత, సమాజం పట్ల ఉన్న నిబద్ధతకు నిదర్శనం, అని అన్నారు. వీఎన్ఆర్ వీజేఐఈటీ ప్రిన్సిపాల్ డా. బి. చెన్నకేశవ రావు మాట్లాడుతూ, విద్య అనేది కేవలం తరగతి గదులకే పరిమితం కాకూడదనివీఎన్ఆర్ వీజేఐఈటీ విశ్వసిస్తుంది. విద్యార్థుల్లో బాధ్యత, మానవతా విలువలు, సమాజం పట్ల చైతన్యాన్ని పెంపొందించడం కూడా విద్యలో భాగమే. ఉచిత కంటి పరీక్షలు, రక్తదాన కార్యక్రమాల్లో మా విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొనడం ఈ విలువలకు ప్రతిబింబం, అని అన్నారు.

## గచ్చిబౌలి ఎంఎసీ హౌసింగ్ సొసైటీ డైరెక్టర్గా ఎన్నికైన కట్కూరి శ్రీకాంత్కు ఘన సన్మానం



హైదరాబాద్, సెప్టెంబర్ 24(మనంన్యూస్): గచ్చిబౌలిటీ.ఎన్.జి.ఒ.ల పరస్పర సహకార గృహ నిర్మాణ సంఘం డైరెక్టర్గా ఎన్నికైన కట్కూరి శ్రీకాంత్ ని హైదరాబాద్ అబిడ్స్లోని భీమా భవన్, తిలక్ రోడ్లో వివిధ శాఖల ఉద్యోగులు ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో చెల్లింపులు మరియు ఖాతాల కార్యాలయ విభాగం అధ్యక్షుడు సంతోష్, సెక్రటరీ బాల నర్సింగ్ రావు, కోశాధికారిఆదిత్య, దేవదాయ శాఖ అధ్యక్షుడు బాబు, శంకర్, సందీప్, రాష్ట్ర ఆడిట్ శాఖ కు చెందిన మహేష్, ఆనంద్, ఎన్నిసి విభాగంకు చెందిన దర్శ, రాజేష్ తదితరులు పాల్గొని కట్కూరి శ్రీకాంత్కు అభినందనలు తెలిపారు. అలాగే టీఎన్జీఓ ల సంఘం హైదరాబాద్ నగర శాఖానాయకులు అమరేందర్, వరలక్ష్మి, ప్రభాకర్ రెడ్డి, అర్జున రాజు, విజయ లక్ష్మి తదితరులు పాల్గొని శుభాకాంక్షలు తెలియజేశారు. ఎక్సైజ్ శాఖ నుంచి మహేందర్ రావు పటేల్,పీఏఓ నుంచి అశోక్, సైదులు, సులోచన, రూప, అలాగే జేఆర్ పవర్ ,కృష్ణ, శివ, క్రాంతి కుమార్, శ్రీకాంత్, రమేష్, గౌరీ శంకర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీ కట్కూరి శ్రీకాంత్ మాట్లాడుతూ, తనపై విశ్వాసం ఉంచి డైరెక్టర్గా ఎన్నుకున్న గచ్చిబౌలి టీఎన్జీవోస్ ఎంఎసీ గృహ నిర్మాణ సంఘం సభ్యులందరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. సొసైటీ అభివృద్ధి, సభ్యుల సంక్షేమం, వారి హక్కుల పరిరక్షణ కోసం నిబద్ధతతో పనిచేస్తానని, సభ్యుల సమస్యలను సంబంధిత వర్గాల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన తెలిపారు. తన ఎన్నిక సందర్భంగా వివిధ శాఖల ఉద్యోగులు నిర్వహించిన సన్మాన కార్యక్రమానికి, అందించిన అభినందనలు మరియు ఆశీస్సులకు కట్కూరి శ్రీకాంత్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# గుంతల రోడ్డుపై నిత్యం నరకయాతన

### రాజరాజేశ్వరి కాలనీ వాసుల అవస్థలు

### బురద, నీటి గుంతలతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు

### తక్షణమే రోడ్డు నిర్మించాలని స్థానికుల విజ్ఞప్తి



కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 24(మనంన్యూస్): గండి మైసమ్మ ఎక్స్రోడ్డు సమీపంలోని దొమ్మర పోచంపల్లి పరిధి రాజరాజేశ్వరి కాలనీలో రహదారి అధ్వాన్నంగా మారింది. ఉజ్వల గ్రాండ్ హోటల్ వెనుక వైపు ఉన్న ఈ రోడ్డంతా గుంతలు, బురద, నిలిచిన వర్షపు నీటితో నిండిపోవడంతో కాలనీవాసులు నిత్యం నరకయాతన అనుభవిస్తున్నారు. చిన్నపాటి వర్షానికే రహదారి మొత్తం చిత్తడిగా మారుతోంది. గుంతల్లో నీరు నిలిచి వాటి లోతు కనిపించకపోవడంతో ద్విచక్ర వాహనదారులు అదుపుతప్పి పడిపోయే ప్రమాదం నెలకొంది. పాదచారులు, చిన్నారులు, వృద్ధులు ఈ మార్గంలో నడవాలంటే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్సు, ఇతర వాహనాలు కాలనీలోకి రావడం కూడా కష్టంగా మారిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చుట్టుపక్కల భారీ భవనాలు, వ్యాపార సముదాయాలు వెలుస్తున్నప్పటికీ కాలనీకి కనీస రహదారి సౌకర్యం లేకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని ప్రజలు విమర్శిస్తున్నారు. రోడ్డుపై నీరు నిల్వ ఉండకుండా ముందుగా డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేసి, అనంతరం నాణ్యమైన సీసీ లేదా బీటీ రోడ్డు నిర్మించాలని కోరుతున్నారు. జీహెచ్ఎంసీ అధికారులు వెంటనే ఈ ప్రాంతాన్ని పరిశీలించాలని, మాజీ కార్పొరేటర్లు, ప్రజా ప్రతినిధులు, రాజకీయ నాయకులు స్పందించి శాశ్వత పరిష్కారం చూపాలని కాలనీవాసులు విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రమాదం జరిగాక స్పందించడం కాకుండా ముందుగానే చర్యలు తీసుకొని రహదారి నిర్మాణ పనులు ప్రారంభించాలని డిమాండ్ చేస్తున్నారు.

# భక్తి బాటలో మెట్టు కుమార్ యాదవ్

- ఓవైపు ఆధ్యాత్మికం.. మరోవైపు సోదర భావం
- గణేష్ మండపాల్లో పూజలు..గ్యార్వీలో ప్రార్థనలు





పటాన్చెరు, సెప్టెంబర్ 24 (మనం న్యూస్): పటాన్చెరు డివిజన్ పరిధిలో నిర్వహించిన వివిధ ఆధ్యాత్మిక, ధార్మిక కార్యక్రమాల్లో మాజీ కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ పాల్గొన్నారు. ఒకవైపు వినాయక మండపాలను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించడంతో పాటు భక్తులకు అన్నప్రసాదం వడ్డించిన ఆయన.. మరోవైపు బండ్లగూడ కాలనీలో నిర్వహించిన గ్యార్వీ కార్యక్రమంలో పాల్గొని దర్గాలో చాదర్ సమర్పించారు. భిన్న ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొంటూ అన్ని వర్గాల ప్రజలతో మమేకమయ్యారు. పటాన్చెరు డివిజన్ పరిధిలోని శాంతినగర్ 40 ఫీట్ల రోడ్డులో మిత్ర రవి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో మెట్టు కుమార్ యాదవ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. వినాయకుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు. అనంతరం గౌతమ్నగర్ కాలనీలో కార్ రాజు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపాన్ని సందర్శించి పూజలు నిర్వహించారు. అక్కడ నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొని భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు. వినాయక చవితి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, సోదరభావంతో నిర్వహించడం అభినందనీయమని మెట్టు కుమార్ అన్నారు.

**బండలగూడలో గ్యార్వీ ఉత్సవాలు..**

గౌస్ ఏ పాక్ ఛిల్లా వద్ద చాదర్ సమర్పణ జెపి కాలనీ డివిజన్ పరిధిలోని బండలగూడలో అఫ్జల్ ఆధ్వర్యంలో నిర్వహించిన గ్యార్వీ కార్యక్రమంలో మెట్టు కుమార్ యాదవ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా గౌస్ ఏ పాక్ ఛిల్లా (దర్గా)ను దర్శించుకుని చాదర్ సమర్పించారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రార్థించారు. ఈ సందర్భంగా మెట్టు కుమార్ యాదవ్ వివిధ ఆధ్యాత్మిక, ధార్మిక కార్యక్రమాల్లో పాల్గొంటూ ప్రజలతో మమేకమయ్యారు. వినాయక మండపాల వద్ద భక్తి కార్యక్రమాల్లో పాల్గొనడంతో పాటు దర్గాలో ప్రార్థనలు చేయడం ద్వారా ఆధ్యాత్మికత, పరస్పర గౌరవానికి ప్రాధాన్యతనిచ్చారు. ఈ కార్యక్రమాల్లో ఆల్విన్ కాలనీ ప్రెసిడెంట్ సత్యనారాయణ, శాంతినగర్ కాలనీ ప్రెసిడెంట్ అంజిరెడ్డి, కుంచల రమేష్, ఎక్స్- 86 సభ్యులు అబ్దుల్ ఖదీర్, రవీందర్ చారి, నరసింహా, స్థానిక నాయకులు, ఉత్సవ కమిటీ నిర్వాహకులు, యువకులు, భక్తులు, కాలనీ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# అక్టోబర్ 1 నుండి ధాన్యం కొనుగోలు

- ఏర్పాట్లకు సిద్ధమవుతున్న యంత్రాంగం
- కొనుగోలు కేంద్రాల్లో అన్ని వసతులు చేపట్టాలని సూచన
- సన్న రకం వడ్ల కొనుగోలు కోసం ప్రత్యేక కేంద్రాల ఏర్పాటు
- అదనపు కలెక్టర్ లక్ష్మి కిరణ్



సిద్దిపేట అక్టోబర్ 24 (మనం ప్రతినిధి): వానకాలం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు జిల్లా యంత్రాంగం కసరత్తు ప్రారంభించింది. ఈసారి కూడా జిల్లా వ్యాప్తంగా అధిక విస్తీర్ణంలో వరిసాగు కావడంతో అందుకు అనుగుణంగా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయ వలసిన అవసరం ఏర్పడింది. అక్టోబర్ 1వ తేదీ నుండి జిల్లాలో కొనుగోలు కేంద్రాల ప్రారంభానికి ఏర్పాట్లు చేపడుతుండగా ఇందుకు అవసరమైనమైన వసతులను కొనుగోలు కేంద్రాల్లో ఏర్పాటు చేయడానికి జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మీ కిరణ్ అధికారులకు గురువారం సూచనలు చేశారు. కొనుగోలు కేంద్రాల్లో ఎలాంటి వసతుల కొరత ఉండకుండా జాగ్రత్త పడాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ముఖ్యంగా భారీ గన్నీ బ్యాగులు అందుబాటులో ఉంచాలని సూచనలు చేశారు. ప్రతి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో టార్పాలిన్లు తేమ కొలిచే యంత్రాలు, వేయింగ్ స్కేల్, డ్రైయర్లు, ప్యాడీ క్లీనర్ లు అందుబాటు ఉంచాలన్నారు. రైతులకు తాగునీరు, నీడ షెడ్డు కూర్చునేందుకు సౌకర్యం ఏర్పాటు చేయాలని కొనుగోలు ప్రక్రియ పారదర్శకంగా జరగాలని సూచనలుచేశారు.

**సన్నాలకు ప్రత్యేక కొనుగోలు కేంద్రాలు**

సన్న రకం వడ్ల కొనుగోలుకు ప్రత్యేక కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని అధికారులకు అదనపు కలెక్టర్ సూచించారు. మండలాల వారీగా కొనుగోలు కు సిద్ధం చేసి గ్రామాల వారీగా వరి కొనుగోలు, దిగుబడుల అంచనా వివరాలను సేకరించాలని తేమ నాణ్యత ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని సూచించారు. లోతట్టు ప్రాంతాల్లో కాకుండా వర్షం వచ్చినా కొనుగోలు సక్రమంగా కొనసాగేందుకు వీలుగా ఉన్న ప్రదేశాలను ఎంపిక చేసి కొనుగోలులను చేపట్టాలన్నారు.

**ధాన్యం తరలింపు, నిల్వకు ముందు జాగ్రత్తలు తీసుకోవాలి**

జిల్లాలో ఎంత మేరకు ధాన్యం వస్తుంది, గిడ్డంగులను ఎంత కెపాసిటీతో ఏర్పాటు చేసుకోవాల్సిన ప్రక్రియను ముందుగా అంచనా వేసి అందుకు అనుగుణంగా గిడ్డంగులను సిద్ధం చేసుకోవాలని అదనపుకలెక్టర్ లక్ష్మీ కిరణ్ అధికారులకు సూచించారు. ఎస్ డబ్ల్యు సి, ఎఫ్సిఐ ఇతర ప్రభుత్వ అందుబాటులో ఉన్న గిడ్డంగులను ముందస్తుగా గుర్తించి నిల్వ సౌకర్యాలను అవసరమేరకు ఏర్పాటు చేసుకోవాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం నిల్వ ఉండకుండా ఎప్పటికప్పుడు గిడ్డంగులకు తరలించడానికి అవసరమైన ట్రాన్స్పోర్టు ఏర్పాట్లను, ఖాళీ బస్తాలను ఆయా సెంటర్లలో ఎల్లప్పుడు సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో సంబంధిత వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజల్లో కౌంట్డౌన్ ప్రారంభమైంది

- 34 నెలల్లో వేములవాడకు ఏం చేశారు?: ప్రభుత్వ విప్ ఆదికి చల్మెడ ప్రశ్నాస్త్రాలు
- రైతుల ఇబ్బందులు వదిలేసి విహారయాత్రలా?
- బీఆర్ఎస్ నేత చల్మెడ ధ్వజం



వేములవాడ,సెప్టెంబర్ 24 (మనం న్యూస్): కాంగ్రెస్ ప్రభుత్వానికి, స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్కు ప్రజల్లో కౌంట్డౌన్ ప్రారంభమైందని బీఆర్ఎస్ వేములవాడ నియోజకవర్గ ఇన్చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. గురువారం వేములవాడలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో రైతులు సాగునీరు, విద్యుత్, యూరియా కొరతతో తీవ్ర ఇబ్బందులు పడుతుంటే, కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు పరిష్కారాన్ని గాలికి వదిలేసి వాహనాల్లో విహారయాత్రలు చేస్తున్నారని మండిపడ్డారు. మల్కపేట రిజర్వాయర్లో ఒక్క టీఎంసీ నీటిని మాత్రమే నింపారని, మధ్యమానేరులో 24 టీఎంసీల నీరున్నా రైతులపై ప్రేమ ఉంటే ఎత్తిపోతల ద్వారా చెరువులను ఎందుకు నింపడం లేదని ప్రశ్నించారు. రాజన్న సిరిసిల్ల జిల్లాను ఒక్క యూనిట్గా చేసి యూరియా పంపిణీ చేస్తుండటంతో కత్తిపూజల్లి రైతు ఒక బస్తా కోసం గంభీరావుపేట, వీర్నపల్లి, ముస్తాబాద్ తిరిగి అవస్థలు పడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. మండలాన్ని యూనిట్గా తీసుకోకుండా జిల్లాను యూనిట్ చేయడం కాంగ్రెస్ దౌర్భాగ్య పాలనకు నిదర్శనమన్నారు. గడిచిన యాసంగిలో ధాన్యం కొనుగోలు సరిగ్గా చేయక రైతులను అరిగోస పెట్టారని విమర్శించారు. ఎమ్మెల్యే సొంత ఊరైన రుద్రంగిలో 30 పడకల ఆసుపత్రి నిర్మాణం, పోలీస్ స్టేషన్ భవన నిర్మాణం ఇప్పటికీ అసంపూర్తిగానే ఉన్నాయని, ముందు తన ఊరి సంగతి చూసుకోవాలని ఆది శ్రీనివాస్కు హితవు పలికారు. వేములవాడ రాజన్న ఆలయ అభివృద్ధి పేరుతో తిరిగిన విహారయాత్రలకు రూ.30 లక్షల స్వామివారి సొమ్ము దుర్వినియోగం చేశారని ఆరోపించారు. కేసీఆర్, కేటీఆర్ లేదని, రాజన్న సిరిసిల్ల అభివృద్ధికి కేటీఆర్ తెచ్చిన మెడికల్ కాలేజీ, జేఎన్టీయూ, అపెరల్ పార్క్ కళ్లకు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. 'సిరిసిల్ల కేటీఆర్ అడ్డా.. రాబోయే ఎన్నికల్లో కేటీఆర్ లక్ష మెజారిటీతో గెలవడం ఖాయం' అని అన్నారు. రాబోయే రోజుల్లో తెలంగాణ గడ్డపై మళ్లీ గులాబీ జెండా ఎగరడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

- ప్రజాస్వామ్యాన్ని కాపాడాల్సిన వారే ఇలా వ్యవహరిస్తారా? : కేటీఆర్
- తొలి వికెట్ పడింది
- త్వరలో మరిన్ని వికెట్లు పడతయ్?
- దానం అనర్హతపై కేటీఆర్ ట్వీట్

# ఎన్నికల సంఘం నిరంకుశంగా మారుతున్నది?

హైదరాబాద్, మనం ప్రతినిధి : ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్యంగా చెప్పుకునే భారతలో ప్రజాస్వామ్యాన్ని కాపాడాల్సిన ఎన్నికల సంఘం తీరు దారుణ నియంతృత్వ ధోరణితో వెళ్తున్నదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆందోళన వ్యక్తం చేశారు. ముగ్గురు ఎన్నికల కమిషనర్లలో ఇద్దరు పదవికి అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నపుడు, ఎన్నికల సంఘం పనితీరును సరిదిద్దాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. ముగ్గురిలో ఇద్దరు ఒక నిర్ణయానికి వ్యతిరేకంగా ఉన్నప్పుడు అది మెజారిటీ కాదా? ఇప్పటివరకు మెజారిటీ అంటే ఇదే కదా?, ఇప్పుడు దాని నిర్వచనం కూడా మారుతున్నట్లుందని ఆయన పేర్కొన్నారు. ఒక్కర సమీద్దు, తెలిగొంపు, తొలగించిన ఓట్లను తిరిగి చేర్చడం వంటి అంశాల్లో సందేహాలు తొలిచేలా నిర్ణయాలు తీసుకుంటే, 'అసలు మనం ఇంకా ప్రజాస్వామ్యంలోనే ఉన్నామా? అంటూ అనుమానం వ్యక్తం చేశారు. దేశ భవిష్యత్తును ప్రజాస్వామ్య పరిరక్షణ బాధ్యత ఉన్న సంస్థ పునాదులే బలహీనపడుతున్న పరిస్థితిలో దాని నిర్ణయాలకు వదిలేయలేమని అన్నారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు రాజకీయ పార్టీలు, రాజ్యాంగ సంస్థలు, పౌర సంఘాలు, ముఖ్యంగా సుప్రీంకోర్టు కలిసి ముందుకు రావాలని ఆయన ఆకాంక్షించారు. తెలంగాణలో ఓట్ల తొలగింపుపైనా కేటీఆర్ తీవ్రంగా స్పందించారు. 'తెలంగాణలో అత్యధిక ఓట్ల తొలగింపులు బీఆర్ఎస్ గెలిచిన స్థానాల్లోనే ఉండటం అక్రమం కలిగించదా?' అని ప్రశ్నించారు. తెలంగాణలో ప్రస్తుతం ఒకే పార్టీలో జరుగుతున్నది, అది 'కేంద్ర పార్టీస్ అండర్' అని కేటీఆర్ పేర్కొన్నారు. బీఆర్ఎస్ను ఓడించేందుకు కాంగ్రెస్, బీజేపీలు కలిసి కుట్రలు, ఆక్రమం, బహిరంగంగా ప్రకటించని కుమ్మక్కు పాల్పడ్తున్నాయని ఆరోపించారు. ఇప్పుడు ఆ కుమ్మక్కులోకి ఎన్నికల సంఘం కూడా చేరుతున్నట్టుగా కనిపిస్తున్నదని వ్యాఖ్యానించారు. ఈ వ్యవహారంపై బీఆర్ఎస్ న్యాయస్థానాల్లోనూ, ప్రజల మధ్యనూ పోరాడుతుందని స్పష్టం చేశారు. చట్టబద్ధంగా తొలగించిన ప్రతి ఓటును తిరిగి చేర్చే వరకు పోరాటం ఆగదని ప్రకటించారు. వివరాల ఆయన తన రాజకీయ సందేశాన్ని మరోసారి స్పష్టం చేస్తూ తెలంగాణలో జరిగే ఒక్క 'సార్' ఉన్నారు అని అది కేటీఆర్ సార్ అని, ప్రజలకు ఆయనపైఉన్న ప్రేమను ఏ 'ఎసిఐఆర్' కూడా ఓడించలేరు' అని కేటీఆర్ ఈ సందర్భంగా పేర్కొన్నారు. తొలి వికెట్ పడింది, త్వరలో మరిన్ని వికెట్లు పడతయ్?.. దానం అనర్హతపై కేటీఆర్ ట్వీట్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అనర్హతపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై కేటీఆర్ సంచలన ట్వీట్ చేశారు. ఒక వికెట్ పడింది. త్వరలో మరిన్ని వికెట్లు పడబోతాయని జోస్యం చెప్పారు. దానం నాగేందర్ బీఆర్ఎస్ టికెట్పై పోటీ చేసి గెలుపొందిన తరువాత కాంగ్రెస్లో చేరడంపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి, బీజేపీ ఎమ్మెల్యే హైకోర్టులో కేసు దాఖలు చేశారు. పార్టీ ఫిరాయింపుల చట్టం ప్రకారం దానంపై అనర్హత వేటు వేయాలని కోర్టును కోరారు. దాదాపు రెండు సంవత్సరాల పైగా ఇరువాదనలు విన్న హైకోర్టు.. ఇటీవల దానంపై అనర్హత వేసింది. అనర్హత వెల్లడిని సుప్రీంకోర్టులో దానం నాగేందర్ పిటిషన్ వేయగా.. ఎట్టకేలకు గురువారంనాడు ఆ పిటిషన్ను పరిశీలించింది. ఈ విషయంలో హైకోర్టు ఇచ్చిన తీర్పును సమర్థించడంతో భారతాసా నియోజకవర్గంకు ఉప ఎన్నిక ఖాయమంటూ తీర్పునివ్వడంపై కేటీఆర్ ఈ సందర్భంగా హర్షం వ్యక్తం చేశారు.

వానలోనూ వీడని వీఆర్ఏల దీక్ష

- వీఆర్ఏల సమస్యలు పరిష్కరించాలని కార్యాలయానికి వచ్చిన ప్రజల ఆకాంక్ష

పోదూరు, సెప్టెంబర్ 21, మనం ప్రతినిధి: తమ సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని కోరుతూ పోదూరు మండల తహశీల్దార్ కార్యాలయం వద్ద వీఆర్ఏలు చేపట్టిన నిరాహారదీక్ష భారీ వర్షంలోనూ కొనసాగుతోంది. తుఫాను ప్రభావంతో వర్షం కురుస్తున్నప్పటికీ ఏమాత్రం వెన్ను తగ్గకుండా కొమ్మిదో రోజు వీఆర్ఏలు దీక్షలో కూర్చున్నారు. వర్షం నుంచి రక్షణ లేకపోయినా తమ డిమాండ్ల సాధన కోసం దీక్షను కొనసాగిస్తున్నారు. తహసీల్దార్ కార్యాలయానికి వివిధ పనుల నిమిత్తం వస్తున్న ప్రజలు వర్షాన్ని సైతం లెక్కచేయకుండా వీఆర్ఏలు దీక్ష కొనసాగిస్తున్న తీరును చూసి వారి పరిస్థితిపై ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ సమస్యలు పరిష్కారం కాకపోవడంతో వీఆర్ఏలు ఇంతటి ప్రతికూల పరిస్థితుల్లోనూ నిరసన కొనసాగించాల్సి వస్తోందని పలువురు పేర్కొంటూ, ప్రభుత్వం వారి సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నారు. గ్రామ రెవెన్యూ సహాయకులకు వేతన శ్రేణి అమలు చేయడం, నామినీ వీఆర్ఏలకు పనిచేస్తున్న శాఖలో పదోన్నతి కోటాను 30 శాతం నుంచి 70 శాతానికి పెంచడం, కారుణ్య నియామకాలు చేపట్టడం తదితర ప్రధాన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలని వీఆర్ఏలు కోరుతున్నారు. వర్షం కురుస్తున్నా దీక్షను విరమించకుండా తమ సమస్యల పరిష్కారం కోసం వీఆర్ఏలు పోరాటాన్ని కొనసాగిస్తున్నారు.

## వర్షపు మురుగు నీటిలో
# తేలాడుతున్న విద్యార్థులు

### నరకప్రాయంగా వసతిగృహాల విద్యార్థుల బాట
### కొరవడిన అధికారులు పర్యవేక్షణ
### ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో మురుగు నీటిని తొలగించాలని ధర్నా



ఖమ్మం, సెప్టెంబర్ 24(మనం న్యూస్): సంక్షేమ వసతి గృహాల్లో అడుగడుగునా విద్యార్థులను అసౌకర్యాలు వెంటాడుతూ నరక కూపాన్ని తలపిస్తున్నాయనీ, వెంటనే మరమ్మతులు చేయాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇటికాల రామకృష్ణ జిల్లా కార్యదర్శి చింతల రమేష్ ప్రభుత్వం డిమాండ్ చేశారు. ఖమ్మంలో గురువారం అధిక వర్షపాతం నమోదు కావడంతో ఎన్ఎస్పి క్యాంపులో ఉన్న సంక్షేమ వసతి గృహాలను చుట్టుముట్టిన వర్షపు మురుగు నీటిలో తేలి ఆడుతున్న విద్యార్థుల గోడు ప్రభుత్వానికి పట్టదా అని వారు ప్రశ్నించారు. వసతి గృహాల నిర్వహణ పట్టించుకోవాల్సిన సంబంధిత డీడీలు తమ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని దీంతో విద్యార్థులు సమస్యలు పట్టించుకునే నాథుడే లేడా అని ప్రశ్నించారు. ప్రభుత్వ నిర్లక్ష్యం అనుచిత ధోరణి వలనే వసతి గృహాలు సమస్యలతో విలయతాండవం చేస్తున్నయన్నారు.

**చెరువులా మారిన వసతి గృహాల ప్రాంగణాలు**

ప్రాంగణంలో చేరిన మురుగు నీటిని తొలగించి శిథిలావస్థకు చేరుకున్న భవనాల స్థానంలో కొత్త భవనాలు నిర్మించి పేరుకుపోయిన వర్షపు నీరును తక్షణమే తొలగించి డ్రైనేజీ ప్రహరీ గోడ నిర్మించాలని నాయకులు డిమాండ్ చేశారు. అంటు వ్యాధుల భయంతో అంధకారంలో వసతిగృహాల విద్యార్థులు భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందన్నారు. తక్షణమే జిల్లా. డీడీలు స్పందించి సంక్షేమ వసతి గృహాల విద్యార్థుల సమస్యలు పరిష్కరించకపోతే డీడీ కార్యాలయాలన్ని ముట్టడిస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బుర్ర మనోజ్, జిల్లా ఉపాధ్యక్షులు శివ, భాస్కర్, పవన్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



# సర్ పేరుతో ఓట్ల తొలగింపు
## ఈసీ బీజేపీకి తొత్తుగా మారింది

### జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ ఫైర్
### ఎన్నికల కమిషన్ తీరుపై ఘాటు విమర్శలు
### జ్ఞానేష్ కుమార్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్

ఖమ్మం, సెప్టెంబర్ 24(మనం న్యూస్); కేంద్ర ఎన్నికల సంఘం సర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) పేరుతో దేశవ్యాప్తంగా కాంగ్రెస్, ప్రతిపక్ష పార్టీల ఓట్లను లక్ష్యంగా చేసుకుని తొలగిస్తోందని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ ఘాటుగా విమర్శించారు. శుక్రవారం ఆయన స్థానికంగా మాట్లాడుతూ...ఈసీ తాజాగా సుప్రీంకోర్టులో వేసిన అఫిడవిట్ పూర్తిగా అసమంజసంగా ఉందన్నారు. 'అనుమానాలను స్వీకరించం, ఆ అంశాన్ని కమిషన్ పరిశీలిస్తుందని, క్యాబినెట్ కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లమని సమాధానం చెప్పడం సిగ్గుచేటు అన్నారు. పదేళ్లలో 14 సార్లు ఇద్దరు ఎన్నికల కమిషనర్లు ఇలా చట్టవిరుద్ధంగా చర్యలు చేపట్టారని ఆరోపించారు. 2025 జూన్ నుండి ఇప్పటిదాకా సర్ లో భాగంగా 30 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో 13 కోట్లకు పైగా ఓట్లను తొలగించారని, ఇది ఓట్ల తొలగింపు కాదు, ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమే' అని ఆయన మండిపడ్డారు. ఈసీ తీరుపై దేశవ్యాప్తంగా ఆగ్రహం వ్యక్తమవుతోందని, అందుకే ఢిల్లీలో యువజన కాంగ్రెస్ కార్యకర్తలు సీఈసీ జ్ఞానేష్ కుమార్‌కు వ్యతిరేకంగా నిరసన తెలిపారని గుర్తుచేశారు.

**బీజేపీతో కలిసి ఓట్ల చోరీకి కుట్ర**

బీజేపీ, ఆరెస్సెస్, ఈసీలు కలిసి ఓట్ల చోరీ ద్వారా దేశద్రోహ చర్యకు పాల్పడుతున్నాయి. బీహార్, మహారాష్ట్ర, తమిళనాడు, పశ్చిమ బెంగాల్ లో నిరసనలు చిన ఆసాంతం ఎన్నికలను రద్దు చేసి మళ్ళీ బ్యాలెట్ పేపర్ తో ఎన్నికలు నిర్వహించాలన్నారు. సీఈసీ జ్ఞానేష్ కుమార్ వెంటనే రాజీనామా చేయాలని, ఆయనను అరెస్టు చేయాలని అన్నారు. గతేదాది కాలంలో ఈ నిర్ణయాలను పూర్తి కమిషన్ ఏకగ్రీవంగా తీసుకోలేదు, కేవలం కొందరు అధికారుల ఇష్టానుసారంగా జరుగుతోంది' అని ఆయన ఆరోపించారు. కొత్త ఓటరు అంటే ఎవరో తెలియదని, తల్లిదండ్రులు, తాతల పేర్లను నింపడానికి తీసుకొచ్చిన పారంఫారం మార్పులు చేయడాన్ని తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని, చట్టాల్లో మార్పులు చేయకుండా ఫారం -6 ను మార్చలేరని అన్నారు. ఈసీ తీరు బ్రిటిష్ పాలనను తలపిస్తోందని, ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవడానికి కాంగ్రెస్ పార్టీ వీధి పోరాటం చేస్తుందని, దేశ ప్రజలు ఎప్పుడో బీ జె పి పార్టీని అభిశంసించారని, ఈ పోరాటం ఆగదని జిల్లా కాంగ్రెస్ కమిటి అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ స్పష్టం చేశారు.

# గణేష్ మండపంలో ప్రత్యేక పూజలు చేసిన జిల్లా కలెక్టర్

సంగారెడ్డి సెప్టెంబర్ 24 మనం ప్రతినిధి : వివేకా నంద యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గంజ్ మైదాన్ వద్ద ఏర్పాటు చేసిన వినాయక మండపాన్ని బుధవారం జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, ఎస్పీ పరితోష్ పంకజ్ లు తమ కుటుంబ సభ్యులతో కలిసి సందర్శించారు. వీరితో పాటు నారాయణ్ ఖేడ్ డిప్యూటీ కలెక్టర్ ఉమా హారతి, అడిషనల్ ఎస్పీ చైతన్య రెడ్డి లు సైతం పాల్గొన్నారు. కలెక్టర్, ఎస్పీ లు వినాయకుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజల అనంతరం వివేకానంద యూత్ అసోసియేషన్ సభ్యులు కలెక్టర్, ఎస్పీ లతో పాటు డిప్యూటీ కలెక్టర్, అడిషనల్ ఎస్పీ లను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు సుదీప్, హర్షవర్ధన్ , మురారి, మోహన్ తదితరులు పాల్గొన్నారు.





## కాకతీయ యూనివర్సిటీ గోల్డెన్ జూబ్లీ వేడుకలు

- విశిష్ట సేవలందించిన వారికి ఘన సన్మానం

ఖమ్మం, సెప్టెంబర్ 24(మనం న్యూస్): కాకతీయ యూనివర్సిటీ గోల్డెన్ జూబ్లీ వేడుకల్లో భాగంగా, జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో విశిష్ట సేవలు అందించిన పూర్వ, ప్రస్తుత అధికారులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం జిల్లా నుండి రాష్ట్ర అవార్డు పొందిన ప్రొఫెసర్ ఏ.వెంకటేశ్వర్లు కాకతీయ యూనివర్సిటీ ఉపకులపతి ప్రొఫెసర్ ప్రతాప్ రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రామచంద్రం శాలువాతో, జ్ఞాపికతో సత్కరించారు. అదేవిధంగా మాజీ డిస్ట్రిక్ట్ ప్రోగ్రాం ఆఫీసర్ సీహెచ్.జగదీశ్వరరావును ఆదిలాబాద్ మాజీ డీపీఓ సీహెచ్. వీరభద్రంను జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఎన్. శ్రీనివాసరావుని సన్మానించారు. అంతేకాకుండా ప్రోగ్రాం ఆఫీసర్లుగా సేవలందించిన కామర్స్ లెక్చరర్ ప్రొఫెసర్ పి.సర్వేశ్వరరావుని, వ్యక్తిత్వ వికాస నిపుణులు గడ్డమనుగు రామారావుని, బనిగండ్లపాడు కళాశాల ఫిజిక్స్ అధ్యాపకులను కూడా ఘనంగా సన్మానించారు. జాతీయ సేవా పథకం, కాకతీయ యూనివర్సిటీ ఆధ్వర్యంలో వారు చేసిన విశిష్ట సేవలకు గాను సర్టిఫికెట్, జ్ఞాపికతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ సీతారాం నాయక్, తెలుగు అకాడమీ చైర్మన్ ప్రొఫెసర్ వెంకట నారాయణ, మాజీ కోఆర్డినేటర్లు, మాజీ డీపీఓలు, ప్రస్తుత ప్రోగ్రాం ఆఫీసర్లు పాల్గొన్నారు. సంగీత, నృత్య కార్యక్రమాలతో కాకతీయ యూనివర్సిటీ ఆడిటోరియం మార్మోగింది.

# బ్యాంకు సేవలను మరింత విస్తృతం చేయాలి

- భద్రాద్రి జిల్లా రెవెన్యూ అధికారిణి పద్మావతి
- ప్రాధాన్యతా రంగంలో రూ.5702.78 కోట్ల వార్షిక లక్ష్యానికి గాను
- రూ.1578.08 కోట్లు మంజూరు
- జిల్లా సంప్రదింపుల కమిటీ (డీ.సీ.సీ), జిల్లా స్థాయి సమీక్ష కమిటీ (డీ.ఎల్.ఆర్.సీ) సమావేశం



భద్రాద్రి కొత్తగూడెం, సెప్టెంబర్ 24 (మనంప్రతినిధి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో బ్యాంకు సేవలను మరింత విస్తృతం చేయాలని జిల్లా రెవెన్యూ అధికారిణి (డీ.ఆర్.ఓ) పద్మావతి ఆదేశించారు. 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన మొదటి త్రైమాసిక జిల్లా సంప్రదింపుల కమిటీ (డీసీసీ), జిల్లా స్థాయి సమీక్ష కమిటీ (డీఎల్ఆర్సీ) సమావేశం గురువారం ఐడీఓసీ కార్యాలయంలోని సమావేశ మందిరంలో నిర్వహించగా జిల్లా రెవెన్యూ అధికారిణి పద్మావతి అధ్యక్షత వహించారు.ఈ సమావేశంలో లీడ్ బ్యాంక్ మేనేజర్ రామిరెడ్డి, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బిఐ) ఏ.జీ.ఎం చిరంజీవి, రీజనల్ మేనేజర్ తెలంగాణ గ్రామీణ బ్యాంక్ నాగరాజు, వివిధ వా బ్యాంకుల అధికారులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

ముఖ్యంగా ప్రాధాన్యతా రంగాల రుణాల లక్ష్యాలు, సాధించిన అంశాలపై సమగ్ర సమీక్ష నిర్వహించారు. 2026 జూన్ 30వ తేదీ నాటికి జిల్లాలో మొత్తం ప్రాధాన్యతా రంగంలో రూ.5702.78 కోట్ల వార్షిక లక్ష్యానికి గాను రూ.1578.08 కోట్లు మంజూరు చేసి 27.67 శాతం నమోదైనట్లు వెల్లడించారు. వ్యవసాయ రంగంలో రూ.4591.84 కోట్ల లక్ష్యానికి గాను రూ.1148.87 కోట్లు మంజూరు చేసి 25.01 శాతం నమోదైంది. ఇందులో పంట రుణాల కింద రూ.2405.6 కోట్ల లక్ష్యానికి గాను రూ.467.53 కోట్లు (19.44 శాతం), అగ్రి టర్మ్ లోన్స్ కింద రూ.1,479.1 కోట్ల లక్ష్యానికి గాను రూ.508.87 కోట్లు (34.4 శాతం), అగ్రి ఇన్ఫ్రాస్ట్రక్చర్ కింద రూ.44.73 కోట్ల లక్ష్యానికి గాను రూ.0.65 కోట్లు (1.45 శాతం), అనుబంధ వ్యవసాయ కార్యకలాపాల కింద రూ.663.41 కోట్ల లక్ష్యానికి గాను రూ.171.83 కోట్లు (25.9 శాతం) మంజూరు చేసినట్లు వివరించారు.

ఈ క్రమంలో ఎం.ఎస్.ఎం.ఈ రంగంలో రూ.888.98 కోట్ల లక్ష్యానికి గాను రూ.403.1 కోట్లు మంజూరు చేసి 45.34 శాతం నమోదైంది. విద్యా రుణాల కింద రూ.21.4 కోట్ల లక్ష్యానికి గాను రూ.3.44కోట్లు (16.07), గృహ రుణాల కింద రూ.35 కోట్ల లక్ష్యానికి గాను రూ.5.08 కోట్లు (14.51 శాతం) మంజూరు చేసినట్లు తెలిపారు. పీ.ఎం సూర్య ఘర్ పథకంలో రు.7.06 కోట్లు లక్ష్యానికి గాను 6.76 కోట్లు సాధించగా 95.75 శాతం నమోదైందని తెలిపారు.ఇతర విభాగాల్లో రూ.153.5 కోట్ల లక్ష్యానికి గాను రూ.10.82 కోట్లు మంజూరు చేసి 7.05 శాతం నమోదైనట్లు తెలిపారు.జిల్లాలో మూడు పోస్టాఫీస్ లు వేరే పోస్టాఫీస్ లో విలీనం అవుతున్నాయని తెలిపారు.అదేవిధంగా స్ట్రీట్ వెండర్లుకు గతంలో ఇచ్చిన రుణాలను రు.10 వేలు నుంచి రు.15వేలు పెంచి రుణాలను మంజూరు చేస్తున్నామని పేర్కొన్నారు.

ఈ సందర్భంగా ప్రాధాన్యతా రంగాలకు రుణాల మంజూరు వేగవంతం చేసి ఖాతాదారులకు నాణ్యమైన సేవలు అందించాలని కోరారు. రైతు రుణాల పంపిణీ అంశంపై బ్యాంకుల వారీగా పంట రుణాల పంపిణీ లక్ష్య సాధన తక్కువగా ఉన్న బ్యాంకుల అధికారులను కారణాలు డీ.ఆర్.ఓ అడిగి తెలుసుకున్నారు. రైతులు తమ రుణాలను సకాలంలో పునరుద్ధరించుకునేలా విస్తృత అవగాహన కల్పించాలని, వ్యవసాయ శాఖ అధికారులతో సమన్వయం చేసుకుంటూ ప్రత్యేక శిబిరాలు నిర్వహించాలని బ్యాంకర్లను ఆదేశించారు.రైతు భరోసా, ఆసరా పింఛన్లు తదితర ప్రభుత్వ సంక్షేమ పథకాల కింద లబ్ధిదారుల ఖాతాల్లో జమ అయ్యే నిధులను ఇతర రుణాల బకాయిల పేరుతో నిలుపుదల చేయరాదని బ్యాంకు అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం అందించే సంక్షేమ ప్రయోజనాలు అర్హులైన లబ్ధిదారులకు ఎలాంటి ఆటంకం లేకుండా చేరేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

అదేవిధంగా వ్యవసాయ రంగం, సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల (ఎం.ఎస్.ఎం.ఈ) రంగాలకు ప్రాధాన్యతనిస్తూ అర్హులైన రైతులు, యువ పారిశ్రామికవేత్తలకు అవసరమైన రుణ సహకారం అందించాలని డీ. ఆర్.ఓ కోరారు. జిల్లాలో ఉపాధి, ఆర్థికాభివృద్ధికి దోహదపడే విధంగా బ్యాంకులు రుణాల పంపిణీలో మరింత చొరవ చూపాలని సూచించారు.స్వయం సహాయక సంఘాల బ్యాంకు అనుసంధానం, నిరర్థక ఆస్తుల (ఎన్పీఏ) తగ్గింపు, ప్రభుత్వ ప్రాయోజిత పథకాలైన పీఎం స్వనిధి, పీఎంఈజీపీ, పీఎం ముద్ర, పీఎం విశ్వకర్మ, పీఎంఎఫ్ఎంఈ, అగ్రికల్చర్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ ఫండ్ (ఏఐఎఫ్) అమలుపై సమీక్ష నిర్వహించారు. అర్హులైన లబ్ధిదారులకు సకాలంలో రుణాలు మంజూరు చేయాలని సంబంధిత అధికారులను డీ. ఆర్.ఓ ఆదేశించారు. ఈ సమావేశంలో అడిషనల్ డీ. ఆర్.డీ. ఏ నీలేష్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బాబురావు, పశుసంవర్ధక శాఖ అధికారి మల్లయ్య, జిల్లా మత్స్యశాఖ కార్యాలయ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు, ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## అకాల వర్షాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- మున్నేరు వరద పరిస్థితిపై అధికారులతో ఎప్పటికప్పుడు ఫోన్లో సమీక్ష
- విద్యుత్ స్తంభాలు, వైర్లను తాకవద్దు
- చిన్నారుల భద్రతపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలి
- నగర ప్రజలు అప్రమత్తంగా ఉండాలి
- సుడా చైర్మన్ పువ్వాళ్ళ దుర్గాప్రసాద్



ఖమ్మం, సెప్టెంబర్ 24(మనం న్యూస్): వర్షాలు కురుస్తున్న సమయంలో తడిసిన విద్యుత్ స్తంభాలు, విద్యుత్ వైర్లు, ఇతర విద్యుత్ పరికరాలను ఎట్టి పరిస్థితుల్లోనూ తాకవద్దని సుడా ఛైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. చిన్నారులు వర్షపు నీటిలోకి వెళ్లకుండా, విద్యుత్ స్తంభాలు, వైర్లకు దూరంగా ఉండేలా తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు. మరోవైపు మున్నేరు వరద పరిస్థితిపై చైర్మన్ సంబంధిత శాఖల అధికారులతో ఎప్పటికప్పుడు ఫోన్లో మాట్లాడి వివరాలు తెలుసుకుంటున్నారు. మున్నేరు ప్రవాహానికి సంబంధించిన ఎగువ ప్రాంతాలు, మున్నేరులో కలిసే అకేరు, పాలేరు పరివాహక ప్రాంతాలతో పాటు ఖమ్మం రూరల్, పోలేపల్లి, తీర్థాల తదితర పరిసర ప్రాంతాల్లో వర్షపాతం, వరద ఉధృతి, నీటి మట్టం పరిస్థితిపై అధికారులు అందిస్తున్న సమాచారాన్ని ఎప్పటికప్పుడు తెలుసుకుంటున్నారు. మున్నేరు పరివాహక ప్రాంతాల్లో పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తూ, ఎక్కడైనా వరద ఉధృతి పెరిగే అవకాశం ఉంటే ముందస్తు చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను సుడా చైర్మన్ కోరారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మున్సిపల్, రెవెన్యూ, పోలీస్, విద్యుత్, ఇరిగేషన్ తదితర శాఖల అధికారులు సమన్వయంతో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలి. వర్షాల సమయంలో ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటిస్తూ, అధికారుల సూచనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు.

## సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ



దుగ్గొండి, సెప్టెంబర్ 24 మనం ప్రతినిధి: మండలంలోని వెంకటాపురం గ్రామంలో సీఎంఆర్ఎఫ్ చెక్కులను వెంకటాపురం గ్రామ సర్పంచ్ పొగాకు శోభారాణి వెంకటేశ్వర్లు స్థానిక గ్రామపంచాయతీ ఆవరణలో అబ్ధిదారులకు అందజేశారు, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం ఏర్పడిన రోజు నుండి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ప్రజా శ్రేయస్సే పరమావదిగా పరిపాలన కొనసాగిస్తూ నియోజకవర్గ ప్రజల జీవితాల్లో వెలుగులు నింపుతున్నారని వారు ఆనందం వ్యక్తం చేశారు, చెక్కులు అందుకున్న వారిలో సింగిరెడ్డి భరత్ 19500, ముత్యాల మంజుల 60 వేలు,తమ ఆరోగ్య ఖర్చుల నిమిత్తం తమకు సహాయం చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలియజేసారు.ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పొగాకు వెంకటేశ్వర్లు ఉప సర్పంచ్ మాటేటి రవి వార్డు సభ్యులు ఊరటి లింగం గుండెబోయిన రాజు నాంపల్లి రాజయ్య గ్రామ సీనియర్ నాయకులు పొగాకు సాంబయ్య పొగాకు సదయ్య ఏడాకుల లింగారెడ్డి ఇంగే వెంకటేష్ గుండెబోయిన రవి సారా రమేష్,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక

- ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు
- పాల్వంచలో 360 డబుల్ బెడ్రూమ్ ఇళ్లకు లక్కీ డ్రా
- అర్హులైన వారికి ఇళ్ల కేటాయింపు: కలెక్టర్ అంకిత్



పాల్వంచ, సెప్టెంబర్ 24(మనం న్యూస్): లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియలో పూర్తి పారదర్శకత పాటించామని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ నిబంధనల ప్రకారం న్యాయం జరిగేలా చర్యలు తీసుకున్నామని కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. పాల్వంచ మున్సిపాలిటీ పరిధిలోని మొత్తం 27 డివిజన్లకు చెందిన అర్హులైన లబ్ధిదారుల ఎంపికకు పెద్దమ్మతల్లి కనకదుర్గ ఫంక్షన్హాల్లో డబుల్ బెడ్రూమ్ ఇళ్ల లక్కీ డ్రా కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు, జిల్లా కలెక్టర్ అంకిత్, మేయర్ మూడ్ మూడ్ గణేష్ సమక్షంలో లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను పూర్తి పారదర్శకంగా చేపట్టారు.

**మునిసిపాలిటీ పరిధిలో 360**

పాల్వంచ మున్సిపాలిటీ పరిధిలో మొత్తం 360 డబుల్ బెడ్రూమ్ ఇళ్లను కేటాయించేందుకు ప్రభుత్వం అనుమతించింది. పది బ్లాకుల్లో ఒక్కో బ్లాక్లో 36 ఇళ్ల చొప్పున మొత్తం 360 ఇళ్లు అందుబాటులో ఉన్నాయి. మొత్తం 27 డివిజన్ల నుంచి వీటి కోసం 4,611 దరఖాస్తులు అందగా, క్షేత్రస్థాయిలో విచారణ, అర్హతల పరిశీలన అనంతరం 1,254 మందిని అర్హులుగా గుర్తించారు. అందుబాటులో ఉన్న ఇళ్ల సంఖ్య కంటే అర్హుల సంఖ్య ఎక్కువగా ఉండటంతో లక్కీ డ్రా విధానంలో లబ్ధిదారులను ఎంపిక చేశారు. ప్రభుత్వ నిబంధనల మేరకు ఇళ్ల కేటాయింపులో సామాజిక వర్గాల వారీగా రిజర్వేషన్లు అమలు చేశారు. ఎస్సీ వర్గానికి 17 శాతం మేరకు 61 ఇళ్లు, ఎస్టీ వర్గానికి 6 శాతం మేరకు 22 ఇళ్లు, మైనారిటీలకు 12 శాతం మేరకు 43 ఇళ్లు, మిగిలిన బీసీ, ఓసీ వర్గాలకు 65 శాతం మేరకు 234 ఇళ్లను కేటాయించారు. ఎస్సీ కేటగిరీలో ముగ్గురు దివ్యాంగులకు, ఎస్టీ కేటగిరీలో ఒక దివ్యాంగుడికి, మైనారిటీ కేటగిరీలో ఇద్దరు దివ్యాంగులకు, బీసీ, ఓసీ కేటగిరీల్లో 12 మంది దివ్యాంగులకు ఇళ్లను కేటాయించేలా నిబంధనల ప్రకారం చర్యలు చేపట్టారు. మొత్తంగా 18 ఇళ్లు దివ్యాంగులకు, 342 ఇళ్లు ఇతర అర్హులకు కేటాయించే విధంగా ప్రక్రియ రూపొందించారు. ఈ సందర్భంగా కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ.. గతంలో నిర్మాణం పూర్తయిన డబుల్ బెడ్రూమ్ ఇళ్ల పంపిణీ ప్రక్రియ కొన్ని కారణాల వల్ల ఆలస్యమైందని, అర్హులైన లబ్ధిదారులకు ఇళ్లను అందించే ప్రక్రియను ముందుకు తీసుకెళ్లేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అందుబాటులో ఉన్న ఇళ్ల కంటే అర్హులైన దరఖాస్తుదారులు అధికంగా ఉన్నందున లక్కీ డ్రా ద్వారా ఎంపిక చేయాల్సి వచ్చిందన్నారు.గతంలో కొంతమంది కుటుంబాలు డబుల్ బెడ్రూమ్ ఇళ్లు అందుతాయనే హామీతో తమ నివాసాలను ఖాళీ చేసిన పరిస్థితులు ఉన్నాయని, అయితే ప్రస్తుత అర్హుల జాబితాలో వారి పేర్లు లేని విషయం తన దృష్టికి వచ్చిందని ఎమ్మెల్యే తెలిపారు. అటువంటి కుటుంబాల సమస్యను ప్రస్తుత లక్కీ డ్రాతో కలపకుండా ముఖ్యమంత్రి లేదా గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి దృష్టికి తీసుకెళ్లి ప్రత్యేకంగా పరిష్కారం కోసం కృషి చేస్తానని చెప్పారు. ప్రస్తుత లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియలో ఎలాంటి గందరగోళం లేకుండా ప్రభుత్వం నిర్దేశించిన విధానాన్ని అనుసరించడం ముఖ్యమన్నారు. జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ.. డబుల్ బెడ్రూమ్ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను పూర్తి పారదర్శకంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. లక్కీ డ్రా ప్రక్రియను ప్రజల సమక్షంలో ప్రత్యక్షంగా నిర్వహిస్తున్నామని చెప్పారు. ప్రభుత్వ మార్గదర్శకాలు, రిజర్వేషన్ నిబంధనలకు అనుగుణంగా అర్హులైన వారిలోనే లబ్ధిదారులను ఎంపిక చేస్తున్నామని స్పష్టం చేశారు. ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలు, దివ్యాంగులకు నిబంధనల ప్రకారం కేటాయింపులు చేపడుతున్నట్లు తెలిపారు. లక్కీ డ్రా పూర్తయిన అనంతరం ఎంపికైన లబ్ధిదారుల ధ్రువపత్రాలను అధికారులు పరిశీలిస్తారని, అవసరమైన ధ్రువపత్రాల ధృవీకరణ పూర్తయిన తర్వాత ఇళ్ల కేటాయింపు ఉత్తర్వులు జారీ చేస్తామని కలెక్టర్ తెలిపారు. ఇళ్ల కేటాయింపు పేరుతో ఎవరైనా డబ్బులు అడిగినా, దళారులు సంప్రదించినా, నమ్మవద్దని సూచించారు. ప్రస్తుత లక్కీ డ్రాలో ఇల్లు లభించని అర్హులు నిరుత్సాహపడాల్సిన అవసరం లేదని, భవిష్యత్లో ప్రభుత్వం మంజూరు చేసే ఇళ్లలో నిబంధనల ప్రకారం వారికి అవకాశం కల్పించే దిశగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం చిన్నారుల చేతుల మీదుగా ముందుగా ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, దివ్యాంగుల కేటగిరీలకు సంబంధించిన లబ్ధిదారుల ఎంపిక కోసం లక్కీ డ్రా నిర్వహించారు. అనంతరం కేటగిరీల వారీగా లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను చేపట్టారు. ఎంపికైన లబ్ధిదారులకు ధ్రువపత్రాలను ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, జిల్లా కలెక్టర్ అంకిత్, మేయర్ మూడ్ మూడ్ గణేష్ చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ సిరిపురపు లలిత కుమారి, కొత్తగూడెం ఆర్డీవో మధు, కొత్తగూడెం కార్పొరేషన్ కమిషనర్ సుజాత, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు, కార్పొరేటర్లు, తహసీల్దార్ దారాప్రసాద్, గృహ నిర్మాణ శాఖ పీడీ సవేరాం, ఇందిరమ్మ డబల్ బెడ్ రూమ్ ఇండ్ల అర్హులు, ప్రజలు సంబంధిత శాఖల అధికారులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

మనం Manam Mahabubnagar మహబూబ్ నగర్

# చెత్త రాజకీయాలు మానుకోండి

- వైసీపీ నేతలకు ఎమ్మెల్యే కాలవ హెచ్చరిక

రాయదుర్గం, సెప్టెంబర్ 24 మనం న్యూస్: వైసీపీ నేతలు చెత్త రాజకీయాలు మానుకుని రాయదుర్గం అభివృద్ధిని చూడాలని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు కోరారు. రాయదుర్గం పట్టణంలోని డంపింగ్ యార్డులో జరుగుతున్న చెత్త శుద్ధీకరణ ప్రక్రియను గురువారం ఆయన పరిశీలించారు. దశాబ్దాలుగా పట్టణంలో పేరుకుపోయిన సుమారు లక్ష టన్నుల చెత్తను కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే శుద్ధి చేస్తోందన్నారు. ఇప్పటివరకు 87 వేల మెట్రిక్ టన్నుల చెత్తను శుద్ధి చేశామని, మిగిలిన చెత్తను మరో మూడు నెలల్లో పూర్తి చేస్తామని చెప్పారు. భవిష్యత్తులో డంపింగ్ యార్డును పరిశుభ్రమైన ప్రదేశంగా తీర్చిదిద్ది, ఆహ్లాదకరమైన పార్కును అభివృద్ధి చేస్తామని వెల్లడించారు. చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం అత్యధిక నిధులు తీసుకొచ్చి రాయదుర్గం అభివృద్ధికి కృషి చేస్తుంటే, వైసీపీ నేత మెట్టు గోవిందరెడ్డి చెత్త అంశంపై రాద్ధాంతం చేస్తూ పట్టణ ప్రజల్లో లేనిపోని అపోహలు సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నారని ధ్వజమెత్తారు. గడచిన రెండేళ్లలో చెత్త శుద్ధీకరణకు కూటమి ప్రభుత్వం చేసిన ఖర్చు కంటే, ఐదేళ్ల వైకాపా పాలనలో రాయదుర్గం అభివృద్ధికి చేసిన ఖర్చు చాలా తక్కువని గణాంకాలతో వివరించారు. డంపింగ్ యార్డులో పేరుకుపోయిన చెత్తను శుద్ధీకరించేందుకు రూ.8.54 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా పట్టణంలో రోజువారీగా ఉత్పత్తి అవుతున్న సుమారు 29 మెట్రిక్ టన్నుల చెత్త తరలింపు, మరుగుదొడ్ల వ్యర్థాలను శుద్ధీకరించేందుకు మరో రూ.4.47 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు వివరించారు. కూటమి ప్రభుత్వం ఈ రెండేళ్లలో రాయదుర్గం పట్టణంలో చెత్త తొలగింపునకు భవిష్యత్తులో వచ్చే చెత్తను శుభ్రపరచడానికి సుమారు రూ.13.03 కోట్లు ఖర్చు చేయగా, ఐదేళ్ల వైకాపా ప్రభుత్వం రాయదుర్గం అభివృద్ధికి ఖర్చు చేసింది కేవలం రూ.10.27 కోట్లు మాత్రమేనని స్పష్టం చేశారు. వైకాపా ఐదేళ్ల పాలనలో రాయదుర్గం పట్టణానికి రూ.31.31 కోట్లు మంజూరు కాగా, రూ.8.15 కోట్ల విద్యుత్ బిల్లులు చెల్లించారని తెలిపారు. మరో రూ.10.27 కోట్లను రోడ్లు, మురుగునీటి కాలువలు, వీధి దీపాలపై ఖర్చు చేశారని పేర్కొన్నారు. నాడు-నేడు కింద రూ.6.74 కోట్లు, పట్టణ ఆరోగ్య కేంద్రాలకు మరో రూ.2.40 కోట్లు మాత్రమే వచ్చాయని తెలిపారు. వాస్తవాలు, లెక్కలను వివరించేందుకు



తెలుగుదేశం పార్టీ సిద్ధంగా ఉందని, బహిరంగ చర్చకైనా లేదా ఇన్కెమెరా సమావేశంలో చర్చించడానికైనా సిద్ధంగా ఉన్నామన్నారు. రాయదుర్గం అభివృద్ధి తెలుగుదేశం పార్టీ సొంతమని, ప్రజల దీవెనలతో, చంద్రబాబు ఆశీస్సులతో రాయదుర్గం పట్టణాన్ని ఇతర పట్టణాలకు ఏ విధంగానూ తీసిపోని విధంగా తీర్చిదిద్దుతున్నామని పేర్కొన్నారు. రాయదుర్గం అభివృద్ధిని కోరుకునే పట్టణ ప్రజలు తమకు తోడుగా ఉండి సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ప్రజల సహకారంతో భవిష్యత్తులో మరింత అభివృద్ధి చేసేందుకు అవకాశం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు బండి కృష్ణ మూర్తి, పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ పోరాళ్ల పురుషోత్తం, మాజీ చేనేత డైరెక్టర్ టౌకశాల హనుమంతు,మాజీ కౌన్సిలర్లు కడ్డీపుడి మహబూబ్ బాషా,బుదురు తిప్పేస్వామి, రావుత్ రాజశేఖర్,భలే శంకర్,గుద్దిటి లోకేష్,మోపురి అశోక్,పోరాళ్ల ధనర్జున,బంగి శంకర్, ఆటో వెంకటేశులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యం

- ఎమ్మెల్యే అమిలినేని

కళ్యాణదుర్గం సెప్టెంబర్ 24 మనం న్యూస్: సమస్యలతో ప్రజలు నిత్యం కార్యాలయాల చుట్టు తిరగకుండా ఎప్పటికప్పుడు వాటిని పరిష్కరించడమే లక్ష్యంగా పనిచేస్తామని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు పేర్కొన్నారు. గురువారం ప్రజావేదిక నందు ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు . స్థానిక నాయకులతో కలసి ప్రజాదర్బార్ నిర్వహించారు.ఈ సందర్భంగా స్థానికంగా ప్రజల సమస్యలను తెలుసుకుని అక్కడే సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కారం చూపించారు.అంతే కాకుండా కామక్కపల్లి, దురదకుంట, మానిరేవు, కళ్యాణదుర్గం పట్టణంలో ఇళ్ల స్థలాలు లేని నిరుపేదలకు స్థలాలు కేటాయించి ఇంటి నిర్మాణం చేసుకునేలా చూడాలని స్థానిక తహసీల్దార్ ను పిలిచి స్థలం ఉన్న చోట అర్హులైన లబ్ధిదారులకు స్థలం కేటాయించాలని, ప్రభుత్వ స్థలం లేని చోట ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి భూమి



తీసుకునేలా ప్రతిపాదనలు పంపాలని, ఆలస్యం చేయకుండా సిద్ధం చేయాలని, అలాగే రెవెన్యూ సమస్యలతో వచ్చే పేదలను ఇబ్బంది పెట్టకుండా వీలైనంత త్వరగా సమస్యలు పరిష్కరించాలని సూచించారు.తాగునీటి ఇబ్బందులు రాకుండా చూసుకోవాలని ఎంపీడీఓలకు ఫోన్ ద్వారా తెలుపగా, విద్యుత్ సమస్యలు తలెత్తె కూడా చూసుకోవాలని విద్యుత్ అధికారులకు సూచించారు.

# చెరువును తలపిస్తున్న మండ్లం రోడ్డు



జూపాడు బంగ్లా, సెప్టెంబర్ 24 (మనం న్యూస్): అధికారులకు సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.రమేష్ బాబు హెచ్చరిక..జూపాడు బంగ్లా మండలం లోని మండ్లం గ్రామంలో కేజీ రహదారి నడిబొడ్డున జలమయంతో నిండిపోయి చరువును తలపిస్తుందని వాహనదారులకు ప్రజలకు చాలా ఇబ్బందులు గురవుతున్నారని పరిష్కరించాల్సిన అధికారులు అటువైపు చూసిన పరిస్థితి లేదని తక్షణమే సమస్య పరిష్కరించాలని లేనిపక్షంలో జిల్లా కలెక్టర్కు ఫిర్యాదు చేస్తామని సిపిఐ జిల్లా కార్య వర్గ సభ్యులు ఎం.రమేష్ బాబు హెచ్చరించారు.. వరం కరువును తలపిస్తున్న రోడ్డును పరిశీలించి వరి నారు నాటి నిరసన తెలిపారు.

# నాణ్యతతో అభివృద్ధి పనులు చేయాలి

- ఎమ్మెల్యే కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి

బేతంచేర్ల సెప్టెంబర్ 24 (మనం న్యూస్) పట్టణంలో 86.5 కోట్ల తో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు డోన్ ఎమ్మెల్యే కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి శంకుస్థాపన భూమిపూజ కార్యక్రమాల్లో పాల్గొన్నారు అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉపముఖ్యమంత్రి కొణిదెల పవన్



కళ్యాణ్ కూటమి ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధి కోసం కోట్లతో నిధులు ఇస్తున్నారు వారిఆదేశాల మేరకు అభివృద్ధికి పనులు చేస్తున్నామని ఎమ్మెల్యే అన్నారు ఈ నిధులతో సి.సిరోడ్లు లైటింగ్ డ్రైన్ల నిర్మాణం అమృత్ 2.0 పథకం ద్వారా తాగునీటి వసతులు కాలువల అభివృద్ధి నగర్ పంచాయతీ భవన నిర్మాణం తదితర మౌలిక వసతుల పనులు చేపట్టనున్నారు పట్టణంలో మౌలిక వసతులను మరింత చేసి ప్రజలకు మెరుగైన రహదారులు తాగునీరు డ్రైనేజీ లైటింగ్ వంటి సౌకర్యాలు అందించడమే లక్ష్యంగా అభివృద్ధి పనులను చేపడుతున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు 86.5 కోట్ల విలువైన అభివృద్ధి పనులతో బేతంచర్ల పట్టణ రూపు రేఖలు మరింత మారనున్నాయని ప్రజల అవసరాలకు అనుగుణంగా ప్రాధాన్యతా క్రమంలో పనులు చేపడుతున్నామని ఎమ్మెల్యే పేర్కొన్నారు అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలతో నిర్ణీత గడువులో పూర్తి చేసి ప్రజలకు అందుబా టులోకితీసుకురావాలని సంబంధిత అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు ప్రతిపక్ష పార్టీ వైసీపీ ప్రభుత్వం స్థానిక ఎన్నికలలో గెలుస్తామని పగటి కలలు కంటున్నారు మా ప్రభుత్వం ప్రజలకు ఇబ్బంది లేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలు అందిస్తున్నామని అన్నారు ఈ కార్య క్రమంలో ప్రజాప్రతినిధులు అధికారులు కూటమి నాయకులు కార్యకర్తలు స్థానిక ప్రజలు పాల్గొన్నారు

# రీసర్వే ప్రక్రియ లక్ష్యాలకు అనుగుణంగా పురోగతి సాధించాలి

- హౌసింగ్ ఫర్ ఆల్ కింద మ్యాపింగ్ త్వరితగతిన పూర్తి చేయాలి
- జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి

కర్నూలు, సెప్టెంబర్ 24 మనం న్యూస్: రీసర్వే ప్రక్రియలో లక్ష్యాలకు అనుగుణంగా పురోగతి సాధించాలని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం రీ సర్వే, సర్ ప్రక్రియ, పెన్షన్, అక్షరాంధ్ర, తదితర అంశాలపై కలెక్టర్ సంబంధిత అధికారులతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రీసర్వే ప్రక్రియ లో నిర్దేశించిన రోజువారీ లక్ష్యాలను సాధించేలా ప్రతి అధికారి తన పరిధిలోని గ్రామాలు, బృందాల పనితీరును నిరంతరం పర్యవేక్షించాలని కలెక్టర్ ఆదేశించారు. రీ సర్వే ప్రక్రియను పూర్తి స్థాయిలో వేగవంతం చేసి, నిర్దేశిత లక్ష్యాలను గడువులోగా పూర్తి చేయాలన్నారు.. బల్క్ భూ సమస్యల సంఖ్యను



సక్రమంగా నమోదు చేయాలని, కొత్తగా గుర్తించే భూ సమస్యలను కూడా జాబితాలో చేర్చాలని కలెక్టర్ స్పష్టం చేశారు..ఈ-ఆఫీస్ అమలును పూర్తిస్థాయిలో చేపట్టాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. బల్క్ ఇష్యూస్, ఈ-ఆఫీస్ అమలు, మ్యుటేషన్లు సంబంధిత ప్రతిపాదనలు సెప్టెంబర్ 30 నాటికి పూర్తి చేయాలన్నారు.కోర్టు కేసుల్లో జాప్యం ఉండకూడదని, ఎప్పటికప్పుడు పరిశీలించి, నిర్దేశిత గడువులోగా సమాధానాలు సమర్పించాలని కలెక్టర్ తహసిల్దార్ లను ఆదేశించారు. హౌసింగ్ ఫర్ ఆల్ కింద అర్హులైన లబ్ధిదారులను ఇప్పటికే ఉన్న లేఅవుట్లలో మ్యాపింగ్ చేయడాన్ని అక్టోబర్ 7లోగా పూర్తి చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. మ్యాపింగ్ పూర్తయిన అనంతరం మిగిలిన అర్హుల కోసం ప్రభుత్వ భూములను గుర్తించడం, అవసరమైన చోట పట్టా భూములను గుర్తించడం, భూసేకరణ అవసరమైతే ప్రతిపాదనలు సిద్ధం చేసి అక్టోబర్ 15లోగా సంబంధిత ప్రతిపాదనలు సమర్పించాలని కలెక్టర్ ఆర్డీఓ లను ఆదేశించారు. సర్ ప్రక్రియలో భాగంగా పెండింగ్లో ఉన్న ఫారం-6, ఫారం-7, ఫారం-8 దరఖాస్తులను రేపు సాయంత్రానికల్లా పరిష్కరించాలని కలెక్టర్ ఏఈఆర్ఓ లను ఆదేశించారు. టెలి కాన్ఫరెన్స్ లో డిఆర్ఓ సి.వెంకట నారాయణమ్మ, కర్నూలు ఆర్డీఓ సందీప్ కుమార్, పత్తికొండ ఆర్డీఓ ఓబులేసు, డిఆర్డిఏ పిడి శ్రీధర్ రావు, జిల్లా స్వర్ణ గ్రామ స్వర్ణ వార్డు అధికారి భాస్కర్ నాయుడు, అడల్ట్ ఎడ్యుకేషన్ డిడి చంద్రశేఖర్ రెడ్డి, ఈ ఆర్వో లు, ఏ ఈఆర్వోలు, ఎంపిడిఓ లు, పాల్గొన్నారు.

# రూ.7.20 కోట్లతో పుట్టపర్తి మున్సిపాలిటీ అభివృద్ధి పనులు

**పలు అభివృద్ధి పనులకు భూమిపూజ చేసిన ఎమ్మెల్యే పల్లె సింధూర, కలెక్టర్ శ్యాంప్రసాద్, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి**

పుట్టపర్తి, సెప్టెంబర్ 24మనం న్యూస్: పుట్టపర్తి మున్సిపాలిటీ పరిధిలో రూ.7.20 కోట్ల విలువైన పలు అభివృద్ధి పనులకు గురువారం భూమిపూజ, ప్రారంభోత్సవ కార్యక్రమాలు నిర్వహించారు. పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, జిల్లా కలెక్టర్ ఏ. శ్యాంప్రసాద్, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి ఈ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆర్టీసీ డిపో సమీపంలో రూ.48 లక్షలతో నిర్మించిన గోకులం మినీ పార్కును ప్రారంభించారు. అనంతరం మెప్మా ఆధ్వర్యంలో సుమారు రూ.10 లక్షలతో ఏర్పాటు చేసిన చిరుధాన్యాల ఆహార పార్కును ప్రారంభించారు. పుట్టపర్తి సంత మార్కెట్ రోడ్డులో రూ.20 లక్షలతో చేపట్టనున్న స్మశానవాటిక ప్రహరీ, మురుగునీటి కాలువ నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. కర్ణాటక నాగేపల్లి రోడ్డులో రూ.17.50 లక్షలతో మురుగునీటి కాలువ, సీసీ



రోడ్డు నిర్మాణానికి, సాయినగర్లో రూ.22.50 లక్షలతో సీసీ రోడ్డు, భూగర్భ మురుగునీటి వ్యవస్థ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. చిత్రావతి రోడ్డులో రూ.4.25 కోట్లతో నిర్మించనున్న మున్సిపల్ కార్యాలయానికి భూమిపూజ నిర్వహించారు. అదే ప్రాంతంలో 4.20 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించనున్న బహుళ క్రీడా ఇండోర్ స్టేడియం పనులకు కూడా భూమిపూజ చేశారు. ఎనుములపల్లి ఎస్సీ కాలనీలో రూ.39.70 లక్షలతో, బ్రాహ్మణపల్లి ఎస్సీ కాలనీలో రూ.20 లక్షలతో చేపట్టనున్న మురుగునీటి కాలువల నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. బ్రాహ్మణపల్లిలో తాగునీటి సమస్య పరిష్కారానికి రూ.6.50 లక్షలతో నూతన బోరు, పట్టణ ఆరోగ్య కేంద్రం నిర్మాణానికి రూ.1 కోటి వ్యయంతో చేపట్టనున్న పనులకు శంకుస్థాపన చేశారు. బడే నాయక్ తండాలో తాగునీటి సమస్య పరిష్కారానికి రూ.6.50 లక్షలతో నూతన బోరు బావి తవ్వకానికి, మున్సిపాలిటీ పరిధిలో తాగునీటి ఎద్దడి నివారణకు రూ.23.50 లక్షలతో నూతన బోరు బావుల తవ్వకానికి భూమిపూజ నిర్వహించారు. పరిశ్రమల ఏర్పాటుతో ఉపాధి అవకాశాలు ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి మాట్లాడుతూ పుట్టపర్తి నియోజకవర్గంలో పారిశ్రామిక అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. పుట్టపర్తి ప్రాంతంలో సుమారు రూ.లక్ష కోట్ల పెట్టుబడితో ఐదో తరం యుద్ధ విమానాల పరిశ్రమ ఏర్పాటుకు చర్యలు జరుగుతున్నాయని తెలిపారు. పెడబల్లి పంచాయతీలో 20 ఎకరాల్లో జీన్స్ పరిశ్రమ ఏర్పాటు చేసి సుమారు నాలుగు వేల మంది మహిళలకు ఉపాధి కల్పించే దిశగా చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు. అమడగూరులో రిలయన్స్ సంస్థ సహకారంతో సుమారు రూ.51 వేల కోట్ల పెట్టుబడితో భారీ సౌర విద్యుత్ పరిశ్రమ ఏర్పాటుకు ప్రతిపాదనలు ఉన్నాయని తెలిపారు. ఈ పరిశ్రమల ద్వారా సుమారు 20 వేల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించే అవకాశం ఉందని పేర్కొన్నారు. పరిశ్రమలతో పాటు మౌలిక వసతులు, తాగునీరు, రహదారులు, మురుగునీటి కాలువలు, ఆరోగ్యం, క్రీడా రంగాల్లో చేపడుతున్న పనులతో నియోజకవర్గ అభివృద్ధికి చర్యలు కొనసాగుతున్నాయని నాయకులు తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో కూటమి అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని ఎమ్మెల్యే, మాజీ మంత్రి ప్రజలను కోరారు. అభివృద్ధి కార్యక్రమాల కొనసాగింపుపై ప్రజలు తమ నిర్ణయం తీసుకోవాలని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో మున్సిపల్ ప్రజాప్రతినిధులు, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు, వివిధ శాఖల అధికారులు, టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు

# సి బెళగల్ మండల ప్రత్యేక అధికారిగా కే. శ్రీనివాసులు



సి.బెళగల్ సెప్టెంబర్ 24 మనం న్యూస్: సి.బెళగల్ మండలంలో గురువారంనాడు మండల ప్రత్యేక అధికారిగా కె శ్రీనివాసులు అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు ముందుగా ప్రత్యేక అధికారికి మండల పరిషత్ అధికారులు ఎంపీడీవో రాణమ్మ మేడం గారు ఆయనకు ఘనంగా స్వాగతం పలికి పుష్పగుచ్ఛం అందజేశారు అనంతరం ఆయన అధికారుల మధ్య సి.బిలగల్ మండల ప్రత్యేక అధికారిగా బాధితులను స్వీకరించారు అనంతరం మండల అభివృద్ధి అధికారి చే పలుఅభివృద్ధి పనులపై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు ఈ సమావేశంలో ముఖ్యంగా గ్రామాలలో నీటి సమస్యల పైన ప్రతి ఒక్కరు సంబంధిత కార్యదర్శులు గ్రామాలలో ఉండి నీటి సమస్యను తలెత్తకుండా చూడాలని ఆయన తెలిపారు అనంతరం ముఖ్యంగా ప్రజలు సమస్య లను ప్రతి సోమవారము నిర్వహించే పీజీఆర్ఎస్ లో ఏవైనా సమస్యలు వస్తే ఎప్పటికప్పుడు ఆ సమస్యలపై దృష్టి పెట్టాలని ఆయన తెలిపారు.

# ప్రతి కుటుంబానికి సొంతింటి కల సాకారమే లక్ష్యం



బేతంచేర్ల, సెప్టెంబర్ 24 (మనం న్యూస్): పేద మధ్యతరగతి కుటుంబాలకు సొంతింటి కలను సాకారం చేయాలనే లక్ష్యంతో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలలో భాగంగా ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం ద్వారా అర్హత కలిగిన 161 మంది లబ్ధిదారులకు నూతన గృహాల మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డోన్ శాసనసభ్యులు కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి పాల్గొని లబ్ధిదారులకు గృహాల మంజూరు పత్రాలను అందజేశారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి పేద కుటుంబానికి సొంత ఇల్లు ఉండాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యమని అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా కృషి చేస్తున్నామని తెలిపారు. సొంతింటి కల నెరవేరుతున్న 161 కుటుంబాలకు ఎమ్మెల్యే మంజూరైన గృహాలను నాణ్యతతో వేగంగా నిర్మించుకునేలా అధికారులు లబ్ధిదారులకు అవసరమైన సహకారం అందించాలని సూచించారు ప్రజా సంక్షేమం అభివృద్ధికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు చేరేలా నిరంతరం కృషి చేస్తామని ఎమ్మెల్యే పేర్కొన్నారు గృహాలు మంజూరైన లబ్ధిదారులు ఎమ్మెల్యే కోట్లకు కృతజ్ఞత తెలిపారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ నాగమణి, ఎంపీడీవో ఫజల్ రెహమాన్, నగర కమిషనర్ హరిప్రసాద్, హౌసింగ్ డిఇ ప్రజాప్రతినిధులు కూటమి నాయకులు, కార్యకర్తలు లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

# ఏఐవైఎఫ్ జిల్లా నిర్మాణ మహాసభలను జయప్రదం చేయండి

కర్నూలు, సెప్టెంబర్ 24మనం న్యూస్: అక్టోబర్ 3వ తేదీన కర్నూల్ నగరంలో జరిగే అఖిల భారత యువజన సమాఖ్య ఏఐవైఎఫ్ కర్నూలు జిల్లా నిర్మాణ మహాసభను జయప్రదం చేయాలని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు శ్రీరాములు, శ్రీనివాసులు పిలుపునిచ్చారు గురువారం నాడు స్థానిక సిఆర్ భవన్ నందు నిర్మాణ మహాసభలకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు ఈ సందర్భంగా శ్రీరాములు శ్రీనివాసులు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిరుద్యోగాన్ని పెంచి పోషిస్తున్నాయి తప్ప నిరుద్యోగులకు ఇచ్చిన హామీల అమలు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు కూటమి ప్రభుత్వం




తాను అధికారంలోకి వస్తే రాష్ట్రంలో సంపద సృష్టించి 20 లక్షల ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని, అలా చేయలేని పక్షంలో నెలకు 3,000 రూపాయలు నిరుద్యోగ భృతి ఇస్తామని హామీ ఇచ్చి అధికారం చేపట్టి రెండున్నర సంవత్సరాలు గడుస్తా ఉన్న ఇచ్చిన మాట నిలబెట్టుకో లేదన్నారు. ఈ మహాసభల్లో అధిక సంఖ్యలో యువతి పాల్గొని విజయవంతం చేయాలని వారు ఈ కార్యక్రమంలో అధ్యక్షులు నాగరాజు చంటి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# ఆర్డిఓకు వినతి పత్రం అందజేసిన వీఆర్ఏలు



జూపాడుబంగ్లా, సెప్టెంబర్ 24 (మనం న్యూస్): జూపాడుబంగ్లా మండలంలోని తాసిల్దార్ కార్యాలయం నందు రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు గత తొమ్మిది రోజులుగా సహాయ నిరాకరణ సమ్మె నిర్వహిస్తున్న జూపాడు బంగ్లా మండలం గ్రామ రెవెన్యూ సహాయకులు తమకున్న డిమాండ్స్ వి ఆర్ ఏ పెస్కేల్ ఇవ్వాలని. అర్హులైన వీఆర్ఏలకు ప్రమోషన్ కల్పించాలని. నామిని గా పని చేస్తున్న వారికి వీ ఆర్ ఏ లుగా తీసుకోవాలని. కారుణ్య నియామకాలు చేపట్టాలని. 2019 సంవత్సరంలో బకాయిలుగా ఉన్న డీఏలు చెల్లించాలని. రెవెన్యూ డివిజనల్ అధికారి వెంకట శివ,కు వారి విన్నపాలను విన్నవించుకొని ఇప్పటికైనా మా సమస్యలు తమరి ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి చేరవేసి వారి సమస్యలు పరిష్కరించటానికి సహకరించాలని.ఆర్ డి ఓ కు వినతి పత్రం అందజేశారు. ఆ ర్డి ఓ వెంకట శివ, స్పందిస్తూ వి ఆర్ ఏ ల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తానని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో అధ్యక్షులు జి మల్లికార్జునుడు, ఉపాధ్యక్షులు ఎల్ల నాయుడు, ప్రధాన కార్యదర్శి ఎం రమణ, కోశాధికారి ఎన్ ఆంజనేయులు, సహాయ కార్యదర్శి టి కాసిం, సీలార్ సాహెబ్, మౌలాలి, రసూల్, పక్కీర్ సాహెబ్, టీ జగదీష్, పి శ్రీనివాసులు, సుబ్బారావు, ముంతాజ్, షాహిన్ బి, తదితరులు పాల్గొన్నారు.

# మృతుని కుటుంబాన్ని పరామర్శించిన వైసిపి నాయకులు



మహానంది, సెప్టెంబర్24,మనంన్యూస్: మహానంది మండలంలోని గాజులపల్లి ఆర్ ఎస్ గ్రామానికి చెందిన కిరణ్ కుటుంబ సభ్యులను వైఎస్ ఆర్ సిపి నాయకులు శిల్పా భువనేశ్వర రెడ్డి గురువారం పరామర్శించారు. గత రెండు రోజుల క్రితం అనారోగ్యంతో అకస్మాత్తుగా మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.స్థానిక వైఎస్ ఆర్ సిపి నాయకులు పుల్లయ్య యాదవ్ ద్వారా విషయం తెలుసుకున్న ఆయన కుటుంబసభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. కుటుంబానికి అండగా ఉంటామని తెలిపారు. ఆయన వెంట గ్రామ వైసీపీ నాయకులు శేషులు, దినేష్, తదితరులు వున్నారు.

# ప్రత్యేక అధికారిగా ఎస్. బషీర్ ఉన్నిసా బాధ్యతల స్వీకరణ



బేతంచేర్ల, సెప్టెంబర్ 24 (మనం న్యూస్): ప్రజా ప్రతినిధులైన మండలం అధ్యక్షుడు ఎంపీటీసీ వారి పదవి 23 కి ముగియడంతో బేతంచెర్ల మండల ప్రజా పరిషత్ ప్రత్యేక అధికారిగా ఎస్. బషీర్ ఉన్నిసా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయంలో అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు అనంతరం ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది ప్రత్యేక అధికారిని మర్యాదపూర్వకంగా కలసి శుభాకాంక్షలు తెలిపారు. ప్రభుత్వం అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ మండల పరిధిలో అభివృద్ధి కార్యక్రమాలు పరిపాలనా వ్యవహారాలను సమన్వయంతో ముందుకు తీసుకెళ్లాలని ప్రత్యేక అధికారి ఎస్. బషీర్ ఉన్నిసా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బేతంచెర్ల క్ష్మ మండల ప్రజా పరిషత్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

# ప్రజా సమస్యలు అధికారులు పరిష్కరించాలి

## మండలాధికారులకు ఆదేశాలు జారీచేసిన ఎమ్మెల్యే కోట్ల



బేతంచేర్ల, సెప్టెంబర్ 24 (మనం న్యూస్): డోన్ ఎమ్మెల్యే కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి ప్రజా సమస్యల పరిష్కార వేదిక (గ్రీవెన్స్) కార్యక్రమం పట్టణంలోని ఉన్న ఆర్ అండ్ బీ అతిథి గృహంలో ప్రజల నుండి వినతిపత్రాలు స్వీకరించారు ఈ సందర్భంగా పట్టణ మండలం ప్రజలు నీటి సరఫరా రోడ్లు పింఛన్లు విద్యుత్ ఆరోగ్య సదుపాయాలు వంటి ప్రధాన సమస్యలను ఎమ్మెల్యే కి వివరించారు. ఎమ్మెల్యే ప్రతి వినతిని పరిశీలించి సంబంధిత శాఖాధికారులతో సమన్వయం చేసి తగిన చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు ప్రజా సంక్షేమమే తన ప్రధాన లక్ష్యమని పేర్కొంటూ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని స్పష్టం చేశారు ప్రజలు ఎప్పుడైనా తమ సమస్యలను తెలియజేయవచ్చని సూచిస్తూ వాటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# ప్రశాంత వాతావరణంలో గణేష్ నిమజ్జనాలు

- రైల్వే స్టేషన్ వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి నిమజ్జన కార్యక్రమాన్ని ప్రారంభించిన కలెక్టర్, ఎస్పీ
- భక్తుల భద్రతకు పటిష్ట ఏర్పాట్లు.. టేక్రియాల్ చెరువు వద్ద కలెక్టర్ పరిశీలన
- టేక్రియాల్ చెరువులో 700కు పైగా విగ్రహాల నిమజ్జనానికి అవకాశం
- అందుబాటులో బారికేడింగ్, క్రేన్లు, గజ ఈతగాళ్లు



**కామారెడ్డి, సెప్టెంబర్ 24 (మనం ప్రతినిధి):** గణేష్ నిమజ్జన కార్యక్రమాలను ప్రశాంత వాతావరణంలో, భక్తిశ్రద్ధలతో నిర్వహించేలా అధికారులు సమన్వయంతో పటిష్ట ఏర్పాట్లు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. బుధవారం కామారెడ్డి పట్టణంలో నిర్వహించిన గణేష్ నిమజ్జన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, జిల్లా ఎస్పీ ఎం. రాజేష్ చంద్ర పాల్గొన్నారు. కామారెడ్డి రైల్వే స్టేషన్ వద్ద గణనాథునికి కొబ్బరికాయ కొట్టి ప్రత్యేక పూజలు నిర్వహించి నిమజ్జన కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం విగ్రహాలను నిమజ్జనానికి తరలించే కార్యక్రమంలో పాల్గొని భక్తులకు శుభాకాంక్షలు తెలిపారు.

**టేక్రియాల్ చెరువు వద్ద ఏర్పాట్ల పరిశీలన...**

గురువారం జిల్లా కేంద్రంలోని టేక్రియాల్ చెరువులో జరుగుతున్న గణేష్ నిమజ్జన ఏర్పాట్లను కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ పరిశీలించారు. చెరువు వద్ద భద్రతా చర్యలు, నిమజ్జనానికి చేపట్టిన ఏర్పాట్లపై సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెరువులో సుమారు 700కు పైగా గణేష్ విగ్రహాలు నిమజ్జనం చేసే అవకాశం ఉన్నందున అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చే పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని ముందస్తు ఏర్పాట్లు పటిష్టంగా చేపట్టాలని ఆదేశించారు.

**అనుమతి లేని వ్యక్తులు నీటిలోకి ప్రవేశించకుండా చర్యలు...**

ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా చెరువు వద్ద బారికేడింగ్ ఏర్పాటు చేయాలని, అనుమతి లేని వ్యక్తులు నీటిలోకి ప్రవేశించకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. విగ్రహాల నిమజ్జనానికి పెద్ద క్రేన్లు, గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. భక్తుల కోసం వాటర్‌ప్రూఫ్ షామియానా ఏర్పాటు చేయడంతో పాటు రెవెన్యూ, ఇరిగేషన్, మున్సిపల్, అగ్నిమాపక శాఖల సమన్వయంతో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలని తెలిపారు.

**శాఖల సమన్వయంతో పర్యవేక్షణ...**

విద్యుత్ వైర్లు గణేష్ విగ్రహాలకు తగలకుండా తగిన ఎత్తులో ఏర్పాటు చేయాలని, అవసరమైన ప్రాంతాల్లో విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని విద్యుత్ శాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అధిక సంఖ్యలో విగ్రహాలు నిమజ్జనానికి తరలివచ్చే నేపథ్యంలో పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు. విగ్రహాలు వరుస క్రమంలో నిమజ్జనం జరిగేలా తహసీల్దార్, పోలీసు, మున్సిపల్, ఇరిగేషన్, అగ్నిమాపక శాఖల అధికారులు సమన్వయంతో నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. నిమజ్జన కార్యక్రమంలో భక్తులు, ప్రజలు జాగ్రత్తలు పాటిస్తూ పోలీసు, జిల్లా యంత్రాంగానికి సహకరించాలని కలెక్టర్, ఎస్పీ కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్పర్సన్ ఇప్ప ఉమారాణి, అధికారులు, పోలీసు సిబ్బంది, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## వినాయక నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించిన ఆర్డీఓ, మున్సిపల్ కమీషనర్



**బాన్సువాడ, సెప్టెంబర్ 24 (మనం న్యూస్):** స్థానిక మున్సిపాలిటీ పరిధిలోని కల్కి చెరువు వద్ద నిర్వహించనున్న వినాయక నిమజ్జన కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లను ఆర్డీవో రవీందర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ గోవు గంగాధర్ పరిశీలించారు. నిమజ్జన కార్యక్రమానికి వచ్చే భక్తులు, ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన ఏర్పాట్లు ముందస్తుగా పూర్తి చేశారు. కల్కి చెరువు నిమజ్జన ప్రాంతంలో లైటింగ్, తాగునీరు, కుర్చీలు, పారిశుధ్యం తదితర ఏర్పాట్లను పరిశీలించారు.నిమజ్జన కార్యక్రమం సందర్భంగా భక్తులకు అవసరమైన సౌకర్యాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ సిబ్బందికి సూచించారు.అలాగే నిమజ్జనం అనంతరం వినాయక మండపాల వద్ద పూజా సామగ్రి, ఇతర వ్యర్థాలను రోడ్లపై లేదా చెరువు పరిసరాల్లో పడవేయకుండా పురపాలక సిబ్బందికి అప్పగించాలని మండపాల నిర్వాహకులకు సూచించారు. శోభాయాత్ర సమయంలో పారిశుధ్యాన్ని కాపాడుతూ పురపాలక సిబ్బందికి పూర్తి సహకారం అందించాలని కోరారు.వినాయక నిమజ్జన కార్యక్రమాన్ని ప్రశాంతంగా, పరిశుభ్రంగా, విజయవంతంగా నిర్వహించేందుకు మండపాల నిర్వాహకులు, భక్తులు, ప్రజలు పురపాలక సంఘానికి సహకరించాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.

# వ్యవసాయ పారిశ్రామిక సందర్శనలో విద్యార్థులు



**నిజామాబాద్, సెప్టెంబర్ 24 (మనం ప్రతినిధి):** నిజామాబాద్ జిల్లా సాలూర మండలంలోని పీఎం శ్రీ జెడ్పీహెచ్ఎస్ సాలూర పాఠశాల విద్యార్థులు ఒకేషనల్ అగ్రికల్చర్లో భాగంగా నిజాంసాగర్ ప్రాజెక్టు, రుద్రూర్ కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే)ను సందర్శించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుల ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ సందర్శనలో విద్యార్థులకు వ్యవసాయం, నీటి వనరులు, ఆహార భద్రత, ఆధునిక వ్యవసాయ సాంకేతికతపై క్షేత్రస్థాయి అవగాహన కల్పించారు. నిజాంసాగర్ ప్రాజెక్టు వద్ద విద్యార్థులకు నీటి ఆవశ్యకత, ఆనకట్టలు, కాలువలు, నీటి వనరులు, సాగునీటి ప్రాధాన్యత తదితర అంశాలను వివరించారు. అనంతరం రుద్రూర్ కృషి విజ్ఞాన కేంద్రాన్ని సందర్శించిన విద్యార్థులకు ఆధునిక వ్యవసాయ పద్ధతులు, నూతన వంగడాలు, వివిధ రకాల మొక్కలు, వాటి పెరుగుదల, వ్యవసాయ పరిశోధనల గురించి నిపుణులు వివరించారు. ఫుడ్ అండ్ టెక్నాలజీ అంశంలో భాగంగా ఆహార పదార్థాల ప్రాధాన్యత, ఆహారంలో ఉండే హానికర సూక్ష్మజీవులు, ఆహారాన్ని పరిశుభ్రంగా, సురక్షితంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్శన ద్వారా విద్యార్థులు పుస్తక జ్ఞానంతో పాటు క్షేత్రస్థాయిలో వ్యవసాయం, నీటి వనరులు, ఆహార భద్రత, ఆధునిక వ్యవసాయ సాంకేతికతపై ప్రత్యక్ష అవగాహన పొందారు. కార్యక్రమంలో సాలూర మండల విద్యాధికారి రాజీ మంజూష, ఉపాధ్యాయులు గంధం సాయిలు, డి. రాజ్కుమార్, శోభారాణి, సుధారాణి, ఒకేషనల్ అగ్రికల్చర్ ఉపాధ్యాయుడు మేడి రవి, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# కామారెడ్డి జిల్లాలో హ్యాండ్‌బాల్ ఎంపికలు

**కామారెడ్డి, సెప్టెంబర్ 24 (మనం న్యూస్):** స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్జీఎఫ్) ఆధ్వర్యంలో కామారెడ్డి జిల్లా స్థాయి హ్యాండ్బాల్ పోటీలు, ఎంపికలు నేడు నిర్వహిస్తున్నట్లు ఎస్జీఎఫ్ జిల్లా కార్యదర్శి ఈ. శ్రీధర్ తెలిపారు. గాంధారి మండలంలోని పోతంగల్ కలాన్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉదయం 9 గంటలకు పోటీలు, ఎంపికలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. అండర్-14, అండర్-17 బాలబాలికల విభాగాల్లో ఎంపికలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అండర్-14 విభాగంలో 2013 జనవరి 1న లేదా ఆ తర్వాత జన్మించిన వారు, 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు అర్హులు. అండర్-17 విభాగంలో 2010 జనవరి 1న లేదా ఆ తర్వాత జన్మించిన, 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు అర్హులని తెలిపారు. ఎంపికలకు హాజరయ్యే విద్యార్థులు బోనాఫైడ్ ధ్రువీకరణ పత్రం తప్పనిసరిగా తీసుకురావాలని, వయస్సు, గుర్తింపు ధ్రువీకరణ కోసం ఆధార్ కార్డు నకలు సమర్పించాలని సూచించారు. క్రీడా దుస్తులు, క్రీడా పాదరక్షలు ధరించి హాజరు కావాలని తెలిపారు. పాల్గొనే విద్యార్థులకు మధ్యాహ్న భోజన సదుపాయం కల్పించనున్నట్లు వెల్లడించారు. మరిన్ని వివరాల కోసం నాగరాజు (పీడీ) 9441042622, ఎస్జీఎఫ్ జిల్లా కార్యదర్శి ఈ. శ్రీధర్ 9440004112 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

# నౌకపై దాడిలో భారతీయుడి మృతి

**ఢిల్లీ, సెప్టెంబర్ 24 :** భారత్ కు వస్తున్న ఓ సరకు రవాణా నౌకపై ఒమన్ తూర్పు తీరంలో జరిగిన దాడిలో ఒక భారతీయుడు మృతి చెందారు. ఎంవీ కేప్ దావో అనే ఆ నౌకలో 20 మంది భారతీయులున్నారు. 'ఈ దాడిలో భారతీయుడు మరణించడంపట్ల తీవ్ర విచారం వ్యక్తం చేస్తున్నాం. ఆయన కుటుంబానికి మా సానుభూతిని తెలియజేస్తున్నాం. ఆర్పీఎస్ఎల్తోనూ, మృతుడి కుటుంబంతోనూ మాట్లాడుతున్నాం' అని ఒమన్లోని భారతీయ ఎంబసీ పేర్కొంది. నౌకపై ఎవరు దాడి చేశారనేది వెల్లడి కాలేదు.

# అమెరికాది ఉగ్రవాదం.. మాది ఆత్మరక్షణ

## ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్

**న్యూయార్క్, సెప్టెంబర్ 24 :** అమెరికా ఉగ్రవాదానికి తమ దేశ ప్రజానీకం బలైందని ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ పేర్కొన్నారు. బుధవారం ఐక్యరాజ్యసమితి సర్వప్రతినిధి సభ సమావేశాన్ని ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. అమెరికా దాడుల్లో మృతి చెందిన ఇరాన్ సుప్రీం లీడర్ ఆయతుల్లా అలీ ఖమేనీ, అగ్రరాజ్య క్షిపణి దాడిలో ప్రాణాలు కోల్పోయిన 150 మంది బడిపిల్లల చిత్రాలను ఆయన తన ప్రసంగం మధ్యలో ప్రదర్శించారు. ఇరాన్‌ను అంతమొందిస్తామంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రసంగించిన మరుసటి రోజే అదే వేదికపై ఆయన మాట్లాడారు. అంతర్జాతీయ న్యాయసూత్రాలను అమెరికా తుంగలో తొక్కిందని పెజెష్కియాన్ ఈ సందర్భంగా ఆరోపించారు. ''ఇరాన్ ఒత్తిడికి తలొగ్గబోదు. మోకాళ్లు వంచే ప్రసక్తే లేదు'' అని స్పష్టం చేశారు. ''మా సుప్రీం నేతను అకారణంగా హతమార్చారు. మా దేశంలోని మినాబ్ స్కూలుపై దాడి చేసి అభం శుభం తెలియని ఆడపిల్లల్ని చంపేశారు. దాడుల నుంచి మమ్మల్ని మేం రక్షించుకుంటున్నాం. మేం ఉగ్రవాదులం కాదు. బాధితులం. అమాయకులైన మా దేశ ప్రజలపై పిరికితనంతో కూడిన దాడులు చేస్తున్నారు. మా శక్తియుక్తులన్నిటినీ కూడగట్టి ఆత్మరక్షణ చర్యలు తీసుకున్నాం. అమెరికా, ఇజ్రాయెల్ దేశాలు మాపై దాడులు చేశాయి. అయితే ఆ దాడులు మా మోకాళ్లు వంచలేవు. ట్రంప్‌తోపాటు మమ్మల్ని బెదిరించాలని కోరుకుంటున్న అందరూ ఒక విషయం అర్థం చేసుకోవాలి. మేము చర్చలకు, దౌత్యానికి, సంప్రదిపులకు సిద్ధంగా ఉన్నాం. కానీ బల ప్రదర్శన పరిభాషను మేం అంగీకరించం'' అని ఇరాన్ అధ్యక్షుడు స్పష్టం చేశారు.

**పెజెష్కియాన్‌తో చర్చలకు ట్రంప్ సిద్ధం**

ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియాన్‌తో న్యూయార్క్‌లో చర్చలు జరపడానికి డొనాల్డ్ ట్రంప్ సిద్ధంగా ఉన్నారని అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో ప్రకటించారు.

# బాన్సువాడలో జర్నలిస్టులకు రెండు రోజుల ప్రత్యేక శిక్షణ

- తెలంగాణ మీడియా అకాడమీ ఆధ్వర్యంలో బాన్సువాడలో సెప్టెంబరు 29, 30 తేదీల్లో శిక్షణ
- సమాచార హక్కు చట్టం, వాస్తవ నిర్ధారణపై అవగాహన, నేర వార్తల కవరేజ్, వార్తా కథనాల రూపకల్పనపై శిక్షణ
- ముగింపు కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ హాజరు



**కామారెడ్డి, సెప్టెంబర్ 24 (మనం ప్రతినిధి):** జర్నలిస్టుల వృత్తి నైపుణ్యాలను పెంపొందించేందుకు తెలంగాణ మీడియా అకాడమీ ఆధ్వర్యంలో బాన్సువాడలో రెండు రోజుల ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు మీడియా అకాడమీ కార్యదర్శి నాగుల్లపల్లి వెంకటేశ్వరరావు తెలిపారు. సెప్టెంబరు 29, 30 తేదీల్లో బాన్సువాడలోని ఎస్.ఆర్.ఎన్.కె. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శిక్షణ కొనసాగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమ ఏర్పాట్లు, శిక్షణలో చర్చించనున్న అంశాలు, జర్నలిస్టులకు అందించనున్న శిక్షణ వివరాలను జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్కు కార్యదర్శి నాగుల్లపల్లి వెంకటేశ్వరరావు, ఛైర్మన్ ఓఎస్డీ రహ్మాన్, మేనేజర్ శైలేష్ రెడ్డి వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ను కలిసి శిక్షణ కార్యక్రమానికి ఆహ్వానించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ ఎన్.వై. గిరి పాల్గొన్నారు.

**నిపుణులతో అవగాహన**

శిక్షణలో సమాచార హక్కు చట్టం, తప్పొప్పుల పరిశీలన, నేర వార్తల కవరేజ్, వార్తా కథనాల రూపకల్పన, వార్తా సేకరణ, వార్తల ప్రాధాన్యత నిర్ణయం, వాస్తవ నిర్ధారణ, మీడియా చట్టాలు-నైతిక నియమాలు తదితర అంశాలపై నిపుణులతో అవగాహన కల్పించనున్నారు. జర్నలిస్టులు ఎదుర్కొంటున్న వృత్తిపరమైన సమస్యలు, అవసరాలను కూడా కార్యదర్శి కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు.

**ముగింపు కార్యక్రమంలో కలెక్టర్**

ముగింపు కార్యక్రమానికి కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ను ఆహ్వానించగా, హాజరై జర్నలిస్టులను ఉద్దేశించి మాట్లాడేందుకు ఆయన సానుకూలంగా స్పందించారు. మారుతున్న జర్నలిజం రంగానికి అనుగుణంగా వృత్తి నైపుణ్యాలను మెరుగుపరచడమే శిక్షణ లక్ష్యమని కార్యదర్శి తెలిపారు.

# స్లీపర్ బస్సులో మంటలు

- 9 మంది సజీవదహనం
- ప్రధాని దిగ్భ్రాంతి..
- రూ.2 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటన



**ఢిల్లీ, సెప్టెంబర్ 24 :** ఉత్తర ప్రదేశ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. గ్రేటర్ నోయిడాలోని యమునా ఎక్స్‌ప్రెస్ వేపై స్లీపర్ బస్సుకు మంటలు అంటుకోవడంతో 9 మంది ప్రాణాలు కోల్పోయారు. పలువురు గాయపడ్డారు. బుధవారం అర్ధరాత్రి చోటు చేసుకున్న ఘటన వివరాలు...

స్లీపర్ టూరిస్ట్ బస్సు ఢిల్లీ నుంచి ఉత్తర్ ప్రదేశ్లోని మహోబావైపు వెళ్తుండగా యమునా ఎక్స్‌ప్రెస్ వే సమీపంలో మంటలు అంటుకున్నాయి. అవి వేగంగా బస్సు అంతా వ్యాపించాయి. ఆ సమయంలో అందులో 40 మందికి పైగా ప్రయాణికులు ఉన్నారని జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. ప్రాణాలు కాపాడుకునేందుకు పలువురు బస్సు నుంచి దూకేశారు. కానీ, ఘటన జరిగినప్పుడు ప్రయాణికులు నిద్రలో ఉండటంతో 9 మంది మంటల్లో చిక్కుకొని దుర్మరణం పాలయ్యారు. మరికొందరు బస్సులో చిక్కుకొన్నారని తెలుస్తోంది. ఒక్కసారిగా తమచుట్టూ మంటలు వ్యాపించడంతో ప్రయాణికుల ఆక్రందనలతో ఆ ప్రాంతమంతా భీతావహంగా మారింది.

బస్సు దగ్ధమవుతోన్న దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. అగ్నిమాపక, ఇతర అత్యవసర సిబ్బంది సహాయక చర్యలు చేపట్టారు. మంటలు వ్యాపించడానికి గల కారణాలు తెలియాల్సి ఉంది. ఈ ఘటనపై ఉత్తర్రప్రదేశ్ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. పరిస్థితిని సమీక్షించారు.

**సిగరెట్ ఎంజాయ్ చేస్తూ కూచున్న డ్రైవర్..**

గ్రేటర్ నోయిడాలో బుధవారం అర్ధరాత్రి సమయంలో జరిగిన బస్సు ప్రమాదం ఎన్నో కుటుంబాల్లో తీవ్ర విషాదాన్ని నింపింది. యమునా ఎక్స్ప్రెస్వేపై బస్సు ప్రయాణిస్తుండగా చెలరేగిన మంటలు.. నిమిషాల వ్యవధిలోనే మొత్తం వ్యాపించాయి. కొందరు బస్సు దూకి ప్రాణాలు దక్కించుకోగా.. ఇంకొందరు మంటల్లో చిక్కుకొని సజీవ దహనమయ్యారు. తొమ్మిది మంది మృతుల్లో ఒక మహిళ కూడా ఉన్నారు.

స్లీపర్ బస్సు (ఖిజ్బ్బుఇఫట ఆఋ)లో షార్ట్ సర్క్యూట్ కారణంగా ఈ ప్రమాదం జరిగి ఉంటుందని తొలుత భావించారు. డ్రైవర్, కండక్టర్ ను అదుపులోకి తీసుకున్నారు. ఎఫ్ఐఆర్ ప్రకారం.. బస్సు ప్రయాణం ప్రారంభించి 33 కి.మీ. దూరం వెళ్లిన తర్వాత డ్రైవర్ క్యాబిన్ నుంచి పొగ రావడాన్ని ప్రయాణికులు గుర్తించారు. కాలుతున్న వాసన వస్తోందని డ్రైవర్, కండక్టర్ను అప్రమత్తం చేశారు. కానీ, వారు పట్టించుకోలేదు, బస్సు ఆపి ఎలాంటి తనిఖీ చేయలేదని వెల్లడించారు. అప్పటికీ కూడా వారిద్దరూ బస్సులో సిగరెటు తాగడం ఆపలేదు. కొద్ది నిమిషాలకే డ్రైవర్ సీట్ వద్ద ఒక్కసారిగా మంటలు ఎగిసిపడ్డాయి. దాంతో భయాందోళనకు గురైన ప్రయాణికులు బస్సు ఆపాలంటూ కేకలు వేశారు. అప్పటికీ కూడా వారు వాహనాన్ని ఆపకపోగా.. బెదిరించారని ప్రయాణికులు వాపోయారు. ఆ తర్వాత బస్సు అంతటా వేగంగా మంటలు వ్యాపించి ప్రాణాలను బలిగొన్నాయి.

రాత్రి సమయం కావడంతో మేమంతా నిద్రపోతున్నాం. బస్సు మంటల్లో చిక్కుకుందని కొందరు మావద్దకు వచ్చి నిద్రలేపారు. మేం వెంటనే కిందికి దిగాం. బస్సు అంతా పొగ అలముకుంది'' అని మరో ప్రయాణికుడు వెల్లడించారు. ''బస్సు మంటల్లో చిక్కుకున్నప్పుడు నా చేతికి ఫోన్ మాత్రమే దొరికింది. దానిని తీసుకొని కిందికి దిగాను. మిగతా వస్తువులన్నీ లోపలే కాలిపోయాయి'' అని ఓ ప్రయాణికురాలు ఆందోళన వ్యక్తంచేశారు. ఈ బస్సు యజమానిది మధ్యప్రదేశ్ అని పోలీసులు గుర్తించారు.

**ప్రధాని దిగ్భ్రాంతి.. రూ.2 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకట..**

ప్రధాని మోడీ దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. మృతుల కుటుంబాలకు రూ.2లక్షల పరిహారం ప్రకటించారు. గాయపడిన వారికి రూ.50 వేలు ఇవ్వనున్నట్లు తెలిపారు. ప్రమాదానికి గురైన బస్సుపై రూ.1.75 లక్షల చలాన్లు పెండింగ్లో ఉన్నాయి. మైనర్ ఈ వాహనాన్ని నడిపినందుకు కూడా గతంలో అపరాధ రుసుం విధించారు.

# మక్కాలో అలర్ట్

**మక్కా, సెప్టెంబర్ 24 :** సౌదీ అరేబియా పౌర రక్షణశాఖ మరోసారి 'డేంజర్ బెల్స్' మోగించింది. పవిత్ర ప్రదేశమైన మక్కా, దాని చుట్టుపక్కల ప్రాంతాల్లో హూతీలు క్షిపణిదాడులకు దిగే అవకాశం ఉందని ముందస్తు హెచ్చరికలు జారీ చేసింది. ఈ మేరకు అక్కడి అధికార మీడియా ఎక్స్లో పోస్టు చేసింది. గత 10 రోజుల వ్యవధిలో ఇలాంటి హెచ్చరికలు జారీ కావడం ఇది రెండోసారి. సౌదీ పశ్చిమతీరంలోని యాన్బు, తాయెఫ్, జెడ్డా, తబూక్ తదితర ప్రాంతాల్లోనూ దాడులకు అవకాశం ఉన్నట్లు వేర్వేరుగా హెచ్చరికలు జారీ అయ్యాయి.

ఇరాన్ కు మద్దతుగా వ్యవహరిస్తున్న హూతీలు మక్కాపై దాడులకు పాల్పడిన నేపథ్యంలో తాజా హెచ్చరికలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. ఇటీవల మక్కాపైకి హూతీలు డ్రోన్ను ప్రయోగించిన సంగతి తెలిసిందే. అది నిషేధిత మక్కా గగనతలంలోకి ప్రవేశించకముందే రాయల్ సౌదీ ఎయిర్ డిఫెన్స్ బలగాలు దానిని అడ్డుకొని, నిర్వీర్యం చేశాయి. మక్కా, దాని చుట్టుపక్కల ప్రాంతాల్లో తొలిసారిగా అలర్ట్ ప్రకటించాయి. అంతకుముందు 2017లో హూతీలు మక్కా నగరాన్ని లక్ష్యంగా చేసుకోవడానికి ప్రయత్నించారు.

# అక్కడ పాటిస్తరు.. ఇక్కడెందుకు ఆచరించరు?

## మారిషస్‌ను శుభ్రంగా పెడుతున్నరు.. మరి భారత్ లో ఎందుకీ దుస్థితి?

**హైదరాబాద్, సెప్టెంబర్ 24 :** పరిసరాల పరిశుభ్రతను పాటించే విషయంలో భారత్, మారిషస్లను పోలుస్తూ ఓ భారతీయ కంటెంట్ క్రియేటర్ చేసిన పోస్టు నెట్టింట వైరల్గా మారింది. మారిషస్లో భారత సంతతి ప్రజలు అధిక సంఖ్యలో ఉన్నారని.. అక్కడివారు స్వచ్ఛతను పాటిస్తుండగా, మరి భారతీయులు ఎందుకు వెనుకబడ్డారని ఆయన ప్రశ్నించారు. మారిషస్లో పర్యటించిన విశాల్ భార్గవ అనే క్రియేటర్.. అక్కడ తనకు ఎదురైన అనుభవాన్ని వీడియోలో పంచుకున్నారు.

మారిషస్ ను పరిశుభ్రంగా ఉంచుతున్న భారతీయులు.. భారత్ విషయంలో ఎందుకు ఆ పని చేయడం లేదు? మారిషస్లో 70 శాతం మంది భారత సంతతికి చెందిన వారే. కానీ, ఆ దేశం చాలా క్లీన్ గా ఉంది. ఎవరూ ఎక్కడపడితే అక్కడ చెత్త వేయరు. చెత్తకుండీలను వాడతారు. బీచులు చాలా శుభ్రంగా ఉంటాయి. అయితే.. అది చాలా చిన్న దేశమని, కేవలం 12 లక్షల జనాభా ఉందని వాదించవచ్చు. మన దేశంలోని గోవాను తీసుకున్నా పరిశుభ్రత అంతంతే. వాస్తవానికి భారతీయులు పౌరస్పృహ లేనివారు కాదు. అయినప్పటికీ.. మన దేశంలో ఎందుకీ దుస్థితి నెలకొంది?'' అని విశాల్ భార్గవ 'ఎక్స్' వేదికగా ప్రశ్నించారు. ఈ వీడియో ఆన్లైన్లో చర్చకు దారితీసింది. భారతీయులు కూడా నిబంధనలు పాటిస్తారని, కానీ అధికార యంత్రాంగం వాటిని కఠినంగా అమలు చేయాల్సి ఉంటుందని ఒకరు పేర్కొన్నారు. జనసంచారం ఎక్కువగా ఉండే ప్రదేశాల్లో మరిన్ని చెత్తబుట్టలను అందుబాటులో ఉంచాలని మరొకరు తెలిపారు. పరిసరాల పరిశుభ్రత అనేది ఇంటినుంచే మొదలుకావాల్సిన పాఠమని.. పెద్దలు చేసినట్లే పిల్లలు కూడా చేస్తారని పలువురు చెప్పారు. పౌర స్పృహను పెంపొందించడంలో పాఠశాలలు ప్రధాన పాత్ర పోషించాలన్నారు.

# బిహార్లో మరో ఘోరం

## నడిరోడ్డుపై బాలికకు వేధింపులు

**పట్నా, సెప్టెంబర్ 24 :** బిహార్లో మైనర్లపై వరుస వేధింపుల ఘటనలు తీవ్ర కలకలం రేపుతున్నాయి. మొన్నటికి మొన్న జముయి జిల్లాలో ఇద్దరు టీనేజర్లపై కొందరు దుండగులు జరిపిన దాష్టీకం దేశవ్యాప్తంగా తీవ్ర దుమారం రేపింది. తాజాగా సమస్తీపుర్ జిల్లాలోనూ ఇలాంటి ఘటన వెలుగుచూసింది. జగత్ సింగ్ పూర్ గ్రామంలో నడిరోడ్డుపై ఓ బాలికను కొందరు వేధించారు. ఇందుకు సంబంధించిన దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్గా మారాయి. ఓ టీనేజీ అమ్మాయి, అబ్బాయి కలిసి రోడ్డుపై నడుచుకుంటూ ఫొటోలు తీసుకుంటుండగా కొందరు ఆకతాయిలు వారిని అడ్డగించారు. అమ్మాయిని చుట్టుముట్టి అసభ్యంగా తాకుతూ లైంగిక వేధింపులకు పాల్పడ్డారు. వీడియో వైరల్ అవడంతో బిహార్ (ఆజీజ్బ్చటర్హ్రీట) పోలీసులు దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నిందితులు అదే గ్రామానికి చెందిన యువకులని, ప్రస్తుతం వారంతా పరారీలో ఉన్నట్లు తెలిపారు. వారి కోసం గాలిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇటీవల జముయి జిల్లాలో స్నేహితులైన ఇద్దరు టీనేజర్లు.. కోచింగ్ సెంటర్కు వెళ్లి వస్తుండగా రోడ్డుపైనే దుండగులు అడ్డగించిన సంగతి తెలిసిందే. బాలికపై లైంగిక దాడి చేశారు. గట్టిగా పట్టుకుని లాక్కెళ్లారు. అభ్యంతరకరంగా తాకారు. దీనికి సంబంధించిన వీడియో వైరల్ కావడంతో రాజకీయ దుమారం రేగింది.





## జాతీయస్థాయి ఫుట్‌బాల్‌కు ఎంపికైన అమూల్య, రూప, అక్షర

నల్లగొండ, సెప్టెంబర్ 24( మనం న్యూస్): ఈనెల 25వ తేదీ నుండి చత్తీస్ గడ్ రాష్ట్రంలో జరుగుతున్న జాతీయస్థాయి జూనియర్ బాలికల ఫుట్‌బాల్ ఛాంపియన్షిప్ టోర్నమెంట్‌కు తెలంగాణ రాష్ట్ర జట్టు తరుపున ఏస్ .అమూల్య, కె .రూప, కె .అక్షర లు ఎంపికైనారని ఉమ్మడి నల్గొండ జిల్లా ఫుట్బాల్ అసోసియేషన్ అధ్యక్షులు బండారు ప్రసాద్, ప్రధాన కార్యదర్శి బొమ్మపాల గిరిబాబు తెలిపారు.ముగ్గురు క్రీడాకారిణీలు అప్పాజీపేట జ్యోతిబాపూలే బాలికల మోడల్ హైస్కూల్ నందు 10వ తరగతి చదువుతున్నారు.
పాఠశాల ప్రిన్సిపల్ అరుణకుమారి వ్యాయామ ఉపాధ్యాయులు మమత, ధనలక్ష్మి, ఉపాధ్యాయులు అందించి సహకారంతో క్రీడాకారిణులు ఫుట్బాల్ క్రీడలో రాణిస్తున్నారు. ఈ సందర్భంగా ఉమ్మడి నల్గొండ జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ పక్షాన తెలంగాణ ఫుట్‌బాల్ అసోసియేషన్ కు కృతజ్ఞతలు తెలిపారు.

## తెలంగాణ గౌడ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడిగా సురిగి రమేష్ గౌడ్



నల్గొండ, సెప్టెంబర్ 24( మనం ప్రతినిధి): గౌడ సంఘ సంక్షేమం కోసం నిరంతరం పాటుపడతానని తెలంగాణ గౌడ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు సురికి రమేష్ గౌడ్ అన్నారు.గురువారం హైదరాబాదులోని ఫిలింనగర్ ఆఫీసులో నల్లగొండ మండలం చందనపల్లి గ్రామానికి చెందిన సురిగి రమేష్ గౌడ్ ను తెలంగాణ గౌడ సంక్షేమ సంఘం నల్లగొండ జిల్లా అధ్యక్షుడి గా నియమిస్తూ జాతీయ అధ్యక్షుడు గట్టు రామచంద్రయ్య గౌడ్ చేతుల మీదుగా నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రమేష్ గౌడ్ మాట్లాడుతూ నా మీద నమ్మకంతో నాకు ఈ అవకాశం ఇచ్చిన జాతీయ అధ్యక్షుడు రామచంద్రయ్య గౌడ్ కి, రాష్ట్ర అధ్యక్షులు మల్లేష్ గౌడ్ కి కృతజ్ఞతలు తెలియజేస్తూ గౌడ సంఘ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు.
ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు గుండాల మల్లేష్ గౌడ్ తంతనపల్లిశంకర్, పెద్ది వెంకటయ్య సురిగి సైదులు, వివిధ జిల్లాల నాయకులు పాల్గొన్నారు.

## బుల్లెట్ ట్రైన్ సాధించేంత వరకు విశ్రమించేది లేదు



సూర్యాపేట టౌన్, సెప్టెంబర్ 24, మనం న్యూస్: సూర్యాపేట కు మొదటి అలైన్మెంట్ ప్రకారం బుల్లెట్ ట్రైన్ సాధించేంత వరకు విశ్రమించేదిలేదని పలువురు ప్రముఖులు ముక్తకంఠంతో నినదించారు. గురువారం బుల్లెట్ ట్రైన్ కొరకు పట్టణంలోని ధర్నా చౌక్ నందు బుల్లెట్ ట్రైన్ సాధన సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 42వ రోజు వర్షాన్ని లెక్కచేయకుండా దీక్షలో పాల్గొన్న వారికి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..... వాణిజ్య కేంద్రంగా సూర్యాపేట అన్ని రంగాలలో ముందంజలో ఉందని, ఎన్నో ఏళ్లుగా ఇక్కడి ప్రజల చిరకాల ఆకాంక్ష రైల్వే సాధనకై ఎదురుచూస్తున్న వారికి మొండి చేయి చూపిస్తూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరిని ఇకనైనా మార్చుకోవాలన్నారు. లేని పక్షంలో ఉద్యమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ దీక్షలో బుల్లెట్ ట్రైన్ సాధన సమితి కమిటీ సభ్యులు పలువురు ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు. దీక్షలో కూర్చున్న వారు, చలమల్ల నరసింహ, వెలుగు వనిత, బూర వెంకటేశ్వర్లు, జర్నలిస్టు లు భూపతి రాములు గౌడ్, కందుకూరి యాదగిరి, ఎర్ర అఖిల్, నాగవెల్లి కరుణాకర్, రవీందర్ నాయక్, యర్కచర్ల శోభారాణి, గాలి రామకృష్ణ, తోట లక్ష్మి నరసింహారావు, పగిళ్ల వెంకన్న లు కూర్చోగా సట్టు నాగయ్య, గుండు శ్రీనివాస్ గౌడ్, నల్లగొండ నాగయ్య లు పాల్గొని సంఘీభావం తెలిపారు.

# ఏరోస్పేస్, రక్షణ రంగాల్లో తిరుగులేని శక్తిగా తెలంగాణ

**సరికొత్త రికార్డులకు వేదిక కానున్న రక్షా ఎక్స్ పో 2026**

**డిసెంబర్ 7 నుంచి 9 వరకు 'భారత్ ఫ్యూచర్ సిటీ'లో సదస్సు**

**గ్లోబల్ దిగ్గజాలకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ప్రత్యేక ఆహ్వానం**




హైదరాబాద్,సెప్టెంబర్ 24(మనం న్యూస్): దేశీయ రక్షణ, ఏరోస్పేస్ రంగాల్లో తెలంగాణ తన సత్తాను మరోసారి ప్రపంచానికి చాటడానికి సిద్ధమవుతోందని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు వెల్లడించారు. డిసెంబర్ 7 నుంచి 9 వరకు హైదరాబాద్‌లోని 'భారత్ ఫ్యూచర్ సిటీ'లో అత్యంత ప్రతిష్టాత్మకంగా జరగనున్న 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ 2026'లో భాగంగా.. 'రక్షా ఎక్స్పో 2026'ను ఘనంగా నిర్వహించనున్నట్లు ఆయన ప్రకటించారు.న్యూఢిల్లీలో జరిగిన ప్రతిష్టాత్మక 'న్యూస్18 డిఫ్కాన్ 2026' సదస్సులో సీఎస్ సంజయ్ జాజు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ప్రపంచ స్థాయి ఏరోస్పేస్, డిఫెన్స్ కంపెనీలు, భారతీయ తయారీదారులు, ఎంఎస్ఎంఈలు, స్టార్టప్‌లు, టెక్నాలజీ డెవలపర్లు ఈ మహా వేదికపైకి వచ్చి తెలంగాణలో ఉన్న అపారమైన అవకాశాలను అందిపుచ్చుకోవాలని సీఎస్ పిలుపునిచ్చారు.

**వ్యాపార వృద్ధికి పక్కా ప్రణాళిక..**

ఈ ఎక్స్పో ప్రధానంగా వ్యాపార వృద్ధి, పారిశ్రామిక భాగస్వామ్యాలపైనే పూర్తి దృష్టి పెట్టనుందని, గ్లోబల్ ఒరిజినల్ ఎక్విప్‌మెంట్ తయారీదారులు (ఓఈఎం), భారతీయ కంపెనీలు, ఎంఎస్ఎంఈలు, స్టార్టప్‌లు, ప్రొక్యూర్‌మెంట్ బృందాల మధ్య ప్రత్యేకంగా బిజినెస్-టు-బిజినెస్ (బీ2బీ) సమావేశాలు, ప్రత్యక్ష చర్చలు జరగనున్నాయని సీఎస్ వెల్లడించారు. దేశీయ, అంతర్జాతీయ సప్లై చైన్‌లలో భారతీయ సరఫరాదారులను అనుసంధానించడానికి, నూతన వెండార్ల అభివృద్ధికి ఈ వేదిక ఎంతగానో దోహదపడుతుందని సీఎస్ స్పష్టం చేశారు. రాష్ట్రంలో తయారీ కేంద్రాలు, గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లు, ప్రత్యేక ఇంజనీరింగ్ టెస్ట్ బెడ్లు, జాయింట్ వెంచర్ల ఏర్పాటుకు ముందుకొచ్చి స్థానిక సరఫరాదారులను భాగస్వాములుగా ఎంపిక చేసుకోవాలని గ్లోబల్ కంపెనీలను ఆయన ప్రోత్సహించారు. పాల్గొనే కంపెనీలకు, కాబోయే వ్యాపార భాగస్వాములకు మధ్య ముందే నిర్ధారించిన సమావేశాలను ఏర్పాటు చేయడానికి మిలిటరీ అటాచ్‌లు, కౌన్సులర్ ట్రేడ్ ఆఫీసులు సైతం సంపూర్ణ సహకారం అందిస్తాయని సీఎస్ వివరించారు.

**ప్రత్యేక ఆకర్షణగా ఎయిర్ షో..**

రక్షా ఎక్స్పో 2026లో ప్రత్యేకంగా ఏరోస్పేస్, డిఫెన్స్ అండ్ స్పేస్ కాంక్లేవ్‌తో పాటు అత్యాధునిక సాంకేతిక ప్రదర్శనలు, కన్నులపండువగా ఎయిర్ షో, లైవ్ డెమోలు నిర్వహించనున్నారు. కంపెనీలు తమ సరికొత్త డ్రోన్లు, కౌంటర్-డ్రోన్ సిస్టమ్స్, అటానమస్ ప్లాట్‌ఫారమ్‌లు, ల్యాండ్-బేస్డ్ రక్షణ పరికరాలను ఇక్కడ ప్రదర్శించవచ్చు. వివిధ దేశాల పెవిలియన్లతో పాటు, భారతీయ ఎంఎస్ఎంఈలు, స్టార్టప్ల కోసం ప్రత్యేక టెక్నాలజీ జోన్లను ఏర్పాటు చేస్తున్నట్లు సీఎస్ తెలిపారు.

రికార్డు స్థాయిలో ఎగుమతుల వృద్ధిగత 2025-26 ఆర్థిక సంవత్సరంలో తెలంగాణ ఏరోస్పేస్, రక్షణ రంగ ఎగుమతులలో ఏకంగా 103 శాతం వృద్ధి సాధించి అద్భుతమైన మైలురాయిని తాకిందని సీఎస్ స్పష్టంచేశారు.రాష్ట్రంలో వ్యూహాత్మక పరిశోధనా సంస్థలు, డిఫెన్స్ పీఎస్యూలు, దాదాపు 1,500 నుంచి 2,000 వరకు ఉన్న ప్రెసిషన్-ఇంజనీరింగ్ ఎంఎస్ఎంఈలతో కూడిన అత్యంత పటిష్టమైన పర్యావరణ వ్యవస్థ ఇక్కడ ఉందని కొనియాడారు. డ్రోన్లు, ఏవియానిక్స్, అధునాతన మెటీరియల్స్,ప్రొపల్షన్, స్పేస్ టెక్నాలజీస్, ఎంఆర్ఓ (మెయింటెనెన్స్, రిపేర్ అండ్ ఓవర్హాల్) రంగాలలో రాష్ట్రం తన సామర్థ్యాలను వేగంగా విస్తరిస్తోందని ఆయన చెప్పారు.ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌కు హాజరుకావాల్సిందిగా, రక్షా ఎక్స్పోను ప్రారంభించాల్సిందిగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇటీవల న్యూఢిల్లీలో కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ను వ్యక్తిగతంగా కలిసి ఆహ్వానించిన విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు.సోర్సింగ్ భాగస్వామ్యాలు, సాంకేతిక సహకారం, భారీ పెట్టుబడులు,దీర్ఘకాలిక వ్యాపార సంబంధాలకు రక్షా ఎక్స్పోను ఒక ఫలితాధారిత పారిశ్రామిక వేదికగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని సీఎస్ పునరుద్ఘాటించారు.

# వృద్ధులను కంటికి రెప్పలా చూసుకోవాలి

**తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేస్తే జీతంలో 15శాతం కోత తప్పదు**

**జిల్లాలో ఘనంగా అంతర్జాతీయ వయోవృద్ధుల వారోత్సవాలు**

**వాల్‌పోస్టర్ ఆవిష్కరించిన కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్**




సూర్యాపేట, సెప్టెంబర్ 24 (మనం ప్రతినిధి): సమాజానికి, కుటుంబానికి మార్గదర్శకులైన వయోవృద్ధులను గౌరవించి, వారిని కంటికి రెప్పలా కాపాడుకోవాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ పిలుపునిచ్చారు. అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం సందర్భంగా జిల్లాలో సెప్టెంబర్ 24 నుంచి అక్టోబర్ 1 వరకు వారం రోజుల పాటు నిర్వహించే వయోవృద్ధుల వారోత్సవాల గోడ పత్రికను గురువారం కలెక్టరేట్లోని వీసీ ఛాంబర్లో కలెక్టర్ ఆవిష్కరించారు. మహిళా, శిశు, దివ్యాంగుల వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సీనియర్ సిటిజన్లతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులను వృద్ధాశ్రమాలకు పంపకుండా, ఇంట్లోనే ఉంచుకొని ప్రేమగా చూసుకోవాలని కుటుంబ సభ్యులకు హితవు పలికారు. వృద్ధుల రక్షణ, ఆర్థిక భద్రత కోసం ప్రభుత్వం తీసుకొచ్చిన తెలంగాణ ఎంప్లాయిస్ అకౌంటబిలిటీ అండ్ మానిటరింగ్ ఆఫ్ పేరెంటల్ సపోర్ట్ చట్టం గురించి వివరించారు. తల్లిదండ్రులను సరిగా చూసుకోకుండా నిర్లక్ష్యం చేసే పిల్లల స్థూల వేతనం నుంచి నేరుగా 15 శాతం లేదా గరిష్టంగా రూ.10 వేల వరకు కట్ చేసి, తల్లిదండ్రుల ఖాతాకు జమ చేసేలా కఠిన నిబంధనలు ఉన్నాయని స్పష్టం చేశారు. వృద్ధుల హక్కులు, చట్టాలపై విస్తృత అవగాహన కల్పించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ప్రజావాణిలో వృద్ధుల నుంచి వచ్చే ఫిర్యాదులను తక్షణమే పరిశీలించి, చట్టప్రకారం న్యాయం చేస్తున్నామన్నారు. సీనియర్ సిటిజన్లకు ఎలాంటి సమస్యలు, ఇబ్బందులు ఎదురైనా ప్రభుత్వం కేటాయించిన ఉచిత టోల్ఫ్రీ నంబర్ 14567 కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ రవీందర్ రెడ్డి, జిల్లా సంక్షేమ అధికారి కె.నరసింహారావు, జిల్లా వైద్యాధికారి వెంకటరమణ, జిల్లా కమిటీ సభ్యులు సీతారామయ్య, జి.విద్యాసాగర్, ఎస్డీ హమీద్ ఖాన్, ఇరిగే కోటేశ్వరి, గజ్జల కృష్ణారెడ్డి, వినోద్ కుమార్, ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

## తుంగతుర్తి పెద్ద చెరువును సందర్శించిన ఆర్డిఓ



- భారీ వర్షాలకు ప్రజల అప్రమత్తంగా ఉండాలి
- ఆర్డిఓ వేణు మాధవరావు



తుంగతుర్తి, సెప్టెంబర్ 24( మనం న్యూస్): తుంగతుర్తిలోని వెలుగుపల్లి రోడ్డుకు ఉన్న పెద్ద చెరువు రాత్రి కురిసిన వర్షానికి అలుగు పోస్తుండడంతో తహశీల్దార్ దయానందంతో కలిసి ఆర్డీవో వేణు మాధవరావు గురువారం పరిశీలించారు. కురుస్తున్న భారీ వర్షాల వల్ల చెరువులు, కుంటలు మత్తడి దూకుతూ అలుగు పారుతున్న ప్రాంతాలను స్థానిక తహసిల్దార్ తో కలిసి ఆర్డిఓ వేణు మాధవరావు సందర్శించారు చెరువు కట్టలకు గండ్లు పడకుండా తగు రక్షణ చర్యలు చేపట్టాలన్నారు. వాగులు చెరువులు, అలుగుల వద్ద ప్రమాదకర పరిస్థితులు ఉన్నందున ప్రజల అప్రమత్తంగా ఉండాలని అధికారులకు సూచించారు .కురుస్తున్న వర్షాలను దృష్టిలో ఉంచుకొని ప్రజలంతా తగు జాగ్రత్తలతో ఉండాలని, ఎవరూ కూడా చేపలు పట్టేందుకు చెరువులు, కుంటల వద్దకు వెళ్ళ వద్దన్నారు. వ్యవసాయ బావుల వద్ద విద్యుత్ స్తంభాలను విద్యుత్ వైర్లను తాకకూడదని రైతులు అప్రమత్తంగా ఉండాలని, శిథిలావస్థలో ఉన్న భవనాల్లో, ఉండవద్దన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ మల్లెపాక సాయిబాబా పాల్గొన్నారు.

# జిల్లా టాపర్ అమూల్యారెడ్డిని సన్మానించిన గవర్నర్

- ప్రభుత్వ పాఠశాలలో చదివి అద్భుత ప్రతిభ
- 587 మార్కులతో సిద్దిపేట జిల్లా టాపర్గా అమూల్యారెడ్డి
- రూ.2 లక్షల నగదు బహుమతి అందజేసిన గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా



సిద్దిపేట, సెప్టెంబర్ 24 (మనం ప్రతినిధి): పట్టుదలతో కష్టపడి చదివే విద్యార్థులకు ప్రోత్సాహం లభిస్తే మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారనే సందేశాన్ని నర్మెట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని అమూల్యారెడ్డి నిరూపించారు. పదో తరగతి పరీక్షల్లో 587 మార్కులు సాధించి సిద్దిపేట జిల్లా స్థాయిలో ప్రథమ ర్యాంక్ సాధించిన అమూల్యారెడ్డిని గురువారం శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర గవర్నర్ శ్రీ శివ ప్రతాప్ శుక్లా చేతుల మీదుగా అమూల్యారెడ్డికి రూ.2,00,000 నగదు బహుమతి అందజేశారు. నర్మెట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యాభ్యాసం కొనసాగిస్తు అమూల్యారెడ్డి 587 మార్కులతో జిల్లా స్థాయిలో ప్రథమ స్థానాన్ని సాధించడం పాఠశాలకే కాకుండా నర్మెట ప్రాంతానికి, సిద్దిపేట జిల్లాకు గర్వకారణంగా నిలిచింది. సరైన మార్గదర్శకత్వం, ఉపాధ్యాయుల ప్రోత్సాహం, తల్లిదండ్రుల సహకారం, నిరంతర కృషితో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు అత్యున్నత ఫలితాలు సాధించగలరని అమూల్యారెడ్డి విజయం నిరూపించింది.

**తల్లిదండ్రుల ఉపాధ్యాయుల ప్రోత్సాహంతోనే**

అమూల్యారెడ్డి విజయానికి తల్లిదండ్రుల ప్రోత్సాహంతో పాటు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయుల మార్గదర్శకత్వం కీలకంగా నిలిచింది. విద్యార్థి ప్రతిభను గుర్తించి ప్రోత్సహిస్తూ, పరీక్షలకు సన్నద్ధం చేయడంలో ఉపాధ్యాయులు అందించిన సహకారం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు. విద్యార్థిని సాధించిన ఫలితంతో తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు. తమ కుమార్తె జిల్లా స్థాయిలో ప్రథమ ర్యాంక్ సాధించి, గవర్నర్ చేతుల మీదుగా సన్మానం పొందడం పట్ల గర్వంగా ఉందని తెలిపారు.

**గవర్నర్ చేతుల మీదుగా సత్కారం**

ప్రభుత్వ పాఠశాలలో చదివి మంచి ర్యాంకు సాధించిన అమూల్య రెడ్డిని గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా అభినందించారు. ఆమె తల్లిదండ్రులు, జడ్పీహెచ్ఎస్ నర్మెట ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులను కూడా ప్రత్యేకంగా అభినందించారు. విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకుని క్రమశిక్షణతో చదివితే ఉన్నత విజయాలను సాధించవచ్చని ఈ సందర్భంగా పలువురు పేర్కొన్నారు. అమూల్యారెడ్డి సాధించిన విజయం తోటి విద్యార్థులకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని అన్నారు. విద్యార్థుల ప్రతిభను గుర్తించి సన్మానించడం, నగదు బహుమతులతో ప్రోత్సహించడం వారి ఆత్మవిశ్వాసాన్ని పెంచుతుందని విద్యావేత్తలు పేర్కొన్నారు. ఈ తరహా ప్రోత్సాహక కార్యక్రమాలు మరింత మంది విద్యార్థులు విద్యలో రాణించేందుకు ప్రేరణగా నిలుస్తాయని అన్నారు. అమూల్యారెడ్డికి అందించిన రూ.2 లక్షల నగదు బహుమతి ఆమె ఉన్నత విద్యాభ్యాసానికి ఉపయోగ పడటంతో పాటు, గ్రామీణ ప్రాంతాల్లోని అనేక మంది విద్యార్థులకు ఒక ప్రేరణగా నిలవనుందని పలువురు అభిప్రాయపడ్డారు. జిల్లా స్థాయిలో ప్రథమ ర్యాంక్ సాధించడం పట్ల నర్మెట గ్రామస్తులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. అమూల్యారెడ్డి విజయం పాఠశాల విద్యార్థుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపింది. వనరులు పరిమితమైనా.. లక్ష్యం గొప్పదైతే విజయం సాధ్యమే అన్న సందేశాన్ని అమూల్యారెడ్డి తన ప్రతిభతో చాటిచెప్పారు. ఆమె భవిష్యత్తో మరిన్ని ఉన్నత విజయాలు సాధించి తల్లి దండ్రులకు, ఉపాధ్యాయులకు, నర్మెట పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని పలువురు ఆకాంక్షించారు.

## బీజేపీలో భారీ సంస్థాగత మార్పులు

- తెలంగాణ సంయుక్త ప్రధాన కార్యదర్శిగా దశరథ్
- ఇరు రాష్ట్రాల బీజేపీ ప్రధాన కార్యదర్శిగా మధుకర్..

హైదరాబాద్, మనం ప్రతినిధి : బీజేపీ తమ సంస్థాగత నిర్మాణంలో భారీ మార్పులకు శ్రీకారం చుట్టింది. దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాలకు కొత్త సంస్థాగత ప్రధాన కార్యదర్శులు, సంయుక్త ప్రధాన కార్యదర్శులను నియమించింది. ఈ క్రమంలో తెలంగాణ, ఏపీలకు కూడా కొత్త బాధ్యులను కేటాయించింది. ఈ నియామకాలు తక్షణమే అమల్లోకి వస్తాయని పార్టీ కేంద్ర కార్యాలయం గురువారం ఒక ప్రకటనలో వెల్లడించింది. తెలంగాణ, ఏపీ రాష్ట్రాల ఉమ్మడి సంస్థాగత ప్రధాన కార్యదర్శిగా మధుకర్‌ను నియమించారు. ఆయన హైదరాబాద్ కేంద్రంగా పార్టీ కార్యకలాపాలను పర్యవేక్షిస్తారు. అదేవిధంగా, తెలంగాణ రాష్ట్ర సంయుక్త సంస్థాగత ప్రధాన కార్యదర్శిగా వరంగల్ కేంద్రంగా పనిచేసేందుకు దశరథ్కు బాధ్యతలు అప్పగించారు. ఈ మార్పుల ద్వారా తెలుగు రాష్ట్రాల్లో పార్టీ సంస్థాగత నిర్మాణాన్ని మరింత బలోపేతం చేయడంపై అధిష్టానం దృష్టి సారించినట్లు స్పష్టమవుతోంది. జాతీయ స్థాయిలోనూ పలు కీలక నియామకాలు జరిగాయి. జాతీయ సంయుక్త ప్రధాన కార్యదర్శిగా శివప్రకాశ్ను నియమించగా, ఆయనకు ఆంధ్రప్రదేశ్తో పాటు మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఛత్తీస్గఢ్, గోవా రాష్ట్రాల బాధ్యతలు అప్పగించారు. ఆయన ముంబై కేంద్రంగా పనిచేస్తారు. మరో జాతీయ సంయుక్త ప్రధాన కార్యదర్శిగా సౌదాన్ సింగ్ను నియమించి, బీహార్, ఝార్ఖండ్, ఒడిశా, పశ్చిమ బెంగాల్ బాధ్యతలను కేటాయించారు. ఇక ఇతర రాష్ట్రాల విషయానికొస్తే.. మహారాష్ట్రకు అజయ్ జమ్వాల్, బీహార్కు భిఖూభాయ్ దల్సానియా, ఝార్ఖండ్కు పవన్ సాయి, గుజరాత్కు రత్నాకర్, ఉత్తరాఖండ్కు ఫణీంద్రనాథ్ శర్మ, పంజాబ్-చండీగఢ్‌కు మంత్రి శ్రీనివాసులు, ఉత్తరప్రదేశ్కు ధరమ్పాల్, పశ్చిమ బెంగాల్‌కు అమితాబ్ చక్రవర్తిని రాష్ట్ర సంస్థాగత ప్రధాన కార్యదర్శులుగా నియమించారు. అసోం, త్రిపుర రాష్ట్రాలకు రవీంద్ర రాజు, హిమాచల్ ప్రదేశ్‌కు సిద్ధార్థన్, ఢిల్లీ-హర్యానాకు పవన్ రాణా, ఛత్తీస్‌గఢ్‌కు కరమ్వీర్, మధ్యప్రదేశ్‌కు చంద్రశేఖర్, ఒడిశాకు మానస్ మహంతిని నియమిస్తూ బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నియామకాలకు సంబంధించిన సర్క్యులర్ను పార్టీ జాతీయ ప్రధాన కార్యాలయ ఇన్ చార్జ్ తరుణ్ చుగ్ అన్ని రాష్ట్ర శాఖలకు పంపించారు.

# ఎన్నికల సంఘం నిరంకుశంగా మారుతున్నది?

- ప్రజాస్వామ్యాన్ని కాపాడాల్సిన వారే ఇలా వ్యవహరిస్తారా? : కేటీఆర్
- తొలి వికెట్ పడింది
- త్వరలో మరిన్ని వికెట్లు పడతయ్?
- దానం అన్హరతపై కేటీఆర్ ట్వీట్

హైదరాబాద్, మనం ప్రతినిధి : ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్యంగా చెప్పుకునే భారత్‌లో ప్రజాస్వామ్యాన్ని కాపాడాల్సిన ఎన్నికల సంఘం తీరు దాదాపు నియంతృత్వ ధోరణిలోకి వెళ్తున్నదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆందోళన వ్యక్తం చేశారు. ముగ్గురు ఎన్నికల కమిషనర్లలో ఇద్దరు పదేపదే అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నప్పుడు, ఎన్నికల సంఘం పనితీరును సరిదిద్దాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. ముగ్గురిలో ఇద్దరు ఒక నిర్ణయానికి వ్యతిరేకంగా ఉన్నప్పుడు అది మెజారిటీ కాదా? ఇప్పటివరకు మెజారిటీ అంటే ఇదే కదా?. ఇప్పుడు దాని నిర్వచనం కూడా మారుతున్నట్టుందని ఆయన పేర్కొన్నారు. ఓటర్ల నమోదు, తొలగింపు, తొలగించిన ఓట్లను తిరిగి చేర్చడం వంటి అంశాల్లో సందేహాలకు తావిచ్చేలా నిర్ణయాలు తీసుకుంటే, 'అసలు మనం ఇంకా ప్రజాస్వామ్యంలోనే ఉన్నామా? అంటూ అనుమానం వ్యక్తం చేశారు. దేశ భవిష్యత్తును ప్రజాస్వామ్య పరిరక్షణ బాధ్యత ఉన్న సంస్థ పునాదులే బలహీనపడుతున్న పరిస్థితిలో దాని నిర్ణయాలకు వదిలేయలేమని అన్నారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు రాజకీయ పార్టీలు, రాజ్యాంగ సంస్థలు, పౌర సంఘాలు, ముఖ్యంగా సుప్రీంకోర్టు కలిసి ముందుకు రావాలని ఆయన ఆకాంక్షించారు. తెలంగాణలో ఓట్ల తొలగింపుపైనా కేటీఆర్ తీవ్రంగా స్పందించారు. 'తెలంగాణలో అత్యధిక ఓట్ల తొలగింపులు బీఆర్ఎస్ గెలిచిన స్థానాల్లోనే ఉండటం ఆశ్చర్యం కలిగించలేదా?' అని ప్రశ్నించారు. తెలంగాణలో ప్రస్తుతం ఒకే పోరాటం జరుగుతున్నదని, అది 'కేసీఆర్ వర్సెస్ అందరూ' అని కేటీఆర్ పేర్కొన్నారు. బీఆర్ఎస్‌ను ఓడించేందుకు కాంగ్రెస్, బీజేపీలు కలిసి అనైతిక, అక్రమ, బహిరంగంగా ప్రకటించని కుమ్మక్కుకు పాల్పడ్డాయని ఆరోపించారు. ఇప్పుడు ఆ కుమ్మక్కులోకి ఎన్నికల సంఘం కూడా చేరుతున్నట్టుగా కనిపిస్తున్నదని వ్యాఖ్యానించారు. ఈ వ్యవహారంపై బీఆర్ఎస్ న్యాయస్థానాల్లోనూ, ప్రజల మధ్యనూ పోరాడుతుందని స్పష్టం చేశారు. చట్టవిరుద్ధంగా తొలగించిన ప్రతి ఓటును తిరిగి చేర్పిస్తామని ప్రకటించారు. చివరగా ఆయన తన రాజకీయ సందేశాన్ని మరోసారి స్పష్టం చేస్తూ తెలంగాణలో ఒకే ఒక్క 'సార్' ఉన్నారు అని అది కేసీఆర్ సార్ అని, ప్రజలకు ఆయనపై ఉన్న ప్రేమను ఏ 'ఎస్ఐఆర్' కూడా ఓడించలేదు' అని కేటీఆర్ ఈ సందర్భంగా పేర్కొన్నారు. తొలి వికెట్ పడింది, త్వరలో మరిన్ని వికెట్లు పడతయ్?.. దానం అన్హరతపై కేటీఆర్ ట్వీట్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అనర్హతపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై కేటీఆర్ సంచలన ట్వీట్ చేశారు. ఒక వికెట్ పడింది. త్వరలో మరికొన్ని వికెట్లు పడుతాయని జోస్యం చెప్పారు. దానం నాగేందర్ బీఆర్ఎస్ టికెట్‌పై పోటీ చేసి గెలుపొందిన తరువాత కాంగ్రెస్‌లో చేరడంపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి, బీజేపీ ఎమ్మెల్యే హైకోర్టులో కేసు దాఖలు చేశారు. పార్టీ ఫిరాయింపుల చట్టం ప్రకారం దానంపై అనర్హత వేయాలని కోర్టును కోరారు. దాదాపు రెండు సంవత్సరాల పైగా ఇరువాదనలు విన్న హైకోర్టు.. ఇటీవల దానంపై అనర్హత వేసింది. అనర్హత చెల్లదని సుప్రీంకోర్టులో దానం నాగేందర్ పిటిషన్ వేయగా... ఎట్టకేలకు గురువారంనాడు ఆ పిటిషన్‌ను పరిశీలించింది. ఈ విషయంలో హైకోర్టు ఇచ్చిన తీర్పును సమర్థించడంతో ఖైరతాబాద్ నియోజకవర్గానికి ఉప ఎన్నిక ఖయామంటూ తీర్పునివ్వడంపై కేటీఆర్ ఈ సందర్భంగా హర్షం వ్యక్తం చేశారు.

# సహజసిద్ధ వాతావరణాన్ని పరిరక్షిస్తూ మల్లూరు ఆలయాన్ని అభివృద్ధి చేయాలి



- ఆలయ విశిష్టత, స్వామివారి గొప్పతనం ప్రతిబింబించేలా మాస్టర్ ప్లాన్
- భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తూ ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలి
- మంత్రి దనసరి అనసూయ సీతక్క

**మంగపేట, సెప్టెంబర్ 24, మనం ప్రతినిధిః** మల్లూరు శ్రీ హేమాచల లక్ష్మీనరసింహస్వామి ఆలయ పరిసరాల్లోని సహజసిద్ధ వాతావరణాన్ని పరిరక్షిస్తూ, క్షేత్ర విశిష్టత ప్రతిబింబించేలా సమగ్ర అభివృద్ధి ప్రణాళికలను రూపొందిస్తున్నామని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క అన్నారు. గురువారం మంగపేట మండలం మల్లూరు శ్రీ హేమాచల లక్ష్మీనరసింహస్వామి వారిని మంత్రి అనసూయ సీతక్క, జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు తో కలిసి దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ అభివృద్ధి, మాస్టర్ ప్లాన్, చేపట్టాల్సిన పనులపై జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు, దేవాదాయ శాఖ అధికారులతో మంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ ఆలయ అభివృద్ధి పనులతో ఎవరికీ నష్టం జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మల్లూరు క్షేత్రంలోని దట్టమైన అడవులు, వందల ఏళ్ల నాటి వృక్షాలు, స్వచ్ఛమైన గాలి, సహజ జలవనరులతో కూడిన ఆహ్లాదకర వాతావరణం ఎంతో అరుదైనదని పేర్కొన్నారు. ఇటువంటి ప్రకృతి సంపదను కొత్తగా నిర్మించలేమని, ఎంత ఖర్చు చేసినా కొనుగోలు చేయలేమని తెలిపారు. ఆలయ పరిసరాల్లోని సహజత్వానికి ఎలాంటి విఘాతం కలగకుండా అభివృద్ధి పనులు చేపట్టాలని సూచించారు. భక్తుల అవసరాలు, భవిష్యత్తులో పెరిగే రద్దీని దృష్టిలో ఉంచుకుని తాగునీరు, పారిశుద్ధ్యం, విశ్రాంతి ప్రదేశాలు, వాహనాల నిలుపుదల, రాకపోకలకు అనువైన మార్గాలు వంటి సౌకర్యాలకు మాస్టర్ ప్లాన్లో ప్రాధాన్యం చేస్తున్నట్లు తెలిపారు. ఆలయ చరిత్ర, పురాణ నేపథ్యం, స్వామివారి విశిష్టతను భక్తులకు తెలియజేసేలా ఆకర్షణీయమైన శిల్పాలు, విగ్రహాలు ఏర్పాటు చేయాలని మంత్రి సూచించారు. క్షేత్ర గొప్పతనం ప్రతి ఒక్కరికీ అర్థమయ్యేలా ఆధ్యాత్మికత ఉట్టిపడే విధంగా మాస్టర్ ప్లాన్ను అద్భుతంగా ఆవిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రకృతి సంపదను కాపాడుతూనే భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించి, మల్లూరు క్షేత్రాన్ని ప్రముఖ ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టాలని మంత్రి సీతక్క స్పష్టం చేశారు. రానున్న గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని ఆలయ మండపం విస్తరణ పనులకు ప్రాధాన్యం ఇవ్వాలని, భక్తుల సౌకర్యార్థం వసతి గదులు, కల్యాణ మండపం, ఇతర మౌలిక సదుపాయాల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రణాళికాబద్ధంగా పనులు చేపట్టాలని ఆదేశించారు. అంతకుముందు ఆలయ ప్రాంగణంలో నూతనంగా నిర్మించనున్న గోశాలకు జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావుతో కలిసి మంత్రి సీతక్క భూమిపూజ చేసి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అటవీ శాఖ అధికారి వికాస్ మీనా, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు, మార్కెట్ కమిటీ చైర్పర్సన్ రేగ కళ్యాణి, ఆలయ ఈ ఓ వీరస్వామి,తహసిల్దార్ రవీందర్, స్థానిక ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# చిన్నారులకు నాణ్యమైన విద్యను అందించడమే లక్ష్యం

అడవిలోనూ అద్భుత ప్రతిభ.. పట్టణ విద్యార్థులకు దీటుగా మామిడిగూడెం చిన్నారులు

ఉత్తమ గురువులు... విద్యార్థులను ఉన్నత శిఖరాలకు చేర్చగలరు

మంత్రి దనసరి సీతక్క



**మంగపేట,సెప్టెంబర్ 24,మనం ప్రతినిధిః** మారుమూల గిరిజన గూడాల్లోని చిన్నారులకు విద్యను చేరువ చేసి, నాణ్యమైన విద్యావకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క అన్నారు. గురువారం ఏటూరునాగారం మండలం మామిడిగూడెం గ్రామంలో సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ సమకూర్చిన 15 లక్షల సి.ఎస్.ఆర్. నిధులతో ఏర్పాటు చేసిన కంటైనర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను, కొమరం భీమ్నగర్ కాలనీలో పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో రూ.5 లక్షల సి.ఎస్.ఆర్. నిధులతో ఏర్పాటు చేసిన మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావుతో కలిసి మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ దేశంలో ఎక్కడ పుట్టినా, ఎక్కడ పెరిగినా ప్రతి చిన్నారికి చదువుకునే అవకాశం ఉండాలన్నారు. పాఠశాలలు, రహదారులు, విద్యుత్ సౌకర్యం లేని మారుమూల అటవీ ప్రాంతాల్లోనూ విద్యకు ఆటంకం కలగకుండా అవసరమైన చోట కంటైనర్ పాఠశాలలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

గుత్తికోయ ఆదివాసీ గూడెమైన మామిడిగూడెంలో పరిమిత సౌకర్యాల మధ్య విద్యార్థులు ప్రదర్శిస్తున్న ప్రతిభ ఎంతో ఆనందాన్ని కలిగించిందన్నారు. తెలుగు, ఆంగ్ల భాషల్లో పాటలు, కథలు, సంభాషణలతో విద్యార్థులు ఆకట్టుకున్నారని ప్రశంసించారు. పట్టణ ప్రాంతాల విద్యార్థులకు దీటుగా గిరిజన చిన్నారులను తీర్చిదిద్దుతున్న ఉపాధ్యాయులు ఇర్ప మధు, సారంగం సేవలను మంత్రి ప్రత్యేకంగా అభినందించారు. పట్టుదల కలిగిన గురువు విద్యార్థుల జీవితాలను మార్చగలరని, దేశానికి గొప్ప శాస్త్రవేత్తలు, విద్యావంతులు, ఉన్నత వ్యక్తులను అందించగల శక్తి ఉపాధ్యాయుల చేతుల్లోనే ఉందన్నారు. విద్యార్థుల కోసం సమయాన్ని కేటాయిస్తూ సరైన మార్గదర్శనం అందించే గురువులు వారి జీవితాల్లో శాశ్వత ముద్ర వేస్తారని మంత్రి పేర్కొన్నారు. జిల్లాలో విద్యావ్యవస్థ బలోపేతానికి పాఠశాలలను నిరంతరం పర్యవేక్షిస్తున్న జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు, జిల్లా విద్యాశాఖాధికారి ఎ. సిద్ధార్థరెడ్డి, విద్యాశాఖ అధికారుల కృషిని మంత్రి అభినందించారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రతిరోజూ పాఠశాలకు పంపించి, వారి చదువుకు పూర్తి సహకారం అందించాలని కోరారు. మామిడిగూడెంలో త్వరలో బోరు మంజూరు చేసి తాగునీటి సదుపాయం కల్పించడంతోపాటు సౌర విద్యుత్ ఏర్పాటుకు చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. మంజూరైన రహదారుల నిర్మాణానికి అటవీ అనుమతులు పొందేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు. అటవీశాఖ సహకారంతో అంబులెన్సులు, ద్విచక్ర వాహనాలు రాకపోకలు సాగించేలా మార్గాలను అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని మంత్రి వెల్లడించారు.

అంతకుముందు పాఠశాల విద్యార్థులతో మంత్రి ముఖాముఖిగా మాట్లాడి వారి చదువు, పాఠశాలలో అందుతున్న సౌకర్యాల గురించి తెలుసుకున్నారు. జిల్లా కలెక్టర్తో కలిసి విద్యార్థులకు ఏకరూప దుస్తులు, బూట్లు పంపిణీ చేశారు. అనంతరం చిన్నారులతో కలిసి అల్పాహారం చేశారు. ఈ కార్యక్రమాల్లో ఏటూరునాగారం అదనపు ఎస్పీ మనన్ భట్, మార్కెట్ కమిటీ చైర్పర్సన్ రేగ కళ్యాణి, జిల్లా విద్యాశాఖాధికారి ఎ. సిద్ధార్థరెడ్డి, ఆత్మ కమిటీ చైర్మన్ రఘు, ఉల్లాస్ సమన్వయకర్త కృష్ణబాబు, తహసీల్దార్, మండల విద్యాధికారి, మండల పరిషత్ అభివృద్ధి అధికారి, స్థానిక ప్రజాప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# గ్రామాల సమగ్రాభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా పనిచేయాలి

గ్రామసభల తీర్మానాల మేరకే అభివృద్ధి పనులు చేపట్టాలి

తాగునీరు, రహదారులు, ఉపాధి హామీ పనులపై ప్రత్యేక దృష్టి సారించాలి

సంక్షేమ పథకాలు అర్హులందరికీ సకాలంలో అందాలి: మంత్రి సీతక్క



**మంగపేట, సెప్టెంబర్ 24(మనం ప్రతినిధి):** గ్రామాల్లో ప్రజల అవసరాలను గుర్తించి ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి పనులు చేపట్టాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం మంగపేట మండల కేంద్రంలోని రైతు వేదికలో నిర్వహించిన కార్యక్రమంలో మండల పరిధికి చెందిన 23 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల కింద మంజూరైన చెక్కులను మంత్రి అనసూయ సీతక్క పంపిణీ చేశారు. అనంతరం మండల స్థాయి అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, అభివృద్ధి పనుల పురోగతి, గ్రామాల్లో ప్రజలకు అందుతున్న సేవలు, పంచాయతీ నిధుల వినియోగంపై సమీక్షించి అధికారులకు దిశానిర్దేశం చేశారు.

ఈ సందర్భంగా మంత్రి అనసూయ సీతక్క మాట్లాడుతూ గ్రామాల్లో చేపట్టాల్సిన పనులను గ్రామసభల ద్వారా గుర్తించి తీర్మానాలు చేయాలని సూచించారు. పనుల అవసరాన్ని, ప్రాధాన్యతను ప్రజల సమక్షంలో నిర్ణయించాలని, చేపట్టిన పనుల వివరాలను గ్రామసభలకు తెలియజేయాలని ఆదేశించారు. ప్రజలకు అత్యవసరమైన పనులకే తొలి ప్రాధాన్యం ఇవ్వాలని స్పష్టం చేశారు. తాగునీటి ట్యాంకుల మరమ్మతులు, పైపులైన్ల ఏర్పాటు, ఇతర తాగునీటి పనులను వేగంగా చేపట్టి ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. మిషన్ భగీరథ పనుల పురోగతిపై ప్రత్యేక దృష్టి సారించి తాగునీటి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద గ్రామాలకు ఉపయోగపడే పనులను గుర్తించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. వాగులపై చెక్డ్యామ్లు, వ్యవసాయ కుంటలు, భూగర్భ జలాల పెంపునకు బోరుబావుల వద్ద ఇంకుడు గుంతలు నిర్మించాలని సూచించారు. అవసరమైన ప్రాంతాల్లో రహదారులు, సీసీ రోడ్ల నిర్మాణ పనులను పూర్తి చేయాలని తెలిపారు. గ్రామాన్ని కన్నతల్లిలా భావించి పంచాయతీ కార్యదర్శులు బాధ్యతతో పనిచేయాలని మంత్రి సూచించారు. గ్రామాల్లోని ప్రతి సమస్యపై అవగాహన కలిగి ఉండాలని, ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని చెప్పారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికతోపాటు గ్రామాభివృద్ధి పనులకు సంబంధించిన తీర్మానాలను పారదర్శకంగా రూపొందించాలని ఆదేశించారు.

కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు పేద కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పిస్తున్నాయని మంత్రి తెలిపారు. అర్హులైన లబ్ధిదారులు ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీని శుక్రవారం నుంచి చేపట్టాలని అధికారులను ఆదేశించారు. రేషన్ కార్డులు లేని అర్హులకు దరఖాస్తు విధానంపై అవగాహన కల్పించాలని సూచించారు. పింఛన్ దరఖాస్తులను త్వరగా పరిశీలించి ఉన్నతాధికారులకు పంపాలని, అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్ అందేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్రావు, మార్కెట్ కమిటీ చైర్పర్సన్ రేగ కళ్యాణి, పంచాయతీరాజ్ డైరెక్టర్ సోమయ్య, మండల ప్రత్యేక అధికారి డీపీవో వెంకయ్య, జిల్లా ఆత్మ చైర్మన్ చిటమట రఘు, కర్ల అరుణ,తహసీల్దార్ తోట రవీందర్, ఎంపీడీవో బద్రు, వివిధ గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు..

# ఓయో.. నిఖిత మృతి కేసులో బిగ్ ట్విస్ట్

## పోలీసుల గాలింపు.. భయంతో ఆత్మహత్యకు పాల్పడ్డ నిందితుడు

**హైదరాబాద్, మనం ప్రతినిధి :** హైదరాబాద్ మాదాపూర్ ఓయో హోటల్లో విశాఖకు చెందిన నిఖిత అనుమానాస్పద మృతి కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో ప్రధాన అనుమానితుడిగా ఉన్న శ్రీనివాస రవితేజ ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అనకాపల్లి జిల్లా పరవాడ మండలంలోని తన స్వగ్రామం ఏడుమెట్ల మర్రిపాలెంలో తన ఇంట్లో రవితేజ ఫ్లోర్ క్లీనింగ్ లిక్విడ్ తాగి ఆత్మహత్యకు యత్నించాడు. దీనిని గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే అతడిని స్థానిక ఆసుపత్రికి తరలించారు. ఆ తర్వాత పరిస్థితి విషమించడంతో విశాఖపట్నంలోని కేజీహెచ్ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం కేజీహెచ్లో రవితేజకు వైద్యులు చికిత్స అందిస్తుండగా అతడి పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నట్లు సమాచారం. ఈ ఘటనపై పరవాడ పోలీసులు మాదాపూర్ పోలీసులకు సమాచారం అందించారు.

**కేసు నేపథ్యం:**

విశాఖపట్నానికి చెందిన నిఖిత, రవితేజలు సెప్టెంబర్ 21న మాదాపూర్ సిద్ధిఖీనగర్ ఓయో హోటల్లో గది తీసుకున్నారు. మరుసటి




రోజు తెల్లవారుజామున నిఖిత అపస్మారక స్థితిలోకి వెళ్లడంతో కొండాపూర్ అపోలో ఆసుపత్రికి తరలించగా, ఆమె అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. అయితే, నిఖిత ముఖం, తలపై తీవ్ర గాయాలుండటం, హోటల్ గదిలో గోడలు, బెడ్పై రక్తపు మరకలు, మద్యం సీసాలను గుర్తించిన క్లూస్ టీమ్.. ఇది హత్యేనని అనుమానాలు వ్యక్తం చేశారు. ఆసుపత్రిలో నిఖిత మరణించిందని తెలిసిన వెంటనే రవితేజ అక్కడి నుంచి పరారై, ఫోన్ స్విచ్ఛాఫ్ చేశాడు. గాలింపు చర్యలు చేపడుతున్న సమయంలో స్వగ్రామంలో ఆత్మహత్యాయత్నం చేశాడు. అయితే, ఈ కేసుపై ఫోరెన్సిక్ నివేదికలు, సీసీటీవీ ఫుటేజీ ఆధారంగా మాదాపూర్ పోలీసులు దర్యాప్తును వేగవంతం చేశారు.

# లడ్డు వేలం పాటలో 9116లకు లడ్డును కైవసం చేసుకున్న షరీఫ్



**దుగ్గొండి, సెప్టెంబర్ 24 మనం ప్రతినిధి:** మండలంలోని తిమ్మంపేట గ్రామంలో స్టార్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన గణపతి నవరాత్రి ఉత్సవాల్లో లడ్డును వేలంపాటలో లడ్డును రు.9116 రూపాయలకు ముస్లిం కుటుంబానికి చెందిన ఎస్కే షరీఫ్ కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా షరీఫ్ మాట్లాడుతూ లడ్డును కైవసం చేసుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. వినాయక పండుగ సందర్భంగా అందరూ సుఖ సంతోషాలతో ఉండాలన్నారు . ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు భాష బోయిన సురేష్, వేణు,నరేష్, రాజేందర్, రాజు, రవి, ఎల కంటి కుమారస్వామి, మధుసూదన్, మహేష్, దండు రాజు పాల్గొన్నారు.

# ఊర పోచమ్మ దేవాలయ కమిటీ ఎన్నిక



**టేకుమట్ల సెప్టెంబర్ 24 మనం న్యూస్ః** దుబ్యాల గ్రామంలో ఊరపోచమ్మ దేవాలయ నూతన కమిటీని గురువారం నాడు ఎన్నుకున్నారు. సంగి చంద్రయ్య అధ్యక్షులు గస్కంటి సంపత్ ఉపాధ్యక్షులు బండారి వినోద్ కుమార్ ఉపాధ్యక్షులు సంగి సంపత్ ప్రధాన కార్యదర్శి సంగి మహేందర్ సంయుక్త సలహాదారుడు ధన్యం పెల్లి సతీష్ కోశాధికారి ఆర్ ముళ్ళ రాజు సాంస్క ృతిక శాఖ సంగి ఐలయ్య గుడి పరిశుభ్రత శాఖ మోరే రాములు గుడి పరిశుభ్రత శాఖ సంఘీ సమ్మయ్య సలహాదారు లు సంగి నాగేష్ ప్రచారకర్త ఆరుముల్ల రాజు ప్రచారకర్త ఈ కమిటీకి గ్రామ సహకరించిన పెద్దలు టేకుమట్ల మాజీ ఎంపీటీసీల ఫోరం అధ్యక్షులు సంగి రవి ఆరుముల్ల బంగారి సంగి రాజయ్య సంగీ సమ్మయ్య సంగీ లింగయ్య సంఘీ శంకర్ ఆర్ముల్లా వెంకటయ్య సంగీ నరసయ్య మోరే రాజయ్య మోరే సమ్మయ్య గసిగంటి రవి సంగీ సంపత్ గస్గంటి అశోక్ సంగి శంకర్ గసిగంటి రాజయ్య గస్గంటి సర్వోత్తమ్ సంగీ రాజశేఖర్ పడిదెల శ్రీనివాస్ మియాపురం వెంకటేశ్వర్లు గస్గంటి సారయ్య సంగి కుమార్ సంగి మల్లయ్య సంగి రాజేందర్ గాసికంటి పైడయ్య సంగి తిరుపతి గాసికంటి సుమన్ గాసికంటి సాగర్ గసికంటి కుమార్ ఆరుముల్ల శ్రీను గాసికంటి రమేష్ గాసికంటి కొమరయ్య ఆరుముల్ల విద్యాసాగర్ సంగి సారయ్య సంగి శంకర్ సమ్మయ్య గ్రామ ప్రజల పాల్గొన్నారు.

# ఘనంగా వినాయకుని నిమజ్జనం



**హనుమకొండ, సెప్టెంబర్ 24 మనం న్యూస్:** హనుమకొండ జిల్లా గుండ్ల సింగారం బాలాజీ బంజారా కాలనీలో బంజారా అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన గణపతి నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ముగిశాయి. నవరాత్రి ఉత్సవాల చివరి రోజు బుధవారం వినాయకుని నిమజ్జన కార్యక్రమాన్ని కమిటీ సభ్యులు, కాలనీవాసులు, భక్తులు పెద్ద ఎత్తున నిర్వహించారు. హనుమకొండ జిల్లా గుండ్ల సింగారం గ్రామంలో వినాయకుని నిమజ్జనం వర్షాన్ని సైతం లెక్కచేయకుండా కాలనీవాసులు భారీ సంఖ్యలో నిమజ్జన ర్యాలీలో పాల్గొన్నారు. ఆటపాటలు, భక్తి గీతాలు, డప్పు చప్పుళ్ల నడుమ డీజే తో వినాయకుని ఊరేగింపు నిర్వహించి, భక్తిశ్రద్ధలతో నిమజ్జనం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. చిన్నారులు, మహిళలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని ఉత్సవానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ బానోత్ కల్పన సింగ్ లాల్, మాజీ కార్పొరేటర్ లావుడియా అనుష రవి నాయక్,లావుడియా పల్లవి రాజు నాయక్, పోరిక వనిత రవినాథ్, భూక్యా మౌనిక మురళి, గుగులోత్ పావని వెంకన్న, సునావత్ జయంతి జవహర్లాల్, నూనావత్ మానస రవి, బోడ బాలమణి రాజేందర్, భూక్యా సునీత మోహన్ నాయక్, భూక్యా చంద్రకళ కిషన్, రజిత కిరణ్, భవాని కిషోర్, భూక్యా రాధా రాజు నాయక్, నునావత్ బుజ్జమ్మ లక్ష్మణ్ నాయక్, నునావత్ కుమల రమేష్, గుగులోత్ నీల శ్రీనివాస్, భూక్యా సునీత విక్రమ్ సింగ్, భూక్యా అరుణ, ఆంగోత్ శారద రవి, వాంకుడోత్ కమల దేవరాజ్, జరుపుల రాధిక బాలు నాయక్, హాలావత్ విమల తేజ నాయక్, గీతా కిరణ్, సునీత, ప్రత్యూష సురేందర్, శీలా శ్రీనివాస్, అనిత బాలాజీ, అనిత సంతోష్, మంకీ కిషన్, విజయ రాజు, రామచందర్, చంటి, భారతి తేజ, హనుమంతు నాయక్, పావని పవన్ కుమార్, బాదావత్ కమల బాలు నాయక్, రజని రవీందర్, రజిత రవీందర్, రూక్సీ యాకూబ్, రాజమ్మ వి.పి. సింగ్, పద్మ రవి, మణి కార్తీక్, ఈరమ్మ , స్వర్ణ వినోద్, విమల జట్మాల్, ప్రమోద్, రాజేశ్వరి విజయ్, అనుష పాప, సుజాత చిన్ని, జాను తిరుపతి, సుగుణ, లక్ష్మీబాయి రాజు నాయక్, రుక్మాబాయి కుటుంబ సభ్యులు, గుగులోత్ తిరుపతి, బానోత్ రాజమ్మ హరిలాల్, వనిత గోవర్ధన్ నాయక్, బుచ్చమ్మ ప్రతాప్, అనుష రవి నాయక్, భద్రమ్మ, చినారి సతీష్, కవిత శ్రీనివాస్, సుమన్ సోని, లావుడియా శారద కళ, భూక్యా అరుణ, జరుపుల రాధికా బాలు నాయక్, వసంత, శాంతిబాయి లాలు నాయక్, విజయ, గోదారి, జీవన్, మకాళి, సునీత వీరన్న, అనిల్, చౌక్లే మంజి నాయక్, మోహన్, బద్రి కిషన్, శారద శంకర్, సునీల్, తిరుపతి, వినోద్, బుజ్జి బాబూరావు రాజేందర్, గణేష్ సోగని, రమేష్, మంగా నరసింహ, అరుణ దేవేందర్, శారద రవి నాయక్, భీమా నాయక్, పావని వెంకన్న నాయక్, నవీన్ దంపతులు, దేవు నాయక్ దంపతులు, నీల శ్రీను నాయక్, సునీత వెంకటేష్, మమత, తిరుపతి, మంగిబాయి, కార్తీక్ దంపతులు తదితరులు నిమజ్జనం కార్యక్రమంలో పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ నాయకుల ముందస్తు అరెస్టు



**టేకుమట్ల సెప్టెంబర్ 24 మనం న్యూస్:** కాకతీయ థర్మల్ పవర్ ప్రాజెక్ట్లో విద్యుత్ ఉత్పత్తి, బొగ్గు సరఫరా, యూనిట్ల పనితీరు తదితర అంశాలను పరిశీలించేందుకు మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు టేకుమట్ల మండలం నుంచి బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు కాకతీయ థర్మల్ పవర్ స్టేషన్ సందర్శనకు వెళ్లేందుకు సిద్ధమయ్యారు. అయితే, తెల్లవారుజామున టేకుమట్ల మండలానికి చెందిన పలువురు బీఆర్ఎస్ పార్టీ నాయకులను పోలీసులు ముందస్తుగా అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్కు తరలించడం జరిగింది. ప్రజలకు సంబంధించిన విద్యుత్ సమస్యలు, విద్యుత్ ఉత్పత్తి పరిస్థితి, థర్మల్ పవర్ స్టేషన్ పనితీరును తెలుసుకోవడానికి ప్రజాస్వామ్య పద్ధతిలో చేపట్టిన పర్యటనకు వెళ్లకుండా నాయకులను ముందస్తుగా అదుపులోకి తీసుకోవడం పట్ల బీఆర్ఎస్ నాయకులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రజా సమస్యలపై ప్రశ్నించడం, సంబంధిత ప్రాంతాలను సందర్శించి వాస్తవ పరిస్థితులను తెలుసుకోవడం ప్రజాస్వామ్యంలో సహజమైన ప్రక్రియ అని, ఇటువంటి కార్యక్రమాలను అడ్డుకోవడం సరికాదని బీఆర్ఎస్ నాయకులు పేర్కొన్నారు. అరెస్ట్ ఐన వారిలో మండల పార్టీ అధ్యక్షులు సట్ల రవి గౌడ్, నాయకులు ఆది రఘు, పోతన వేన ఐలయ్య,కొలిపాక రాజయ్య,టేకుమట్ల సర్పంచ్ మాట్ల. శ్రీనివాస్,టౌన్ అధ్యక్షులు నిమ్మల స్వామి , మారం లింగా రెడ్డి , గువ్వాడి లక్ష్మణ్, మహేష్, ఝుఛీ అక్రమ్, పోతన వేన అరుణ్ కుమార్ లు ఉన్నారు.

# మీరా..మిలమిల

- ఆసియా క్రీడల్లో సత్తా చాటిన చాను
- నగోయా



మీరాబాయి చాను కల నెరవేరింది.. భారత కరవు తీరిపోయింది..! ఒలింపిక్స్, ప్రపంచ ఛాంపియన్ షిప్ లో పతకాలు అందుకున్నా.. అందని ద్రాక్షలా ఊరిస్తున్న ఆసియా క్రీడల పతకాన్ని స్టార్ లిఫ్టర్ మీరా ఎట్టకేలకు ఒడిసిపట్టింది. బంగారు అంచనాలతో బరిలో దిగిన ఈ మణిపురి అమ్మాయి రజతంతో మెరిసింది. 28 ఏళ్ల సుదీర్ఘ విరామానంతరం ఆసియా క్రీడల వెయిట్ లిఫ్టింగ్ లో భారత్ కు లభించిన పతకం ఇది. బుధవారం మొత్తం అయిదు పతకాలు మన ఖాతాలో చేరాయి. షూటింగ్ లో పురుషులు, మహిళల జట్లు కాంస్యాలు గెలవగా.. బ్యాడ్మింటన్లో పురుషుల జట్టుకు, సాఫ్ట్ టెన్నిస్లో జయ్ మీనాలకు కాంస్యాలు దక్కాయి.

స్టార్ వెయిట్ లిఫ్టర్ మీరాబాయి చాను అదరగొట్టింది. ఆసియా క్రీడల్లో తొలిసారి పతకం గెలుచుకుంది. 49కేజీల విభాగంలో ఆమె బుధవారం రజతం సాధించింది. చాను 198 కిలోలు ఎత్తి రెండో స్థానంలో నిలిచింది. ఆమె స్నాచ్ లో 87 కిలోలు, క్లీన్ అండ్ జెర్క్ లో 111 కిలోలు లేపింది. మల్లీశ్వరి (1998) తర్వాత ఏషియాడ్ లో పతకం గెలిచిన భారత తొలి వెయిట్ లిఫ్టర్ గా చాను ఘనత సాధించింది. ఉత్తర కొరియాకు చెందిన రెండుసార్లు ప్రపంచ ఛాంపియన్ రి సాంగ్ గమ్ 215 (94+ 121కేజీ) కిలోలు లేపి, స్వర్ణం గెలుచుకుంది. ఆసియా క్రీడల్లో ఆమెకిది హ్యాట్రిక్ టైటిల్. పసిడి గెలిచే క్రమంలో రి.. స్నాచ్, క్లీన్ అండ్ జెర్క్, టోటల్ లో ప్రపంచ రికార్డులు బద్దలు కొట్టింది. ఇండోనేసియా అమ్మాయి లులుక్ డియానా త్రి విజయానా 191 (88కేజీ+103కేజీ) కిలోలతో కాంస్య పతకం గెలుచుకుంది. టోక్యో ఒలింపిక్స్ లో రజతం గెలిచిన చాను.. ఇప్పుడు ఏషియాడ్ లో ఆత్మవిశ్వాసంతో సాగింది. స్నాచ్ లో 83 కిలోలతో మొదలెట్టిన ఆమె.. రెండో ప్రయత్నంలో 85 కిలోలు లేపింది. చివరిదైన మూడో ప్రయత్నంలో అత్యుత్తమంగా 87 కేజీలు లేపిన ఆమె.. పోటీలో మొదటి అర్ధభాగాన్ని మూడో స్థానంతో ముగించింది. క్లీన్ అండ్ జెర్క్ లో వరుసగా 107, 111 కిలోలు ఎత్తిన చాను, మూడో ప్రయత్నం చేయలేదు. ఇక 53 కిలోల విభాగంలో జ్ఞానేశ్వరి యాదవ్ ఎనిమిదో స్థానంలో నిలిచింది. మొత్తం 195 (87కేజీ+108కేజీ) కిలోలు ఎత్తింది. గ్లాస్లో కామన్వెల్త్ క్రీడల్లో ఆమె ఎత్తిన బరువు (199కేజీ) కంటే ఇది నాలుగు కిలోలు తక్కువ.



## చివరి నిమిషంలో జట్టులోకి వచ్చి.. రజతంతో మెరిసి..!

ఆసియా క్రీడల్లో భారత పతకాల వేట కొనసాగుతోంది. వుషు 60 కిలోల విభాగంలో మన అథ్లెట్ రోషిబినా దేవి రజతం దక్కించుకుంది. గురువారం జరిగిన ఫైనల్ మ్యాచ్ లో చైనా అథ్లెట్ జాంగ్ షియావు చేతిలో 0-2తో ఓటమి పాలైన రోషిబినా రెండో స్థానంతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. అయితే, ఈ టోర్నీకి చివరి నిమిషంలో ఎంపికైన రోషిబినా.. రజతంతో మెరవడం విశేషం.

మణిపూర్ కు చెందిన రోషిబినా 2018లో జరిగిన ఆసియా క్రీడల్లో కాంస్యం సాధించింది. ఆ తర్వాత 2021లో జరిగిన ఇదే పోటీల్లో రజతం సొంతం చేసుకుంది. ఈసారి కూడా సిల్వర్ మెడల్ సాధించి.. ఆసియా క్రీడల్లో హ్యాట్రిక్ విజయాలు నమోదు చేసింది. వాస్తవానికి ఈ ఏడాది ఆసియా క్రీడలకు ముందు నిర్వహించిన ట్రయల్స్ లో దివ్యాంశి చౌదరి చేతిలో రోషిబినా ఓటమిపాలైంది. దీంతో జట్టులో చోటు దక్కలేదు. కానీ, దివ్యాంశికి గాయం కావడంతో చివరి నిమిషంలో జాతీయ ఫెడరేషన్ సెలెక్టర్లు రోషిబినాను ఎంపిక చేశారు. వారి నిర్ణయం సరైందేనని ఆమె పతకంతో నిరూపించింది.

### రోయింగ్ లో కాంస్యం..

రోయింగ్ లో పురుషుల డబుల్స్ విభాగంలో భారత అథ్లెట్లు సత్నాం సింగ్, సల్మాన్ ఖాన్ కాంస్యం సాధించారు. మొదటి 1500 మీటర్ల వరకు రెండో స్థానంలో సాగిన భారత ద్వయం.. ఆఖరి 500 మీటర్ల పోటీలో మూడో స్థానానికి పడిపోయింది. దీంతో కాంస్యంతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. ఈ పోటీల్లో చైనా జోడీ స్వర్ణం సాధించగా.. ఉజ్బెకిస్థాన్ ద్వయానికి రజతం దక్కింది.

## కీలకదశకు చేరుకున్న ‘వారణాసి’.. మహేశ్ బాబు న్యూ లుక్ పోస్ట్ వైరల్



సూపర్ స్టార్ మహేశ్ బాబు హీరోగా దర్శకధీరుడు ఖిఖి రాజమౌళి ఎంతో ప్రతిష్ఠాత్మకంగా తెరకెక్కిస్తున్న చిత్రం ‘వారణాసి’. ప్రస్తుతం షూటింగ్ శరవేగంగా జరుపుకుంటున్న ఈ మూవీ కీలక దశకు చేరుకుంది. దాదాపు రెండేళ్లుగా వారణాసి చిత్రానికే అంకితమైపోయిన మహేశ్ బాబు తన పాత్ర షూటింగ్ ను చిత్రంలో ఇంట్రడక్షన్ సీన్లో వచ్చే షాట్ తో తాజాగా ముగించారు. షూటింగ్ పూర్తి చేయడంతో పాటు ఇప్పటికే డబ్బింగ్ ను కూడా ప్రారంభించినట్లు సమాచారం. 90%కు పైగా షూటింగ్ పూర్తవగా, మిగిలిన ప్యాచ్ వర్క్ ను వారణాసిలో పూర్తి చేసి షూటింగ్ కు గుమ్మడికాయ కొట్టేందుకు టీమ్ సిద్ధమవుతోంది. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన పోస్టులు నెట్టింట వైరల్ అవుతుండగా.. మహేశ్ బాబు ఫ్యాన్స్ ఫుల్ ఖుష్ అవుతున్నారు. ఇక షూటింగ్ ముగింపు దశకు చేరుకోవడంతో VFX, ఎడిటింగ్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ వంటి పోస్ట్ ప్రొడక్షన్ పనులపై రాజమౌళి ఫోకస్ పెట్టనున్నారు. కాగా.. సైన్స్ ఫిక్షన్ అండ్ హిందూ మైథాలజీ కలగలిపిన గ్లోబ్ ట్రాటింగ్ అడ్వెంచర్ గా తెరకెక్కుతోన్న ఈ చిత్రంలో ప్రియాంక చోప్రా హీరోయిన్ గా నటిస్తుండగా.. పృథ్వీరాజ్ సుకుమారన్ విలన్ పాత్ర పోషిస్తున్నాడు. ఎం.ఎం కీరవాణి సంగీతం అందిస్తున్నాడు. ప్రపంచస్థాయి విజువల్స్ తో వారణాసి చిత్రం ఏప్రిల్ 7, 2027న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు తీసుకొచ్చేందుకు ప్లాన్ చేస్తున్నారు మేకర్స్.

## విరాట్-రోహిత్.. 2027 ప్రపంచకప్ గెలవాలి: రింకు సింగ్



వచ్చే ఏడాది జరిగే వన్డే ప్రపంచకప్లో స్టార్ క్రికెటర్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ ఆడుతారా? అనే దానిపై కొంతకాలంగా చర్చ జరుగుతూనే ఉంది. ప్రతిష్ఠాత్మక టోర్నీకి వీరిని విస్మరించొద్దని కొందరు సూచిస్తుండగా.. యువ ఆటగాళ్లకు అవకాశం ఇవ్వాలనే అభిప్రాయాలూ వ్యక్తమవుతున్నాయి. దీంతో రోహిత్-విరాట్ భవిష్యత్తుపై సందిగ్ధత కొనసాగుతోంది. ఈ పరిణామాల నేపథ్యంలో టీమ్ఇండియా బ్యాటర్ రింకు సింగ్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. విరాట్-రోహిత్ కలిసి 2027 వన్డే ప్రపంచకప్ నెగ్గితే చూడాలని ఉందని ఆకాంక్షించాడు. ‘‘విరాట్ భాయ్, రోహిత్ భాయ్.. ఇద్దరూ లెజెండ్స్. వీరు ప్రపంచకప్లో ఆడాలని, ట్రోఫీ గెలుచుకునే జట్టులో భాగంగా ఉండాలని నేను మాత్రమే కాదు.. యావత్ దేశం ఆశిస్తోంది. అదే జరిగితే దేశం మొత్తానికీ అదో గొప్ప క్షణం అవుతుంది. ఎందుకంటే ఇదే వారికి చివరి ప్రపంచకప్ కావొచ్చు. ఇక, మనం చాలా కాలంగా వన్డే ప్రపంచ కప్ ను అందుకోలేదు. చివరిసారిగా 2011లో జరిగిన మెగా టోర్నీలో విజయం సాధించాం. ఇప్పుడు గెలిస్తే రోహిత్-విరాట్కి కూడా గొప్పగా ఉంటుంది. అందువల్ల వీరిద్దరూ జట్టులో ఉండి, దేశానికి ట్రోఫీ అందిస్తారని ఆశిస్తున్నా’’ అని రింకు వ్యాఖ్యానించాడు.

## అతడు నాకు సొంతమైనా క్రష్ తగ్గట్లేదు: రష్మిక



విజయ్ దేవరకొండ, రష్మిక వైవాహిక బంధంలోకి అడుగుపెట్టిన తరువాత తొలిసారి జంటగా నటిస్తున్న చిత్రం ‘రణబాలి’. సింగనమల బొబ్బిలి రణబాలిగా విజయ్ దేవరకొండ పవర్ ఫుల్ పాత్రను పోషిస్తుండగా, ఆయన భార్యగా జయమ్మ పాత్రలో రష్మిక కనిపించనున్నారు. ఈ సినిమాలోని ఇప్పటికే విడుదల చేసిన ‘ఏందయ్యా సామీ..’ పాటకు మంచి స్పందన వస్తోంది. అందులో విజయ్, రష్మికల మధ్య కెమిస్ట్రీ ఆకట్టుకుంటోంది. తాజాగా ఆ పాట క్లిప్ ను రష్మిక ఇన్ స్టా లో పంచుకుంటూ, విజయ్ పై తన ప్రేమను వ్యక్తం చేయడం విశేషం.

‘‘అతడు పూర్తిగా నాకే సొంతమయ్యాడు. కానీ తనపై క్రష్ ఏమాత్రం తగ్గడం లేదు. ఇదేం విచిత్రమో’’ అని రష్మిక పోస్ట్ చేయగా, విజయ్ దీనికి తనదైన శైలిలో రిప్లై ఇచ్చారు. ‘‘నేను ఎంతో అదృష్టవంతుడిని. జయమ్మను మిస్ అవుతాను కానీ, నువ్వు జీవితాంతం నా దగ్గరే ఉంటావు’’ అని విజయ్ స్పందించారు. వీరిద్దరి మధ్య ఉన్న అనుబంధం చూసి నెటిజన్లు ముచ్చటపడుతున్నారు. ఇదిలా ఉండగా, రాహుల్ సాంకృత్యాన్ తెరకెక్కిస్తున్న ‘రణబాలి’ దసరా కానుకగా అక్టోబరు 16న విడుదల కానుంది.

## అక్టోబర్లో సెట్స్ పైకి.. పూజా కార్యక్రమాలకు టైమ్ ఫిక్స్ చేసుకున్న RC17!

బాక్సాఫీస్ సంచలన హిట్ ‘రంగస్థలం’ తర్వాత గ్లోబల్ స్టార్ రామ్ చరణ్, డైరెక్టర్ సుకుమార్ మరోసారి జతకట్టబోతున్న విషయం తెలిసిందే. ప్రస్తుతం ‘RC17’ పేరుతో అనౌన్స్ మెంట్



వచ్చిన ఈ ప్రాజెక్టుపై ప్రేక్షకుల్లో భారీ హైప్ క్రియేట్ అయ్యింది. ఈ క్రమంలోనే ఇందులో నుంచి వచ్చే అప్డేట్స్ కోసం ఎంతో ఈగర్ గా వెయిట్ చేస్తుండగా.. తాజాగా ఈ ఎపిక్ డ్రామాకు సంబంధించిన షూటింగ్ అప్డేట్ వచ్చింది. డైరెక్టర్ సుకుమార్ ఈ చిత్రానికి సంబంధించిన పవర్ఫుల్ స్క్రిప్ట్ వర్క్ ను పూర్తి చేశారట. ప్రస్తుతం ప్రీ-ప్రొడక్షన్ పనుల్లో వేగం పెంచిన చిత్ర బృందం.. అక్టోబర్ 20న హైదరాబాద్ లో ఈ చిత్రానికి సంబంధించిన గ్రాండ్ లాంచ్, పూజా కార్యక్రమం జరిపేందుకు సిద్ధం అయ్యారట. అంతే కాకుండా త్వరలో దీనిపై అధికారిక ప్రకటన వచ్చే అవకాశాలు ఉన్నట్లు సినీ వర్గాల నుంచి సమాచారం. కాగా.. మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ ఎక్కడ రాజీ పడకుండా భారీ నిర్మాణ విలువలతో ఎంతో ప్రతిష్టాత్మంగా ఈ చిత్రాన్ని సంయుక్తంగా నిర్మించబోతున్నాయి.

## నా కారు డ్రైవర్, వాచ్ మన్ పదేపదే ఆ వీడియో చూశారు



బోల్ పాత్రలు, బోల్ కామెంట్స్ తో ఎప్పటికప్పుడు వార్తల్లో నిలిచే బ్యూటీ రాధిక ఆప్టే. లెజెండ్, లయన్ తదితర తెలుగు సినిమాల్లోనూ హీరోయిన్ చేసిన ఈమె.. తర్వాత పూర్తిగా హిందీకే పరిమితమైంది. రీసెంట్ టైంలో ఈమె 'లస్ట్ స్టోరీస్ 3' సిరీస్ లో నటించింది. దీని ప్రమోషన్లలో భాగంగా తనకు గతంలో ఎదురైన చేదు అనుభవాన్ని పంచుకుంది. తన ఇంటిమేట్ సీన్ లీకైన కారణంగా నరకం అనుభవించానని చెప్పుకొచ్చింది.

'ఓసారి నేను నటించిన ఇంటిమేట్ సీన్ లీక్ కావడంతో నాలుగురోజుల పాటు ఇంటి గుమ్మం దాటలేకపోయాను. ఇరుగుపొరుగు వాళ్లు నా వీడియో చూస్తున్నారని తెలిసి నరకం అనుభవించాను. నా కారు డ్రైవర్, ఇంటి వాచ్ మన్ పదేపదే ఆ వీడియో చూశారు. నేను చేసిన సీన్ చూసిన బయటవాళ్లు ఎక్కడ నా ఇంటికి వచ్చేస్తారోనని భయపడ్డాను. ఆ అనుభవం భద్రత విషయంలో నన్ను భయపెట్టింది. ఈ వీడియోలో నటించిన టైంలో ఒంటరిగా నివసిస్తుండడంతో నా డ్రైవర్, నా వ్యక్తిగత సిబ్బందితో మాట్లాడాలని నిర్ణయించుకున్నాను. వాళ్లకు ఫోన్ చేసి పరిస్థితి వివరించాను. ఆ క్లిప్ చూశారా? ఒకవేళ చూసినా మీరు నాతో కలిసి పనిచేయడానికి రెడీగా ఉంటేనే రండి అని చెప్పాను. నా పరిస్థితి అర్థం చేసుకున్న వాళ్లు నాకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు'

'అలానే ఓసారి యాక్షన్ సీన్ చేసేటప్పుడు షర్ట్ గుండీలు తీసి నటిస్తారా? అని నన్ను అడిగారు. యాక్షన్ సీక్వెన్స్లో శరీరాన్ని వేగంగా కదిలిస్తాం కాబట్టి కుదరదని చెప్పాను. అయినా సరే ఆ వ్యక్తి నన్ను వినిపించుకోకుండా కనీసం లో దుస్తులైన ధరించి ఆ సీన్ చేయమని ఒప్పించే ప్రయత్నం చేశాడు. నేను ఒప్పుకోలేదు. సినిమాని హిట్ చేయడం కోసం మహిళలని వారి పరిధి దాటేలా ఒత్తిడి చేయడం కరెక్టా?' అని రాధిక ఆప్టే ఆవేదన వ్యక్తం చేసింది.

## వైల్డ్గా రణబీర్ కపూర్ ఫస్ట్ లుక్



సంజయ్ లీలా భన్సాలీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న హై-ప్రొఫైల్ ఎంటర్ టైనర్ ‘లవ్ అండ్ వార్’. బాలీవుడ్ క్యూట్ కపుల్ రణబీర్ కపూర్, అలియా భట్ జంటగా, విక్కీ కౌశల్ ప్రధాన పాత్రలో నటిస్తున్న ఈ చిత్రం నుంచి తాజాగా అదిరిపోయే అప్డేట్ ఇచ్చారు మేకర్స్. లవ్ అండ్ వార్ చిత్రం వచ్చే ఏడాది జనవరి 21న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రాబోతున్నట్లు తెలుపుతూ.. రణబీర్ ఫస్ట్ లుక్ పోస్టర్ ను విడుదల చేశారు. ఇందులో రణబీర్ వింటేజ్ కార్ డ్రైవ్ చేస్తూ, వైట్ టీషర్ట్, గ్లాసెస్, షార్ట్ బజ్ కట్తో కనిపిస్తున్న రణబీర్ లుక్ సింపుల్ గా ఉన్నా.. రక్తంతో గాయపడిన చేతిని మాత్రం హైలెట్ గా చూపిస్తూ క్యూరియాసిటీ పెంచేశారు టీమ్. కాగా.. ఈ సినిమాకు సంబంధించిన ప్రధాన షూటింగ్ ఇప్పటికే పూర్తయింది. అయితే వార్ సీక్వెన్స్ల కోసం రణ్బీర్, అలియా, విక్కీతో అదనపు షూట్ జరిగినట్లు కూడా తెలుస్తోంది. ఈ సినిమాకు సంబంధించిన మరో విశేషం ఏంటంటే.. లవ్ అండ్ వార్ ఇంకా థియేటర్లోకి రాకముందుకే ఈ సినిమా ఖీఖీ హక్కులు నెట్ ఫ్లిక్స్ భారీ ధరకు సొంతం చేసుకుంది.

Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at Sree Seshasai Enterprises Plot No:19, IDA Balanagar, Medchal-Malkajgiri Dist, Hyderabad-500037.Telangana state and Published From : Samrat Complex, Block A , Flat No : 8A, Saifabad, OPP : A G Office, Beside: Aranya Bhavan, Hyderabad, Pin : 500004, Telangana State, EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.TELTEL/2016/72952.